

సామ్రాట్ అశోక

మగధసామ్రాజ్య రాజధాని ఉద్యాన వనాలతో, ఫలవృక్షాలతో నిండిన సుందర నగరం. నగర ప్రజలకు ప్రకృతి అంటే ఎంతో మక్కువ. అందుకే రాజమార్గాలకూ, వీధులకూ ఇరువైపులా నీడనిచ్చే పుష్ప, ఫల వృక్షాలు నాటి పెంచారు. నగరంలో ఎక్కడ చూసినా పరిమళ పుష్పాలే. ఈ కుసుమాల కారణంగానే నగరంలో ఒక భాగానికి కుసుమపురం అని పేరు వచ్చింది. ఇక్కడ పాటలీపుష్పాలు విరివిగా పూయడం వల్ల ఈ నగరానికి పాటలీపుత్రం అనే సార్థక నామం ఏర్పడింది.

గంగా, సోనే నదులు సంగమించే చోట, దాదాపు రెండువేలా ఐదువందల సంవత్సరాలకు పూర్వం అజాతశత్రువు అనే రాజు ఒక కోటను నిర్మించాడు. ఆ తరవాత రెండు శతాబ్దాలకు చంద్రగుప్తుడనే రాజు ఆ కోటను విస్తరించి, బలపరిచాడు. ఇప్పుడు బ్రహ్మాండమైన ఆ కోటలో ఐదువందలా డెబ్భై బురుజులూ, అరవైనాలుగు ద్వారాలూ ఉన్నాయి!

మగధను పాలించిన నందవంశం రాజులకు ఎదురుతిరిగాడు చంద్రగుప్తుడు. పసివాడుగా ఉన్న చంద్రగుప్తుణ్ణీ, అతని తల్లినీ నందవంశీకులు అవమానించారు. ఆఖరికి చంద్రగుప్తుణ్ణి పట్టి శిక్షించమని నందరాజులు భటులనుపురమాయించారు. అయితే,అతడు వారికి పట్టుబడలేదు. నగరం నుంచి తప్పించుకున్నాడు.

ప్రపంచ విజేత కావాలన్న పట్టుదలతో గ్రీకుచక్రవర్తి అలెగ్జాండర్ భారతదేశం మీదికి దండయాత్ర సాగించిన రోజులవి. చంద్రగుప్తుడు నిర్భయంగా అలెగ్జాండర్ సమక్షానికివెళ్ళి, దండయాత్రను అధిక్షేపించి

అతనికి తారసపడ్డాడు. ఉభయుల లక్ష్యం ఒక్కటే – అది నందవంశ నిర్మూలనం! చంద్రగుప్తుడి ధైర్యసాహసాలకు చాణక్యుడి విద్యావివేకాలు దారి చూపాయి. అరణ్య మధ్యంలో రహస్యంగా సైనికులను సమీక రించి, వారికి తగిన శిక్షణనిచ్చారు. హఠాత్తుగా మగధ మీదికి దాడిజరిపి, అప్పటికే ప్రజాభి మానాన్ని కోల్పోయిన ధననందుణ్ణి రాజ్య భ్రష్టుణ్ణి చేసి సింహాసనాన్ని చేజిక్కించు కున్నారు. చాణక్యుడు ప్రధాన మంత్రిగా, చంద్రగుప్తుడు మగధ రాజ్యానికి రాజయ్యాడు. ఒకప్పుడు మగధ రాజ భవనంలో అవమా నానికిలోనైన తన తల్లి ముర పేరు మీదుగా మౌర్యవంశాన్ని స్థాపించి చంద్రగుప్తుడు కన్న తల్లి గౌరవం నిలబెట్టాడు!

ఆయన్ను పరిహసించాడు. అతన్ని పట్టు కోమని అలెగ్జాండర్, సైనికులను ఆజ్ఞాపిం చాడు. కాని గుర్రాలపై తనను వెంబడిం చినగ్రీకుసైనికులకు పట్టుబడకుండా పసి వాడైన చంద్రగుప్తుడు శరవేగంతో పరిగెత్తి పారిపోయాడు.

అటువంటి ఆవేశపరుడూ, దుడుకు స్వభావం కలవాడూ అయిన చంద్రగుప్తుడు మగధ సింహాసనాన్ని ఎలా అధిరోహించగలి గాడు? నిప్పుకు గాలి తోడైనట్టు, అతనికి చాణక్యుడనే పండితుడి సహాయం లభిం చింది. చాణక్యుడుకూడా ధననందుడి చేత అవమానించబడ్డాడు. నందవంశ నిర్మూల నమే తన జీవిత లక్ష్యంగా శపథం చేసి, చాణక్యుడు ఊరు వదిలిపెట్టాడు. ఆ సమ యంలోనే నవయువకుడైన చంద్రగుప్తుడు

అప్పటికే అలెగ్జాండర్ మరణించాడు. అయినా, పంజాబు వరకు గ్రీకుసామ్రాజ్యం విస్తరించి ఉన్నది. చంద్రగుప్తుడు తన సేన లను గ్రీకుసామ్రాజ్య సరిహద్దుల కేసి నడిపి, కొందరు గ్రీకు సామంతులను ఓడించి కొన్ని పరగణాలను ఆక్రమించుకున్నాడు. అప్పుడు ఆ ప్రాంతాన్ని అలెగ్జాండర్‌సేనా నాయకుడు సెల్యూకస్ పరిపాలిస్తున్నాడు. చంద్రగుప్తుడి దాడిని గురించి విన్న సెల్యూ కస్, గ్రీసు నుంచి వచ్చి, కోల్పోయిన ప్రాంతాలను తిరిగి రాబట్టుకోవడానికి చంద్ర గుప్తుడితో యుద్ధానికి దిగాడు. కాని మగధ సేనలు గ్రీకు సేనలను బలంగా ఎదుర్కో వడంతో, సెల్యూకస్ చంద్రగుప్తుడితో సంధి కుదుర్చు కున్నాడు. పైగా, ఆయన తన కుమార్తె ఎథీనాను చంద్రగుప్తుడికిచ్చి వివాహం జరిపించాడు!



ఆ తరవాత చంద్రగుప్తుడు మాళ్వ, ఘూర్జర, సౌరాష్ట్ర ప్రాంతాలను ఒక్కొక్కటిగా జయించి తన రాజ్య సరిహద్దులను విస్తరింపజేశాడు. ఆయన వివేకవంతుడూ, శక్తిసంపన్నుడూ అయిన గొప్ప రాజుగా కీర్తిగాంచాడు.

చంద్రగుప్తుడి అనంతరం, ఆయన కుమారుడు బిందుసారుడు మగధ సింహాసనాన్ని అధిష్ఠించాడు. తండ్రి దీక్షతో పెంచిన రాజ్య సంపదనూ, నెలకొల్పిన శాంతి భద్రతలనూ బిందుసారుడు దక్షతతో కాపాడాడు. ముఖ్య పరగణాలకు తక్షశిల, ఉజ్జయిని ప్రధాన నగరాలుగా వెలిశాయి.

బిందుసారుడు పరిపాలన సాగిస్తూన్న కాలంలో, ఒకనాడు ఒక పేద బ్రాహ్మడు, చాలా దూరంనుంచి రాజధానీ నగరమైన పాటలీపుత్రానికి వచ్చాడు. ఆ బ్రాహ్మడి వెంట ఒక అందమైన యువతి ఉన్నది. ఆమె అతని కూతురు. అతడు రాజభవనం ప్రధానద్వారం సమీపించి అక్కడున్న కాపలా భటులతో రాజుగారిని దర్శించాలన్నాడు.

కాపలాభటులు ఆ బ్రాహ్మణ్ణి ఎగా దిగా చూసి, "తమరు ఏ రాజ్యానికి మహారాజులు? ఈ మహారాణి ఎవరు? తమకు రాజుగారే స్వయంగా స్వాగతం పలకాలా?"అని పరిహసించారు.

బ్రాహ్మడు, "అయ్యలారా! నేను పల్లెటూరి వాణ్ణి, మహారాజుగారిని అగత్యం చూడాలి. దయతలచి సహాయం చేయండి. నాకు సాయపడ్డారంటే మునుముందు మీకు శుభం కలుగుతుంది!" అన్నాడు నెమ్మదిగా.

బ్రాహ్మడి మాటలు విని కాపలా భటులు ఆలోచనలో పడ్డారు. అతని పక్కన నిలబడి ఉన్న యువతి శాంత గంభీరంగా ఉన్నది. కాపలాభటుల నాయకుడు బ్రాహ్మణ్ణి సమీపించి, "మీరు మహారాజును ఎందుకు దర్శించాలనుకుంటున్నారు?" అని అడిగాడు.

"అది ఇతరులతో చెప్పరాని పరమ రహస్యం! మహారాజుగారికి మాత్రమే విన్నవించగలను!" అన్నాడు బ్రాహ్మడు.

"రాజదర్శనం కావాలంటే మీ ఉద్దేశాన్ని, ముందుగా మంత్రిగారికైనా తెలియజేయాలి!" అన్నాడు భటుడు.

బ్రాహ్మడు ఏదో చెప్పబోతూండగా, లోపలినుంచి గుర్రాల డెక్కల చప్పుడు వినిపించింది. ఎవరోగుర్రంమీద రాజభవనం నుంచి వస్తున్నారు.

"తప్పుకోండి! తప్పుకోండి!" అని భటులు హెచ్చరిస్తూ వచ్చారు. కాపలా భటుడొకడు



బ్రాహ్మణ్ణి పట్టి వెనక్కు తోశాడు. బ్రాహ్మడు వెనక ఉన్న కూతురి మీద పడడంతో, ఆమె నేలపై పడిపోయింది. అప్పటికే అక్కడికి గుర్రం మీద వచ్చిన బిందుసారుడు పగ్గాలు లాగి గుర్రాన్ని ఆపాడు. కాపలా భటులు రాజుకు నమస్కరించారు. ఆయన వారిని మందలించి, కిందపడివున్న వారిని చూశాడు. బ్రాహ్మడు మెల్లగా పైకి లేచి, వణుకుతూన్న కంఠస్వరంతో, "మహాప్రభూ! ఇందులో కాపలాభటుల తప్పేమీ లేదు. నేను, తమ దర్శనభాగ్యం ఎలా లభిస్తుందో అని వీళ్ళను అడుగుతున్నాను. ఇంతలో తమరు ఇటు వచ్చారు!" అన్నాడు.

"నువ్వు, నన్ను ఎందుకు చూడాలనుకున్నావు? ఆ అవసరం ఎందుకు కలిగింది?" అని అడిగాడు రాజు.

"అది రహస్యం. రహస్యంగానే చెప్పాలి!" అన్నాడు బ్రాహ్మడు వినయంగా.

ఈలోగా బ్రాహ్మడి కూతురు లేచి నిలబడి, రాజుకు నమస్కరించింది. చింపిరి జుట్టుతో, మట్టికొట్టుకుపోయిన బట్టలతో ఉన్నప్పటికీ ఆమె ముగ్ధమనోహరంగా కనిపించింది. రాజు తనను చూస్తూండగా ఆమె సిగ్గుతో తల దించుకున్నది. రాజు గుర్రం పైనుంచి దిగి, పగ్గాలను పక్కనున్న భటుడికి అందించి, బ్రాహ్మడికేసి రమ్మనట్టుచూసి, భవనం లోపలికి వెనుదిరిగాడు. కూతురితో సహా బ్రాహ్మడు రాజును అనుసరించాడు. రాజు వారిని, ఒక విశాలమైన గదిలోకి తీసుకు పోయి, తాను అక్కడున్న ఒక ఆసనంలో కూర్చుంటూ, "సరే, నువ్వు చెప్పాలనుకున్న దేదో ఇప్పుడు చెప్పు!" అన్నాడు.



బ్రాహ్మడు రాజుకు మళ్ళీ నమస్కరించి, "నా మాటలలో ఏదైనా అవివేకం ఉంటే ప్రభువులు నన్ను క్షమించాలి. నేను కేవలం విధికి దూతగా మాత్రమే వ్యవహరిస్తున్నాను. నా కుమార్తె శిశువుగా ఉన్నప్పుడు మా ఇంటికి ఒక సాధువు వచ్చాడు. ఆయన నా బిడ్డను దీవించి, పెరిగి పెద్దదై ఆమె మహారాణి అవుతుందని సెలవిచ్చి వెళ్ళాడు. ఒక నిరుపేద కూతురు రాజ్యానికి మహారాణి కావడమేమిటి? ఇంతకన్నా చోద్యమేముంటుందిలే అని నేను సాధువు మాటలను ఉదాసీనం చేశాను, ఆమె యుక్తవయస్కురాలయ్యాక, వివాహం చేయాలని వరుడి కోసం అన్వేషణ ప్రారంభించాను. ఆ సమయంలో ఆమె జాతకచక్రాన్ని పరిశీలించిన జ్యోతిష్కులు అమితాశ్చర్యం చెంది, ఆమె మహారాణి అవుతుందని ఘంటాపథంగా చెప్పారు!" అన్నాడు.



ఆ మాటలు విని రాజు ఆశ్చర్యంతో, ఆ యువతికేసి చూశాడు. ఆమె సిగ్గుతో నేల చూపులు చూడసాగింది.

బ్రాహ్మడు మళ్ళీ, "మహాప్రభూ! నాకు తెలిసిన మహారాజు మీరొక్కరే. అందుకే ఇక్కడికి వచ్చాను. నాకు తమ దర్శన భాగ్యం లభించడంలో కూడా విధి అదృశ్య హస్తం ఉన్నట్టుగానే నేను భావిస్తున్నాను. తమరే గనక, సమయానికి భవనం నుంచి రాలేదంటే నా గతి ఏమయ్యేదో నాకే తెలియదు. ఇప్పుడు నా కుమార్తె సుభద్రను తమకు సంతోషంగా సమర్పిస్తున్నాను. దయతో స్వీకరించండి!" అన్నాడు.

"ఇప్పటికే నాకు పలువురు రాణులున్నారు. నీ మాట ప్రకారం నీ కుమార్తెను వివాహమాడినా, ఆమె మహారాణి ఎలా కాగలుగుతుంది?" అని అడిగాడు రాజు కాస్త అనుమానంగా.

"అది నాకు తెలియదు. అంతా విధి ప్రకారం జరుగుతుంది!" అన్నాడు బ్రాహ్మడు.

రాజు చిరుదరహాసంతో, బ్రాహ్మణకుమారి వైపు చూసి, భటుడి ద్వారా రాజభవనంలోని ప్రధాన పరిచారికను పిలిపించి, "నేను తిరిగి వచ్చేవరకు ఈ యువతికి ఎటువంటి కొరతాలేకుండా తగినమర్యాదలు జరిపించు," అన్నాడు.

పరిచారిక ఆ యువతిని సమీపించింది. రాజు లేచి భవనం వెలుపలికి నడిచాడు.

అక్కడినుంచి బయలుదేరడానికి సిద్ధమవుతున్న తండ్రిని సజలనయనాలతో చూస్తూ, "నాన్నా!" అని పిలిచింది సుభద్ర.

"నా కర్తవ్యం నెరవేర్చాను తల్లీ. ఇకపై నేను ఇక్కడ ఉండకూడదు. ఉన్నట్టయితే నలుగురూ పరిహసించగలరు. నీ తండ్రిగా నా బాధ్యతను తీర్చుకున్నాను. అంతే చాలు!" అన్నాడు బ్రాహ్మడు.

"నాన్నా! నన్ను వదిలి వెళ్ళకు!" అన్నది సుభద్ర బాధగా. "అదేంమాట తల్లీ! అయినా, నువ్వు ఇక్కడ ఒంటరిదానవు కావు. నీకు విధితోడు ఉంటుంది. నిన్ను ఇక్కడికి చేర్చిన విధే నిన్ను సర్వవేళలా కవచంలా రక్షిస్తుంది. బాధపడకు," అంటూ బ్రాహ్మడు కుమార్తెను ఓదార్చి, ఒకసారి ఆమెను తనివితీరాచూసుకుని, పెల్లుబుకుతూన్న కన్నీళ్ళను తుడుచుకుంటూ భవనం వెలుపలికి నడవలేక నడిచి వెళ్ళాడు!

తండ్రి వెళ్ళిన వైపే చూస్తూ, మౌనంగా రోదిస్తూన్న సుభద్రను, పరిచారిక మెల్లగా

భవనం లోపలికి నడిపించింది. సుభద్రను చూడగానే రాజభవనంలో కలకలం బయలుదేరింది. రాణుల పరిచారికలు, సేవికలు తమలో తాము గుసగుసలాడుకోసాగారు.

"ఈమె అందం చూస్తూంటే పల్లెటూరి బ్రాహ్మడి కూతురు అని నమ్మ శక్యం కావడం లేదు. మారువేషంలో వున్న ఏ రాజకుమార్తె లాగానో ఉన్నది," అన్నది ఒక పరిచారిక సుభద్ర రూపం చూసి ఆశ్చర్యంతో.

"రాజుగారు ఈయువతిని వివాహమాడారంటే మిగతా రాణులను మరిచి పోవడం ఖాయం," అన్నది మరొక పరిచారిక.

చాటునుంచి వారి మాటలు విన్న ముగ్గురు రాణులూ, అసూయతో నిట్టూర్చి తమ మందిరాలకు వెళ్ళిపోయారు.

ప్రధాన పరిచారిక సుభద్రకు ఒక విశాలమైన గది చూపించి,భోజనం పెట్టి, ధరించడానికి నూతన వస్త్రాలు తెచ్చి ఇచ్చింది.

మరునాడు తెల్లవారగానే బిందుసారుడు రాజభవనం వదిలి పెట్టాడు. రాజ్య సరిహద్దు ప్రాంతాలలో కొందరు సామంతులు తిరుగుబాటు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసి, వారిని అణచడానికి సైన్యంతో వెళ్ళాడు. ఆయన వెళ్ళిన పని సాధించి తిరిగి రావడానికి రెండు నెలలు పట్టింది. రాజు తిరిగి వచ్చే వరకు ప్రధాన పరిచారిక సుభద్రకు అన్ని సౌకర్యాలూ సమకూర్చింది. కాని, తిరిగి వచ్చాక రాజు సుభద్రను గురించి మాట మాత్రమైనా అడగక పోయేసరికి, ఆయన ఆమెను పూర్తిగా మరిచి పోయాడని ప్రధాన పరిచారిక గ్రహించింది.

రాజు సుభద్రను పెళ్ళాడితే, ఆయనకు తమ పట్ల ఉన్న అనురాగం తరిగి పోగలదన్న అనుమానంతో రాణులు ముగ్గురూ రాజు ఆమెను మరిచిపోయేలా చేయాలని మాంత్రికుల ద్వారా రహస్యంగా మంత్ర తంత్రాలు ప్రయోగించ సాగారు.

రాణుల ప్రోద్బలంతో ప్రధాన పరిచారిక, సుభద్రను తేలికచేసి అవమానించసాగింది. ఆమెకు రాణులగోళ్ళు కత్తిరించడం వంటి పనులను పురమాయించింది. తమ పనులు సక్రమంగా చేయడంలేదని రాణులు సుభద్రను అవమానించి హింసించసాగారు. ఇంత జరిగినా సుభద్ర అన్నిటినీ మౌనంగా భరించిందే తప్ప, తన బాధలను ఎవరితోనూ నోరువిప్పి చెప్పుకోలేదు. ఇలా రెండేళ్ళు గడిచిపోయాయి.

ఒకనాడు సూర్యోదయంవేళ రాజు ఉద్యానవనంలో నడుస్తూండగా పచ్చికలోని ముల్లు ఆయన కాలికి గుచ్చుకున్నది. రాజు పక్కనే ఉన్న ఆసనంలో కూర్చుని, చేతులు చరిచాడు. భటుడు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"కాలిలో ముల్లు గుచ్చుకున్నది. క్షురకుణ్ణి తీసుకురా!" అన్నాడు రాజు.

ఇలాంటి పనులు చేయడంలో క్షురకులు చాలా నేర్పరులు. కాని ఆ సమయంలో రాజభవనంలో అటువంటి వారెవ్వరూ కనిపించ లేదు. భటుడు ఇటూ అటూ చూసి ఎదురు పడినసుభద్రతో, "రాజుగారి పాదంలో ముల్లుగుచ్చుకున్నది. నువ్వు వెళ్ళి తియ్!" అన్నాడు.

సుభద్ర తడబడుతూ రాజును సమీపించింది. ఆయన పాదాలవద్ద నేల మీద కూర్చుని, పాదంలో గుచ్చుకున్న ముల్లును సుతారంగా తీసివేసింది.

"రాజభవనంలో లోగడ నిన్నెప్పుడూ చూసినట్టు లేదే!" అన్నాడు రాజు ఆమెతో.

సుభద్ర సమాధానం చెప్పలేదు. కాని ఆమె కళ్ళనుంచి బాష్పాలు పెల్లుబికాయి.

"ఇక్కడ నువ్వెంతకాలంగా ఉంటున్నావు?" అని అడిగాడు రాజు.

"మా నాన్న, నన్ను మీకు సమర్పించిన రోజునుంచిప్రభూ!" అన్నది సుభద్ర పొంగుతూన్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ.

రాజు ఆమెను మరొకసారి పరిశీలనగా చూశాడు. ఆమె తండ్రి ఆమెను తనకు సమర్పించిన విషయం ఆయన స్మృతిపథంలో తళుక్కున మెరిసింది. ఆ విషయాన్ని తనకు గుర్తుచేయని ప్రధాన పరిచారిక మీద రాజుకు మొదట ఆగ్రహం కలిగింది. కొంతసేపటికి తన మతిమరుపుకు తన మీదేకోపం వచ్చింది. తన పొరబాటుకు ఎవరినినిందించి ఏంలాభంఅనుకుని, సుభద్రతో, "సరే, జరిగిన జాప్యమేదో జరిగిపోయింది. నీకు జరిగిన అన్యాయాన్ని వెంటనే రూపుమాపాలి. కాబట్టి ఈ రోజు సూర్యాస్తమయంలోగా నిన్ను వివాహమాడతాను!" అన్నాడు.

వెంటనే ఆయన మంత్రులనూ, పురోహితులనూ పిలిపించి, విషయం తెలియజేసి,వివాహానికి కావలసిన ఏర్పాట్లుచేయమని ఆజ్ఞాపించాడు. – (ఇంకావుంది)





సామ్రాట్ అశోక

2

[మగధ రాజధాని పాటలీపుత్రంలో చాణక్యుడి సాయంతో చంద్రగుప్తుడు రాజై, మౌర్య వంశాన్ని స్థాపించాడు. చంద్రగుప్తుడి అనంతరం ఆయన కుమారుడు బిందుసారుడు రాజయ్యాడు. ఒకనాడు ఒక పేదబ్రాహ్మడు, తన కుమార్తె సుభద్రను వెంటబెట్టుకునివచ్చి,ఆమె మహారాణి అవుతుందని జ్యోతిష్కులు చెప్పారని రాజుకు అప్పగించి, వివాహమాడమన్నాడు. రాజు అప్పటికి సరే అన్నాడు గాని. రాజ్యవ్యవహారాలలో పడి ఆ విషయం మరిచిపోయాడు. రెండేళ్ళ తరవాత ఆయనకావిషయం జ్ఞాపకం రాగానే, సూర్యాస్తమయంలోగా సుభద్రను వివాహమాడాలని నిర్ణయించాడు. తరవాత-]

రాజాజ్ఞ కాగానే, సుభద్రను వివాహమాడే విషయం భటులు చాటింపు ద్వారా ప్రజలకు తెలియజేశారు. నగర వీధులనుఅరటిచెట్లతో, మావితోరణాలతో, రంగురంగుల పువ్వులతో అలంకరించారు.నగరం వింత శోభతో కళకళ లాడసాగింది.

అదృష్టవశాత్తు సుభద్ర తండ్రి అయిన బ్రాహ్మడు, తనకుమార్తె రాజభవనంలో ఎలా వుందో చూసిపోదామని ఆరోజే రాజధానికి వచ్చాడు.తన కుమార్తె వివాహం అప్పుడే జరగనున్నదని గ్రహించి పరమానందం చెందాడు.ఆయన రాజభవనం సమీపి స్తూండగా, ఆయనను ఆహ్వానించడానికి రాజభటులు గ్రామానికి ప్రయాణమవుతూ న్నట్టు తెలియవచ్చింది. ఆయన్ను చూడగానే, భటులుఆదరంగా రాజభవనంలోకి తీసుకు వెళ్ళారు. మరికొంత సేపటికి మేళతాళాలతో, వేదమంత్రాలతో, ఆస్థానజ్యోతిష్కులు నిర్ణ

యించిన శుభఘడియలలో రాజు బిందుసారుడు, మాట ఇచ్చిన ప్రకారం సూర్యాస్తమయంలోగా సుభద్రను వివాహమాడాడు. సుభద్రతండ్రి, నూతన దంపతులను ఆనంద బాష్పాలతో ఆశీర్వదించాడు.

రెండేళ్ళపాటు రాజభవనంలో మామూలు పరిచారిక లాగా జీవితం గడిపిన సుభద్ర, ఇప్పుడు సర్వాలంకారభూషిత అయిన రాణి అయింది. అవసరాలు సమకూర్చడానికి పలువురు పరిచారికలతో ఆమెకు ప్రత్యేకంగా ఒక భవనం ఏర్పాటయింది.

ఇన్ని సంపదలు సమకూరిన తరవాత ఆమె సంతోషానికి తక్కువే ముంటుంది? కాని, ఆమెకు సంతోషంగా ఉండే భాగ్యం కలగలేదు. రాజుగారి పెద్దరాణులు సమయం దొరికితేచాలు; ఆమెను సూటిపోటి మాటలతో వేధించసాగారు: "అదిగో చూడు, ఆ బిక్షగాడి కూతురు ఎంత అహంకారంతో మిడిసిపడుతున్నదో!" అని ఒక రాణి అంటే, "బ్రాహ్మణ కన్యలు ఇలా సిగ్గువిడిచి రాజభవనాలమీద పడితే మనం రాజకుమార్తెలుగా పుట్టడమెందుకు?" అని మరొక రాణి వంతపాడేది.

"ఈ నడమంత్రపుసిరి, మరి ఎంతకాలం ఉంటుందో అదీ చూడకపోతామా?" అని మూడోరాణి అంటే, మిగతా ఇద్దరూ పకపకా నవ్వేవారు హేళనగా.

సూదుల్లాంటి వారి మాటలకు సుభద్ర హృదయం విలవిలలాడేది. అయితే, ఆమె మౌనంగా రోదించేదే తప్ప, ఆ సంగతి తన భర్తఅయిన రాజుతో కూడా చెప్పేది కాదు. ఆమెస్వభావం అటువంటిది. పైగా రాజురాజ్య వ్యవహారాలలో తలమునకలుగా ఉన్నాడు. రాజభవనంలో జరిగే వ్యవహారాలను పట్టించుకునే స్థితిలో లేడు.

సుభద్ర అంటే తొలినుంచి అనురాగం చూపే ఒక వృద్ధపరిచారిక, ఒంటరిగా విలపించే సుభద్రను, "నువ్వంటే వాళ్ళకు ఎంతో అసూయ తల్లీ! అందుకే నిన్నిలా వేధిస్తున్నారు. వాటన్నిటినీ పట్టించుకోవద్దు. ఈ భవనంలో వాళ్ళకున్న అధికారం, నీకూ ఉన్నది!" అని ఓదార్చేది.

ఆ మాటలకు సుభద్ర చిన్నగా నవ్వేది. అయితే, ఆనవ్వులో సంతోషంకన్నా, విషాదం పాలు ఎక్కువగా కనిపించేది.

ఇలా ఒక యేడాది గడిచింది. సుభద్ర ఒక మగబిడ్డను ప్రసవించింది. కాంతులు వెదజల్లే ఆ బిడ్డమోము చూస్తూ, "నీ రాకతో నాశోకంతీరిపోయింది నాన్నా! నా శోకంతీర్చ

డానికి పుట్టిన అశోకుడివి నువ్వు!" అంటూ రెండు చేతులతో ఎత్తుకుని ముద్దాడేది. ఆ బిడ్డకు అశోకుడనే పేరు స్థిరపడి పోయింది.

అశోకుడు జన్మించడానికి ముందే పెద్ద రాణులు ముగ్గురు, ఐదుగురు కొడుకులను కన్నారు. వారిలో సుశేముడనే వాడు పెద్దవాడు. అందరూ అతన్ని చిన్నప్పటి నుంచే యువ రాజుగా భావించసాగారు. కాబట్టి రాజోద్యో గులు అతనిపట్ల అమితమైన గౌరవమర్యా దలు ప్రదర్శించ సాగారు. దాంతో అతనిలో అహంకారం పెరగసాగింది. తన ఇష్టానికి భిన్నంగా నడుచుకునే వారిమీద దురుసుగా ప్రవర్తించే వాడు. తన మాటకు మారుపలికే వారిమీద విరుచుకుపడేవాడు. తను చెప్పి నట్టు చేయకపోతే సేవకులను కొట్టేవాడు. అయినా, కాబోయే రాజు అన్నభయంతో అతనికి ఎవరూ ఎదురుచెప్పేవారు కాదు.

సుశేముడు అశోకుడికన్నా మూడేళ్ళు పెద్ద. వాళ్ళిప్పుడు నవయౌవన ప్రాయంలోఉన్నారు. వాళ్ళిద్దరూ ఒకనాడురాజోద్యానంలో విహ రిస్తూండగా, అటువైపు వచ్చిన తోటమాలి అశోకుడికి నమస్కరించాడు. చాటునుంచి హఠాత్తుగా ఒక దెబ్బతో తోట మాలిని కింద పడద్రోసి, "నన్నే అవమానిస్తావా?" అని అరి చాడు సుశేముడు.

తోటమాలి మెల్లగా లేచి నిలబడి, "తమర్ని నేనెందుకు అవమానిస్తాను ప్రభూ!" అన్నాడు.

"అయితే, నన్ను వదిలి, నా ఎదుట ఈ బిచ్చగత్తె కొడుక్కు ఎందుకు నమస్కరిం చావు?" అని గద్దించాడు సుశేముడు.

"అన్నయ్యా, మాటలు మర్యాదగా రానీ. మీతల్లి నాకుతల్లి అయినట్టే, నా తల్లి కూడా నీకుమాతృసమానురాలే!"అన్నాడు అశోకుడు.

"ఛీ, నోర్ముయ్! మరోసారి ఆ మాట అనకు. నీ తల్లి నాకు తల్లీ కాదు; నా తల్లి నిన్ను తన కొడుకుగా భావించడం, ఈజన్మలో జరగదు!"అన్నాడు సుశేముడు వెటకారంగా.

"మనమిద్దరం బిందుసార మహారాజు కుమారులం. మీ తల్లిలాగే నా తల్లి కూడా రాజుగారినివివాహమాడిన ధర్మపత్ని! నాతల్లిని అవమానిస్తే అది మన తండ్రిని అవమానిం చినట్టే అవుతుంది!" అన్నాడు అశోకుడు నెమ్మదిగా.

"నిన్నూ, నీతల్లినీ అవమానించడం నాకు ఆనందకరమైన విషయం! నువ్వేం చేయగ లవు?"అన్నాడుసుశేముడు పట్టరానిగర్వంతో.

"అందుకు నీనుంచి క్షమాపణలు చెప్పిం చడమే నాకు ఆనందకరం!" అంటూ అశో

కుడు సుశేముడి చేయి వడిసిపట్టుకుని వెనక్కు మెలితిప్పాడు.

సుశేముడు వదలమని బాధతో అరిచాడు. కాని అశోకుడు వదలేదు. తోటమాలి ఉద్యాన వనంనుంచి వెలుపలికివచ్చి, అటుగా వెళు తూన్న మంత్రికి విషయం చెప్పాడు.

మంత్రి అక్కడికివచ్చి, "ఆయన్ను వదిలి పెట్టు, వదిలిపెట్టు," అని అరిచాడు.

అశోకుడు సుశేముడి చేయివదలి మంత్రి కేసి చూశాడు.

"అన్నను అలా చేయవచ్చా?" అని అడి గాడు మంత్రి.

"అతడు అన్నలాగా నడుచుకోలేదు. అవి వేకి అయిన శత్రువులా మాట్లాడాడు. నా తల్లినీ, తండ్రినీ అవమానించడం నేను సహించను. ఇకపై వారిని గురించి మాట్లాడితే అతని చేయిని కాదు; మెడను విరుస్తాను," అన్నాడు అశోకుడు కోపంగా.

సుశేముడు అశోకుడి కేసి ఒకసారి ఆగ్ర హంతో చూసి, అక్కడి నుంచి వేగంగా వెళ్ళి పోయాడు. మంత్రికి అతని ధోరణి చూస్తూంటే ఏదోఒకనాడు అశోకుడి మీద పగసాధించే వాడిలాగే కనిపించాడు!

చంద్రగుప్తుడు నందులను ఓడించి, మౌర్యవంశం స్థాపించడానికి సాయపడిన చాణక్యుడు, బిందుసారుడికి కూడా ప్రధాన సలహాదారుగా కొనసాగుతున్నాడు. రాజ కుమారులు ఇరువురి మధ్య రగులుతూన్న పగను గురించి మంత్రి ఒకనాడు చాణక్యుడికి తెలియజేశాడు.

"చుట్టూ చేరిన వంధిమాగధుల పొగడ్తల కారణంగా సుశేముడు దారి తప్పుతున్నాడు. అశోకుడు ఇంకా పసిప్రాయంలోనే ఉన్నాడు. మునుముందు మంచివాడుగా రూపొంద వచ్చు. లేదా, వాడూ దారి తప్పవచ్చు. అంతా పరిస్థితుల ప్రభావం మీద ఆధారపడి



ఉంటుంది!" అన్నాడు చాణక్యుడు, గంభీ రంగా.

"నిజమే, మహాత్మా! అయినా మహారాజు గారు సుశేముడి పట్ల పక్షపాత వైఖరితో ప్రవర్తిస్తున్నారని నా అనుమానం. అహంభావి అయిన సుశేముడు రాజైతే మౌర్యసామ్రా జ్యానికి క్షేమంకాదని నా అంతరాత్మ చెబు తున్నది!" అన్నాడు మంత్రి.

చాణక్యుడుకొంతసేపు మౌనంగా ఆలో చించి,"రాజుగారికి జ్యేష్ఠకుమారుడి పట్లగల భ్రమలనుతొలగించడం అవసరం!"అన్నాడు.

మంత్రి చాణక్యుడికి నమస్కరించి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఒకనాడు సాయంకాలం భవన ఉపరి తలంలో పచార్లుచేస్తున్నరాజుదగ్గరికి చాణ క్యుడు వచ్చాడు. బిందుసారుడు ఆయనకు చేతులెత్తి నమస్కరించి,"వార్త పంపితే తమ సమక్షానికి నేనే వచ్చేవాణ్ణి కదా!" అన్నాడు.

"మీ కుమారులలో ఒకరిని మౌర్యసింహాస నానికి అర్హుడయిన వారసుడిగా తీర్చిదిద్దవల సిన సమయం ఆసన్నమయింది. ఆవిషయం తమకు గుర్తుచేయడం నా ధర్మంగా భావించి వచ్చాను," అన్నాడు చాణక్యుడు.

రాజు ఉలిక్కిపడి, "నా జ్యేష్ఠకుమారుడు యువరాజు సుశేముడు మౌర్యరాజ్యసింహా సనం అధిష్ఠించడానికి అర్హుడుకాడా?"అని అడిగాడు ఆశ్చర్యంగా.

"జ్యేష్ఠకుమారుడు సింహాసనానికి వార సుడు కావడం సాధారణ సంప్రదాయం మాత్రమే. అది అన్ని సందర్భాలకూ అభిలష ణీయంకాదు. దక్షతగలవారికే రాజ్యపట్టాభి షేకంజరగాలి!అదేరాజ్యానికిక్షేమం!" అన్నాడు చాణక్యుడు.

చాణక్యుడు మితభాషి అనీ, ఏదిచెప్పినా బాగా ఆలోచించిగాని చెప్పడనీ రాజు బిందు సారుడికి తెలుసు.పెద్దకొడుకును రాజు చేసే విషయంలో తనను పునరాలోచించమని కోరడానికి బలమైన కారణం ఉండి తీరు తుందని ఆయన గ్రహించాడు.

"రాజా, ఈ విషయంలో మనం తొందర పడనవసరం లేదు. రాజ్యసింహాసనం ఎవరికి అప్పగించాలో ఇంకా నిర్ణయం తీసుకోలేదనీ, రాజకుమారుల ప్రవర్తనను మనం గమనిస్తు న్నామనీ రాజకుమారులకు తెలియాలి.రెండు మూడేళ్ళు పెద్దవాడై పుట్టినంతమాత్రాన తానేరాజ్యానికిరాజు కాగలననే భావం సుశే ముడికి కలగకూడదు. అదేవిధంగా మనం అప్పుడప్పుడు రాజకుమారుల తెలివితేట

లను పరీక్షించడం అవసరం!" అన్నాడు చాణక్యుడు.

"చిత్తం, మహాత్మా! అంతా తమ అభీష్టాను సారమే కానివ్వండి. ఆ పరీక్షలేవో వెంటనే ప్రారంభించినా ఆక్షేపణ లేదు," అన్నాడు బిందుసారుడు.

"ఆ విషయం గురించి కూడా ఆలోచించాను. రేపు సూర్యోదయంకల్లా మీ కుమారులు ఆరుగురినీ నగరానికి ఉత్తరంగాఉన్న శివాలయానికి రమ్మనండి. వాళ్ళు వచ్చేప్పుడు వాళ్ళకు నచ్చిన ఉత్తమ వాహనంలో రావాలి; వచ్చేముందు బలవర్థకమైన ఆహారం భుజించి రావాలి; ఆలయం చేరిన తరవాత విలువైన ఆసనంలో కూర్చోవాలి – అని విడివిడిగా సందేశాలు పంపండి!" అని చెప్పి, చాణక్యుడు అక్కడి నుంచి బయలు దేరాడు.

చాణక్యుడు చెప్పినట్టే రాజు తన కుమారులకు సందేశాలు పంపాడు.

మరునాడు సూర్యోదయానికిముందే రాజు బిందుసారుడు, చాణక్యుడు, మంత్రులు, కొందరు రాజోద్యోగులు శివాలయ ప్రాంగణానికి చేరారు. సూర్యోదయం కాగానే రాజ కుమారులు ఒక్కొక్కరుగా రాసాగారు.

యువరాజు సుశేముడు జోడుగుర్రాలు పూన్చిన, అందమైన రథంలో వచ్చి దిగాడు. రెండవ రాకుమారుడు ఆభరణాలతో అలంకరించిన ఏనుగు మీద వచ్చాడు. మూడవ రాకుమారుడు దృఢమైన గుర్రం మీద వచ్చాడు.

నాలుగవ రాకుమారుడూ, ఐదవ రాకుమారుడూ పల్లకీలలో వచ్చి దిగారు. ఆఖరుగా

వచ్చిన అశోకుడు మాత్రం ఏ వాహనంలోనూ రాకుండా, కాలినడకనే సమయానికి అక్కడికి వచ్చిచేరాడు.

ఆలయమంటపంలో, రాజభటులు రాకుమారులు వేయమన్న ఆసనాలు వేశారు. ఇద్దరు రాకుమారులు తమవెంట తెప్పించుకున్న దంతపుసింహాసనాల మీద ఆసీనులయ్యారు. మరిద్దరు పట్టుపరుపులు పరచి, వాటి మీద సుఖంగా కూర్చున్నారు. ఐదవ రాకుమారుడు పులిచర్మం పరచి దానిమీద కూర్చున్నాడు. అశోకుడు తన వెంట ఏమీ తెచ్చుకోలేదు. శుభ్రంగా నేల మీద కూర్చున్నాడు.

అశోకుడి ప్రవర్తనకు మిగిలిన రాకుమారులు తమలో తాము హేళనగా నవ్వుకోసాగారు.

రాజుకు కూడా అశోకుడి ప్రవర్తన విడ్డూరంగా తోచింది.

చాణక్యుడు రాకుమారులను సమీపించి, "మీ వాహనాలను, ఆసనాలను చూశాం.మరి ఉదయం ఏం భుజించారు?" అని అడిగాడు.

రాకుమారులు తాము తిన్న, రకరకాల వంటకాలను గురించి పోటీపడి వివరించారు.

ఆ తరవాత చాణక్యుడు అశోకుణ్ణి సమీపించి, "నాయనా! నువ్వు రాజకుమారుడివి. నీ దగ్గర ఎన్నో వాహనాలు ఉన్నాయి.వాటిని వద్దని కాలినడకన ఎందుకు వచ్చావు?"అని అడిగాడు.

"మహాత్మా! తమరు ఉత్తమమైన వాహనాన్నే ఉపయోగించమన్నారు. నేను నాకు ఉత్తమమనితోచిన నా కాళ్ళను ఉపయోగించాను. మనిషికి కాళ్ళకు మించిన ఉత్తమ వాహనం లేదనుకుంటాను," అన్నాడు అశోకుడు.

"అలాగా! మరి ఏ ఆహారం భుజించి వచ్చావు?" అని అడిగాడు చాణక్యుడు.

"గిన్నెడు పెరుగు!" అన్నాడు అశోకుడు.

"నిన్ను బలవర్ధకమైన ఆహారం కదా భుజించి రమ్మన్నాను. మరి గిన్నెడుపెరుగు తాగి వచ్చానంటా వేమిటి?" అన్నాడు చాణక్యుడు ఆశ్చర్యంగా.

"బిడ్డకు ఏ వేళకు ఏది బలవర్ధకమైన ఆహారమో తల్లికే తెలుసు. నా తల్లి నాకు ఉదయం గిన్నెనిండాపెరుగు ఇచ్చింది.మారు మాట్లాడకుండా దానిని తాగి వచ్చాను," అన్నాడు అశోకుడు.

"ఇదేమిటి, ఇలా కటికనేలమీద కూర్చున్నావు? ఇదేనా విలువైన ఆసనం?" అని అడిగాడు చాణక్యుడు.

"మహాత్మా! విలువైన ఆసనం మీద తమరు కూర్చోమన్నారు. భూమికన్నా విలువైనది ప్రపంచంలో ఉన్నదా? అందుకే భూమిని ఆసనంగా చేసుకున్నాను?" అని సమాధానమిచ్చాడు అశోకుడు.

"అద్భుతమైన సమాధానం!" అన్నారు రాజుకు వెనకగా నిలబడిన మంత్రులూ, రాజోద్యోగులూ ముక్తకంఠంతో.

చాణక్యుడు మందహాసం చేస్తూ, "నిన్ను అభినందిస్తున్నాను!" అంటూ అశోకుణ్ణి ఆప్యాయంగా వీపుపై స్పృశించాడు.

కుమారుడి తెలివితేటలకు రాజుకు ఆశ్చర్యానందాలు కలిగాయి. – (ఇంకావుంది)



సామ్రాట్ అశోక

3

[చంద్రగుప్తుడు చాణక్యుడి సాయంతో నందులను ఓడించి మగధరాజ్యాన్ని వశపరుచుకుని, పాటలీపుత్రం రాజధానిగా మౌర్యవంశాన్ని స్థాపించాడు. ఆయన తదనంతరం ఆయన కుమారుడు బిందుసారుడు మౌర్యసింహాసనాన్ని అధిష్ఠించాడు. బిందుసారుడు దక్షతతో రాజ్యాన్ని పాలిస్తూ, ముగ్గురు రాణులతో పాటు సుభద్ర అనే బ్రాహ్మణకన్యను వివాహమాడాడు. వారికి అశోకుడు జన్మించాడు. విద్యావివేకసంపన్నుడైన అశోకుడంటే బిందుసారుడి జ్యేష్ఠ కుమారుడైన సుశేముడికి గిట్టేది కాదు. తరవాత-]

ఒకనాడు సూర్యోదయంవేళ, అశోకుడు తల్లి కోరిక ప్రకారం పుష్పాలూ, ఫలాలూ తీసుకుని నగర మధ్యంలో ఉన్న దేవాలయానికి వెళ్ళి, దేవుడికి సమర్పించి, ఆలయం నుంచి వెలుపలికి వచ్చాడు. చెట్ల మీది పక్షుల కిలకిలారావాలూ, అప్పుడప్పుడుగుడి గంటలనాదం తప్ప ఆలయ ప్రాంగణంఎంతో ప్రశాంతంగా ఉన్నది. అశోకుడు ఆకాశంలో ఎగిరే పక్షులనూ,ఉదయభానుడి లేత కిరణాలకు బంగారంలా మెరుస్తూన్న మేఘాలనూ చూస్తూ నడవసాగాడు. కొంతసేపటికి వెనకనుంచి వచ్చిన ఒక గుర్రం అతన్ని హఠాత్తుగా కిందపడదోసి ముందుకు దూసుకు వెళ్ళింది. గుర్రంమీద యువరాజు సుశేముడు స్వారీ చేస్తున్నాడు!

అశోకుడు మరుక్షణమే లేచి, శరవేగంతో పరిగెత్తి పోయి ఒక్కగెంతున గుర్రం మీదికి లంఘించి సుశేముడి చేతి నుంచి కళ్ళాన్ని





లాక్కుని గుర్రాన్ని ఆపాడు. సుశేముడు గుర్రంపైనుంచి కిందికి దిగాడు.

"నా దారిన నేను వెళుతూంటే నన్నెందుకు కింద పడదోశావు?" అని అడిగాడు అశోకుడు.

"నిన్నుపడదోసింది నేను కాదు, నాగుర్రం!" అంటూ సుశేముడు మళ్ళీ గుర్రాన్ని అధిరోహించబోయాడు.

అశోకుడు అతని చేయిపట్టుకుని ఆపి, "నిర్మానుష్యంగాఉన్నవిశాలమైనబాటలోసైతం తిన్నగా వెళ్ళడం చేతకాని నీకు గుర్రం మీద స్వారీచేసే అధికారం ఎవరిచ్చారు?" అన్నాడు.

"నా అధికారం గురించి ప్రశ్నించడానికి నువ్వెవడివి? అసలు నేనెవరో నీకు తెలుసా?" అన్నాడు సుశేముడు.

"తెలియకేం? ఎందుకూ కొరగానిగర్విష్ఠివి! నాకు అన్నవైనందున నిన్ను వదిలిపెడుతున్నాను. లేకుంటే ఈ జన్మకు మరిచిపోలేని గుణపాఠం నేర్పేవాణ్ణి!" అన్నాడు అశోకుడు.

"కాబోయే రాజునే బెదిరిస్తున్నావా?" అన్నాడు సుశేముడు ఆగ్రహంగా.

"కాబోయేరాజు ఎవరన్నది ఇంకానిర్ణయం కాలేదు," అన్నాడు అశోకుడు.

"సంగతి తెలియకుండా మూర్ఖంగా మాట్లాడకు. మహారాజూ,పెద్దలూ తీసుకున్ననిర్ణయం నాకు తెలిసిపోయింది. నేనే కాబోయేరాజును!" అన్నాడు సుశేముడు, గర్వంతో పకపకా నవ్వుతూ.

"అలా అయితే, నువ్వు మరింత జాగ్రత్తగా నడుచుకోవాలి. అయినా, నువ్వు అబద్ధమాడుతున్నావని నాకుతెలుసు. ఒకవేళ అలా నిర్ణయించి ఉన్నట్టయితే దానిని నేను వ్యతిరేకిస్తాను!" అన్నాడు అశోకుడు.

"ఏమిటీ! మహారాజుగారినిర్ణయాన్నే వ్యతిరేకిస్తావా?" అంటూ సుశేముడు అశోకుణ్ణి కొట్టడానికి చేయి పైకెత్తాడు.

అశోకుడు అతని చేతిని వడిసి పట్టుకున్నాడు. చేతిని విడిపించుకోవడానికి సుశేముడు ప్రయత్నించాడు. కాని సాధ్యపడలేదు. ఇద్దరి మధ్యా పెనుగులాట ఆరంభమయింది. వారి అరుపులతో ఆలయప్రాంతం దద్దరిల్లింది. చుట్టుపక్కల నుంచి జనం మూగసాగారు.

రాజకుమారులు ఇప్పుడు పసిపిల్లలు కారు.చాణక్యుడు వాళ్ళ తెలివితేటలను పరీక్షించి సంవత్సరాలు గడిచిపోయాయి. చాణక్యుడు కూడా కాలధర్మం చెందాడు. రాజు బిందుసారుడు వృద్ధుడయ్యాడు. దానికి తోడు అనారోగ్యం. యువరాజులిద్దరి మధ్య

చూడగానే రాజకుమారులిరువురూపోట్లాడడం మాని చెరొకవైపు దూరంగా వెళ్ళి నిలబడ్డారు.

"నడివీధిలో నగర ప్రజల ఎదుట మీరీ విధంగా పోట్లాడుకోవడం చాలా దురదృష్టం. ఈసంగతి మీతండ్రికితెలిస్తే, ఆయన ఎంతగా బాధపడగలరో ఊహించారా?" అన్నాడు ప్రధానమంత్రి.

అశోకుడు ఏమీ మాట్లాడలేదు. సుశేముడు మాత్రం," నేనెవరికీ భయపడి పారిపోనవసరం లేదు. అదిసరే, నేనేకదా కాబోయే రాజును?" అని అడిగాడు మంత్రిని.

"ఆ విషయం ఇంకా నిర్ణయం కాలేదని భావిస్తున్నాను యువరాజా!అయినా, రాజుగారి జ్యేష్ఠకుమారుడిగా నువ్వు ఎంతో ఉదాత్తంగా నడుచుకోవడం అవసరం కదా?" అన్నాడు మంత్రి.

ఉన్న స్పర్థల గురించి నగర ప్రజలకు తెలుసు. అయితే, అది ఇంత దారుణంగా ఎప్పుడూ బయటపడలేదు. మౌర్యవంశాన్ని స్థాపించిన చంద్రగుప్తుడి మనుమలూ; తండ్రికి తగిన వారసుడని పేరుగాంచిన బిందుసారుడి కుమారులూ అయిన సుశేమ – అశోకులు ఈ విధంగా బహిరంగంగా పోట్లాటకుదిగడం ఎవరూ ఊహించని విషయం! వాళ్ళ కేకలు విని ప్రజలు పరిగెత్తివచ్చారుగాని, ఏ ఒక్కరూ వాళ్ళను సమీపించలేక పోయారు. దూరం నుంచీ, చాటునుంచీ భయాశ్చర్యాలతో చూడ సాగారు.

అదృష్టవశాత్తు ఆసమయంలో భల్లాట కుడు అటువైపు గుర్రం మీద వచ్చాడు. చాణక్యుడి అనంతరం భల్లాటకుడు మగధ రాజ్యానికి ప్రధానమంత్రి అయ్యాడు.అతన్ని

"నా హోదాను గౌరవించమని వీణ్ణి నిర్బంధించాను. అది తప్పా?" అని రెట్టిం చాడు సుశేముడు.

"ఎదుటివారిని నిర్బంధించడం వల్ల, అవమానించడం వల్ల నీ గౌరవం పెరగదు. సత్ప్రవర్తన ద్వారానువ్వు పదిమందికీ గౌరవ పాత్రుడివి కావాలి. ఎదుటి వారిపట్ల దయా దాక్షిణ్యాలు, ఓర్పు అలవరుచుకోవాలి. అంతే కాని అల్పవిషయాలకు ఇలా పదిమందిలో నవ్వులపాలుకావడం భావ్యం కాదు!"అన్నాడు ప్రధానమంత్రి గంభీరంగా.

"నేనేమీ పదిమందిలో నవ్వులపాలు కాలేదు. తృటిలో తప్పి పోయింది కానీ, లేకుంటే ఇంతకుముందు ఆపొగరుబోతును ప్రాణాలతో చర్మంవలిచి ఉండేవాణ్ణి.అప్పుడు వాడే ప్రజల ముందు నవ్వులపాలై వుండే

వాడు!" అన్నాడు సుశేముడు ఎంతో పొగరుగా.

"యువరాజా! నీ సోదరుణ్ణి గురించి నువ్వలా చులకనచేసి మాట్లాడరాదు. ఆయన కూడా నీలాగా యువరాజే! నీతండ్రి కుమారుడే!" అన్నాడు మంత్రి.

"వాడు నా తండ్రి కుమారుడే కావచ్చు. కాని వాడితల్లి, వివాహానికి ముందు అంతఃపురంలో నా తల్లి మొదలుగాగల రాణులకు సేవలు చేసింది. కాబట్టి వాణ్ణి నేను యువరాజుగాఅంగీకరించను," అన్నాడు సుశేముడు.

ఆ మాటకు ఆగ్రహం చెందిన అశోకుడు సుశేముడిమీదికి ఉరకబోయాడు. కానిమంత్రి వారించాడు.

"అర్హుడైన గొప్ప యువరాజు నువ్వా, నేనా అన్నది కాలమే నిరూపిస్తుంది. నాతల్లిని అవమానించినందుకు నీ మీద పగసాధిస్తాను. ఇదే నా ప్రతిజ్ఞ! ప్రధానమంత్రీ, ఇక్కడున్న ప్రజలే దీనికి సాక్ష్యం! మగధ సింహాసనాన్ని అధిష్ఠించబోయేది నువ్వు కాదు... కాని," అని అశోకుడు ఇంకా ఏదో అనబోతూండగా ప్రధానమంత్రి తన అరచేతిని అశోకుడి నోటికి అడ్డుపెట్టి మాటను పూర్తికాకుంగా ఆపి, "మహారాజు బిందుసారుడి తరుపున ఆజ్ఞాపిస్తున్నాను.మీరిద్దరూ ఈ క్షణమే ఇక్కడి నుంచి రాజభవనానికి వెళ్ళండి!"అని హెచ్చరించాడు. ఆ తరవాత మంత్రి చుట్టూచేరిన ప్రజలను, "అందరూ వెళ్ళిపొండి," అనిఆజ్ఞాపించాడు.

ప్రజలందరూ వెళ్ళిపోయారు. యువరాజులిద్దరూ ఒకరినొకరు ఆగ్రహంగా చూసుకుంటూ తమతమ భవనాలకు వెళ్ళారు.

ప్రధానమంత్రి అక్కడినుంచి తన గృహానికి తిరిగివెళ్ళి, గుర్రం పైనుంచి దిగి భవన ప్రధానద్వారాన్ని సమీపిస్తూండగా,రాజు బిందుసారుడి ప్రధాన సలహాదారు ఎదురుపడి ఆయనకు నమస్కరించి,"మహారాజు తమతో ఏదో మాట్లాడాలట!" అన్నాడు.

"సరే, వెళదాం పద," అంటూ అతనివెంట బయలుదేరి సమీపంలోనే ఉన్న రాజభవనంలో ప్రవేశించి, రాజు విశ్రాంతి తీసుకుంటూన్న ఏకాంతమందిరానికి వెళ్ళాడు.

రాజు బిందుసారుడు విశాలమైన గదిలో ఒక పెద్దపానుపు మీద కూర్చుని ఉన్నాడు. ఆయన ఎదుట అధికారి ఒకడు నిలబడి ఉన్నాడు. మంత్రి సమీపించి నమస్కరించగానే ఆయన్ను కూర్చోమని ఆసనం చూపాడు రాజు.

ఆయన కూర్చున్న తరవాత రాజు, "భల్లాటకా, ఈరోజు ఒక దుర్వార్త వినవలసి వచ్చింది. దానిని తక్షశిల నుంచి వచ్చిన ఈ అధికారి మీకు తెలియజేస్తాడు!" అన్నాడు.

అధికారి ప్రధాన మంత్రికి నమస్కరించి, "మంత్రివర్యా, చంద్రగుప్త మహారాజు తక్షశిల ప్రాంతాన్నిజయించి, తమ ప్రతినిధిని అక్కడ నిర్ణయించిన నాటినుంచి నిన్న మొన్నటి వరకు ఎలాంటి అవరోధాలు లేకుండా పరిపాలనా వ్యవహారాలు సాగుతూవచ్చాయి. కాని, ఇప్పుడు మౌర్యఅధికారాన్ని ధిక్కరించి తక్షశిలలో తిరుగుబాటు బయలుదేరింది. మగధరాజ్యం నుంచి విడిపోవాలని కొందరు పోరాడుతున్నారు!" అన్నాడు.

"అలాగా! చాలావింతగా ఉన్నదే," అన్నాడు ప్రధానమంత్రి.

"తక్షశిల ప్రజలకు మీరు ఎటువంటి అపకారమూ చేయలేదు. అందువల్ల వారి చర్య మీకు వింతగానే ఉండవచ్చు. అయితే, అక్కడున్న రాజప్రతినిధికీ, మాకూ అది వింతగా తోచడం లేదు. ఎందుకంటే ఈ తిరుగుబాటు వెనక గ్రీకులహస్తం ఉన్నదని మాకు సమాచారం అందింది. మహారాజు చంద్రగుప్తుడు వాళ్ళను అక్కడినుంచి తరిమి గొట్టాడన్న సంగతి వాళ్ళింకా మరిచిపోలేదు. ఇప్పుడు అధికారానికి ఎదురుతిరిగి మనల్ని వేధించడానికి ఉద్రిక్తులవుతున్నారు. మగధ సామ్రాజ్యం విచ్ఛిన్నం కావాలని కలలుకంటున్నారు!" అన్నాడు అధికారి.

"తిరుగుబాటు ఏపద్ధతిలో జరుగుతున్నది?" అని అడిగాడు ప్రధానమంత్రి.

"తిరుగుబాటు నాయకులు తెరమరుగున ఉన్నారు. బయటపడడంలేదు. వర్తకులనూ, ప్రముఖులనూ ఎదురుతిరగమని ప్రోత్సహిస్తున్నారు. మగధ అధికారుల ఇళ్ళపైబడి దోచుకుని వాటిని తగులబెట్టమని సాధారణ ప్రజలను రెచ్చగొడుతున్నారు. ప్రజలు అక్కడున్న మనసైనికులు పలువురిని హతమార్చారు. రోజురోజుకూ పరిస్థితి విషమిస్తున్నది!" అన్నాడు అధికారి.

"ఇప్పటికే వాళ్ళు హింసాత్మక చర్యలకు పూనుకున్నారుగనక, వాటిని మరింత బలంతో అణగదొక్కడం తప్ప మరొకమార్గం లేదు," అని రాజుకేసితిరిగి, "ప్రభూ!తక్షశిలపై సైనిక చర్యకు తక్షణమే సిద్ధంకమ్మని సేనాధిపతిని ఆజ్ఞాపించండి!" అన్నాడు ప్రధానమంత్రి.

"అపూర్వమైన బలపరాక్రమాలతో మా తండ్రి స్థాపించిన సామ్రాజ్యం నా కళ్ళెదుటే

విచ్ఛిన్నం కావడం చూస్తూ నేను ఊరుకోలేను. ఆ దుండగుల మీదికి నేనే నాయకత్వం వహించి సైన్యాన్ని నడుపుతాను," అన్నాడు బిందుసారుడు ఆవేశంతో నిట్టూరుస్తూ.

"తమ అభీష్టానుసారమే చేయవచ్చు. కాని ఒక విన్నపం. తమ ఆరుగురు కుమారులలో ఒకరిని సైన్యానికి నాయకత్వం వహించమని ఆజ్ఞాపించండి. కుమారుడునాయకత్వం వహిస్తే, తండ్రి వహించినట్టే కదా!" అన్నాడు ప్రధానమంత్రి.

"ఎటువంటి క్లిష్టపరిస్థితి ఏర్పడింది! సుశేముడికి యౌవరాజ్య పట్టాభిషేకం జరపాలనుకుంటున్నప్పుడు ఇటువంటి అవాంతరం!" అన్నాడు బిందుసారుడు మనసులో అనుకుంటున్నట్టు నెమ్మదిగా.

"పట్టాభిషేక మహోత్సవానికి కొంతకాలం వేచి ఉండడం మంచిది ప్రభూ! మొదట యువరాజు సుశేముడు సైన్యానికి నాయకత్వం వహించి వెళ్ళి, తిరుగుబాటునుఅణచి రానివ్వండి. అది యువరాజుపట్ల మగధ ప్రజల గౌరవాన్ని, నమ్మకాన్నిపెంచుతుంది," అన్నాడు ప్రధానమంత్రి.

రాజు మాట్లాడకుండామౌనంవహించాడు. ప్రధానమంత్రి మళ్ళీ, "ప్రభూ, నాదొక చిన్న మనవి.మనంయువరాజును సైన్యానికి నాయకత్వం వహించమని మొదట చెప్పకుండా, అందుకు ఆయనే స్వయంగా ముందుకు వచ్చేపరిస్థితినిసృష్టిద్దాం.అంటే యువరాజులు ఆరుగురినీ ఇక్కడికి రప్పించి, తక్షశిలలో జరుగుతూన్న తిరుగుబాటును గురించీ, దానిని అణచడానికి రాకుమారులలో ఒకరు సైన్యానికి నాయకత్వం వహించి వెళ్ళవలసిన

అవసరం గురించీ చెబుదాం. జ్యేష్ఠకుమారుడు కాబట్టి సుశేముడు సైన్యానికి నాయకత్వంవహించి వెళ్ళడానికి సంసిద్ధుడవుతాడు. ఇప్పటికే ఆయన మగధరాజ్యానికి కాబోయే రాజునన్న ఉత్సాహంతో ఉన్నాడు కాబట్టి, ఆయన ఇందుకు ఆనందగా అంగీకరిస్తాడు," అన్నాడు.

బిందుసారుడికి ప్రధానమంత్రి సలహా నచ్చింది.ఆయనచెప్పినట్టే చేయడానికి సమ్మతించాడు.

ఆరోజే ఆరుగురు యువరాజులనూరాజు సమక్షానికి పిలిపించారు. అక్కడ ప్రధానమంత్రిని చూడగానే, యువరాజు సుశేముడు ఒక్కక్షణం నివ్వెరపోయాడు. తానూ, అశోకుడూ ఉదయం ఆలయ ప్రాంతంలో పడ్డ గొడవ గురించి ఆయన తండ్రికి తెలియ

జేశాడేమో అని అనుమానించి భయపడ్డాడు!

రాజు ఆరుగురు కుమారులనూ చేర బిలిచి, "మీరు పసిపిల్లలు కారు. నవయౌవన ప్రాయంలో ఉన్నారు. రాజ్య పరిపాలనా వ్యవహారాలు సక్రమంగా సాగడానికి మీరు మీమీ బాధ్యతలను గుర్తెరిగి నడుచుకోవలసిన సమయం ఆసన్నమయింది. అందుకు మీకు ఇప్పుడొక అవకాశం కూడా లభించింది. తక్షశిల ప్రాంతంలో తిరుగుబాటు చెలరేగి, అక్కడ శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతున్నదని సమాచారం అందింది. తిరుగుబాటును అణచాలి. మీలో ఒకరు మన సైన్యానికి నాయకత్వం వహించి వెళ్ళి, తిరుగుబాటును అణచి, ఆ ప్రాంతంలో శాంతిభద్రతలను నెలకొల్పాలి! ఆ పనిని మీలో ఎవరుచేయగలరు?" అని అడిగాడు.

సుశేముడు వెంటనే ముందుకు రాగలడని బిందుసారుడు భావించాడు. కాని అతడు మౌనం వహించాడు. మిగతా నలుగురు కుమారులు కూడా మౌనంగా తలలు వంచుకున్నారు. ఆఖరికి అశోకుడు ఒక అడుగు ముందుకు వేసి, "ప్రభూ! తమ ఆజ్ఞను శిరసావహించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. మీరు చెప్పిన పనిని జయప్రదం చేయగలనన్న విశ్వాసం నాకున్నది. ఆజ్ఞాపించండి. ఈ క్షణమే తక్షశిలకేసి సైన్యంతో బయలుదేరుతాను!" అన్నాడు.

"చాలా సంతోషం, నాయనా! నీ ధైర్యాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ అభినందిస్తున్నాను. త్వరగా విజయయాత్రకు సిద్ధంకా!" అని బిందుసారుడు అశోకుడి వెన్ను చరిచి, మిగిలిన కుమారులకేసి తిరిగి "పిరికిపందల్లారా! ఇంకా నా ఎదుట ఎందుకు నిలబడ్డారు? మీ నివాసాలకు వెళ్ళి దాగుడుమూతలాడుకుంటూ, వెన్నదొంగిలించి ఎలుకల్లా తింటూ కాలం వెళ్ళబుచ్చండి," అని గద్దించాడు.

అయిదుగురు రాకుమారులూ అక్కడి నుంచి వెళ్ళిపోయారు. అశోకుడు తండ్రి పాదాలకు నమస్కరించి, ఆయన ఆశీస్సులు పొంది అక్కడినుంచి బయలుదేరాడు.

"పూజ్య గురుదేవులు చాణక్యుడి మాటలు అక్షరాలా నిజమయినై. నా కుమారులందరిలోకీ అశోకుణ్ణే ఆయన సమర్థుడిగా గుర్తించాడు," అన్నాడు, బిందుసారుడు ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ ప్రధానమంత్రితో. –(ఇంకావుంది)



సామ్రాట్ అశోక

4

[వృద్ధుడైన బిందుసార మహారాజు అనారోగ్యానికిలోనయ్యాడు. గ్రీకుల ప్రోద్బలంతో తక్షశిలలో తిరుగుబాటు ఆరంభమైనట్టు రాజుకు వార్త అందింది. ప్రధానమంత్రి సలహామేరకు రాజు తన ఆరుగురు కుమారులను పిలిపించి, తక్షశిల తిరుగుబాటును అణచడానికి వెళ్ళే సైన్యానికి నాయకత్వం వహించడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు – అని అడిగాడు. తండ్రి ఆజ్ఞను పాటించడానికి అశోకుడు ముందుకువచ్చాడు. –తరవాత]

ఆరోజు సాయంకాలం యువరాజు అశోకుడు, తమ సేనాధిపతిని చూడడానికి వెళ్ళాడు. అప్పటికే సేనాధిపతికి, ప్రధానమంత్రి ద్వారా తక్షశిల తిరుగుబాటు గురించి తెలియడంతో, ఆయన సైన్యాన్ని సమాయత్తం చేసేపనిలో నిమగ్నుడై ఉన్నాడు. ఆయన అశోకుణ్ణి చూడగానే నమస్కరించి, "యువరాజా! నేనూ మీతోపాటు తక్షశిలకు వస్తాను," అన్నాడు.

"మీ అభిమానానికి సంతోషం. అయినా, రాజుగారు అనారోగ్యంతో ఉన్నప్పుడు, తమరు రాజధానిలోనే ఉండడం అవసరం కదా! కాబట్టి మీరు ఇక్కడేవుండి, విశ్వాసపాత్రులైన ఇద్దరు సేనానాయకులను నాతో పంపండి. అదే చాలు," అన్నాడు అశోకుడు.

"మీరన్నదీ నిజమే. ఇటువంటి పరిస్థితిలో రాజధానిలో మహారాజుగారి పక్కన నేను ఉండడం మంచిదే. మీ నిర్ణయం

అభినందనీయం. మన సైన్యంలోని ఉత్తమ దళాలనూ, సమర్థవంతులైన దళపతులనూ మీ వెంట పంపుతాను. అందుకు కావలసిన ఏర్పాట్లు అప్పుడే ప్రారంభించాను," అన్నాడు సేనాధిపతి.

"చాలా సంతోషం," అంటూ అశోకుడు అక్కడినుంచి బయలుదేరాడు.

అప్పటికప్పుడే సైనిక సన్నాహాలు ఆరంభమయ్యాయి. రాజభవనం ఎదుటవున్న విశాలమైన మైదానంలో ఏనుగులూ, గుర్రాలూ బారులుతీరి నిలిచాయి. సైనికులు ఆయుధాలనూ, అవసరమైన ఇతర పరికరాలనూ సిద్ధం చేసుకోవడంలో లీనమైపోయారు.

ఈ ఏర్పాట్లన్నిటినీ చూసేసరికి రాజుగారి జ్యేష్ఠకుమారుడైన సుశేముడికి అసూయ పుట్టుకొచ్చింది. అతడు రహస్యంగా సేనాధిపతి దగ్గరికి వెళ్ళి, "ఎక్కడో జరిగే చిన్న అలజడిని అణచడానికి మరేదో మహా యుద్ధానికి వెళుతున్నట్టు ఇంత హంగామా, ఇన్ని ఏర్పాట్లు అవసరమా?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకు ఒక్క క్షణం నివ్వెరపోయిన సేనాధిపతి, "యువరాజా! శత్రువుల బలాన్ని తక్కువగా అంచనావేయడం ఏమాత్రం మంచిది కాదు. చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి.అయినా, ఈ తిరుగుబాటుకు వెనక వున్న గ్రీకులు యుక్తిపరులు, వివేకవంతులు, ధనవంతులు. స్థానికులు మనలను ఎదిరించగల శక్తిసామర్థ్యాలను వాళ్ళు సమకూర్చగలరనడంలో సందేహం లేదు. పైగా యువరాజు అశోకుడు ప్రప్రథమంగా సైన్యానికి నాయకత్వం వహించి వెళుతున్నాడు. ఆయన విజయానికి కావలసిన సకల సదుపాయాలూ చేయవలసిన బాధ్యత నా మీద ఉన్నది. ఇది రాజకుటుంబ గౌరవానికి సంబంధించిన విషయం కదా!" అన్నాడు.

"ఎవరి గౌరవం గురించి నువ్వు మాట్లాడుతున్నావు? మగధసామ్రాజ్యానికి కాబోయే మహారాజు అశోకుడి గౌరవం గురించేనా?" అన్నాడు సుశేముడు వెటకారంగా.

"ఈ రాజ్యానికి కాబోయే రాజు తమరనీ, అశోకుడు కాదనీ విన్నాను. తక్షశిల కేసి తమరే సైన్యాన్ని నడిపి ఉండవచ్చు. తమకు కాబోయే రాజు మొదటివిజయాన్నీ చేపట్టి రావడం చూసి మగధ ప్రజలు ఆనందించి ఉండేవారు. మీరు ప్రజాభిమానాన్నీ, గౌరవాన్నీ చూరగొనడానికి అది ఉపకరించి ఉండేది.

గొప్ప అవకాశాన్ని జారవిడుచుకున్నారు!" అన్నాడు సేనాధిపతి వినయంగా.

"సేనాధిపతీ! నువ్వు నా వెంట ఉంటే నేను జయప్రదంగా తిరిగిరాగలను!" అన్నాడు సుశేముడు కంఠస్వరాన్ని కొద్దిగా తగ్గించి.

"యువరాజా! తమరు చెబుతున్నదేమిటో నాకు అర్థం కావడం లేదు," అన్నాడు సేనాధిపతి.

"సేనాధిపతీ! మాతండ్రి అనంతరం మగధ రాజ్య సింహాసనాన్ని అధిష్ఠించబోయేది నేను అన్న సంగతి నీకు తెలుసు. కాబోయే రాజునైన నేను, ప్రజలముందు గౌరవంగా కనిపించడానికి సహకరించవలసిన బాధ్యత సేనాధిపతిగా నీకున్నది కదా?" అన్నాడు సుశేముడు.

"తమరు చెబుతన్నదేమిటో నాకు ఇంకా అంతుచిక్కడం లేదు యువరాజా! అయినా, తక్షశిలకేసి సైన్యాన్ని నడిపించే బాధ్యతను తమరెందుకు స్వీకరించలేదు?" అని అడిగాడు సేనాధిపతి.

"ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. నేనే సైన్యానికి నాయకత్వం వహించి నడిపిస్తాను. అందుకు నీ సాయం కావాలి. నేను చెప్పినట్టు చేశావంటే, నేను రాజునయ్యాక నువ్వు కోరిన కోరిక తీరుస్తాను. అందుకు నువ్వు చేయవలసిందల్లా ఒక్కటే. ఈ సైనిక చర్యలో అశోకుడు పరాజయం పాలవ్వాలి. ఆ తరవాత నేను సైన్యానికి నాయకత్వం వహించి తక్షశిలకు వెళ్ళి నీ సాయంతో లక్ష్యం సాధించి, జయప్రదంగా రాజధానికి తిరిగి రాగలను. దాంతో ఆ పరిచారిక పుత్రుడైన అశోకుడి గర్వం అణగారి పోతుంది. అందుకు నువ్విప్పుడు బలహీనమైన సైనిక

దళాలను అశోకుడి వెంట పంపాలి. అతడి వెంట నువ్వు వెళ్ళకూడదు. ఇద్దరు పనికిరాని దళపతులు వెళ్ళాలి. మన పథకం ఫలించడానికి ఇదొక్కటి చాలు. ఈ విషయంలో నిన్ను నేను నమ్ముతున్నాను. ఇది మన ఇద్దరి మధ్య రహస్యంగా ఉండిపోవాలి. తెలిసిందా?" అన్నాడు సుశేముడు.

సేనాధిపతికి దిగ్భ్రాంతితో నోట మాట రాలేదు. నిశ్చేష్టుడయ్యాడు. కాని దానిని గ్రహించని సుశేముడు, "నువ్వు ఈ పని చేశావంటే దానికి తగిన బహుమతిని ఇస్తాను. మన రాజ్యంలో మునుముందు నీకు లేని అధికారం అంటూ ఉండదు. మహారాజుకు తరవాత, అంటే నాకు తరవాత నీకే అన్ని ఉన్నత అధికారాలూ ఉంటాయి! ఏమంటావు?" అన్నాడు.

"యువరాజా! తమరు నా రాజభక్తినీ, నిజాయితీనీ పరీక్షించడానికి ఇలా మాట్లాడుతున్నారనుకుంటాను!" అన్నాడు సేనాధిపతి.

"అదేంకాదు. అశోకుడి గర్వం అణచాలి. అదే నా ఆశయం. నేను చెప్పింది అక్షరాలా నిజం. అణుమాత్రం సందేహం లేదు," అన్నాడు సుశేముడు దృఢంగా.

"అలాగా! అయితే వినండి– మీ కోరిక నాకుదిగ్భ్రాంతిని కలిగిస్తున్నది. రాజద్రోహానికీ, వెన్నుపోటుకూ నేనెన్నడూ పాల్పడను!" అన్నాడు సేనాధిపతి.

సుశేముడు ముఖం చిన్నబుచ్చుకుని, "అంటే, నా ఆజ్ఞను పాటించనంటున్నావు. అంతేనా?" అని గద్దించాడు.

"ముమ్మాటికీ పాటించను!" అన్నాడు సేనాధిపతి.

'అలాగా! అయితే వేరొక సేనాధిపతిని నిర్ణయించక తప్పదు!" అన్నాడు సుశేముడు.

"అది తమరు మహారాజు అయ్యాక ఆలోచించవలసినవిషయం. అయినా, రాజకుటుంబంలోనే ఇటువంటి కుట్రలు బయలుదేరితే రాజసింహాసనం ఎంతకాలం నిలుస్తుంది! యువరాజా, దయచేసి నా సలహా..." అని ఇంకేదో చెప్పబోయాడు సేనాధిపతి.

"నీ సలహా నాకవసరం లేదు. నీ దగ్గరే ఉంచుకో," అంటూ సుశేముడు అక్కడి నుంచి ఆగ్రహంతో వెళ్ళిపోయాడు.

సుశేముడి దురాలోచనకు బాధపడిన సేనాధిపతి, ఆ తరవాత కర్తవ్య నిర్వహణకు పూనుకుని, తన ప్రత్యక్ష పర్యవేక్షణలోనే సైనికదళాలను సిద్ధం చేశాడు.

మరునాడు తెల్లవారక ముందే అశోకుడు సైనికదళాలతో తక్షశిలకు బయలుదేరాడు. అశోకుడి వెంట కొంతదూరం వచ్చిన సేనాధిపతి, "యువరాజా! మీ ప్రయత్నం జయప్రదం కావాలని కాంక్షిస్తున్నాను. దానిని మీరు సునాయాసంగా సాధించగలరన్న నమ్మకం నాకున్నది. మరొక ముఖ్యవిషయం; మీకు అంగరక్షకులుగా పన్నెండుమంది సైనిక యోధులను నియమించి ఉన్నాను. అయినా మీ రక్షణ విషయంలో మీరు జాగ్రత్తగా ఉండాలి. జయప్రదంగా తిరిగి వచ్చాక, మీకు మరికొన్ని విషయాలు చెబుతాను," అని చెప్పి వీడ్కోలు పలికాడు.

ఆరోజు సాయంకాలం బాగాపొద్దుపోయాక అశోకుడి సేనలు తక్షశిల నగర పొలిమేరను చేరాయి. అక్కడున్న ఒకకొండ పాదతలంలో సైనికులు గుడారాలు వేసుకుని శిబిరం



ఏర్పరచుకున్నారు. మరునాడు తెల్ల వారగానే అశోకుడు, తిరుగుబాటుదారులకు సందేశాన్నిచ్చి రాయబారులు కొందరిని తక్షశిల నగరానికి పంపాడు.

అప్పటికే తిరుగుబాటుదారులు మగధ రాజప్రతినిధులను నగరం నుంచి తరిమికొట్టారు. మరికొందరిని చంపివేశారు. ఇప్పుడు తక్షశిల పూర్తిగా తిరుగుబాటుదారుల అధీనంలో ఉన్నది.

రాయబారులు తిరుగుబాటుదారులను కలుసుకుని, "మహారాజుగారు అస్వస్థతగా ఉన్నారు. ఈ కాలఘట్టంలో సమస్య ఎటువంటిదైనా సరే, దానికి శాంతియుత పరిష్కారాన్నే కోరుకుంటున్నారు. మీ కోరికలేవో తెలియజేస్తే, రాజుగారు వాటిని పరిశీలిస్తారు!" అని తెలియజేశారు.

తిరుగుబాటునాయకులు తమ కోరికలు తెలియజేయడానికి కొంత కాలవ్యవధి కావాలన్నారు. రాయబారులు సరేనన్నారు.

తిరుగుబాటునాయకుల వద్దకు రాయబారులు వెళ్ళిన తరవాత, అశోకుడి ఆనతి ప్రకారం వందలాదిమంది సైనికులు యాత్రీకులుగా, వ్యాపారులుగా, బిక్షగాళ్ళుగా వేషాలు వేసుకుని గుట్టుచప్పుడు కాకుండా నగరంలో ప్రవేశించి తిరుగుబాటుదారుల చర్యలను గమనించసాగారు.

ప్రతిరోజూ పొద్దుగూకిన తరవాత తిరుగుబాటుదారులు, తమ గ్రీకుపోషకులను ఒక భవనంలో కలుసుకుని సంప్రతింపులు జరపడం వారు ఏర్పాటుచేసుకున్న పద్ధతి. ఆ పద్ధతి ప్రకారం ఆనాటి రాత్రి కూడా వాళ్ళు అదే భవనంలోచేరి రహస్యంగా పథకాలు ఆలోచించే విషయం అశోకుడికి తెలియవచ్చింది. ఆయన సలహా ప్రకారం మారువేషాలలో ఉన్న సైనికులు ఆ భవనాన్ని చుట్టుముట్టారు. ఆ తరవాత నగరానికి వెలుపల ఉన్న మగధసేనలు ఉప్పెనలా నగరంమీదికి విరుచుకుపడ్డాయి.

తిరుగుబాటుదారులూ, వారి గ్రీకుమిత్రులూ తాము ఆలోచనలు జరుపుతూన్న భవనం నుంచి బయట పడడానికి ఎంత ప్రయత్నించినప్పటికీ వెలుపలికి రాలేకపోయారు. కొంతసేపు పోరాడిన తరవాత వాళ్ళందరూ అశోకుడి సేనలకు లొంగిపోయారు!

తిరుగుబాటుదారులకు కొంత సైన్యం ఉన్నది. కాని వారికి సరైన శిక్షణ లేదు; పోరాట వ్యూహాలు తెలియవు. శత్రువులను దెబ్బతీయడానికి గానీ, తమను రక్షించు

కోవడానికి గానీ వారికి తగిన శిక్షణలేదు. వాళ్ళు అశోకుడి సేనలతో నగరంలో అక్కడక్కడ పోరాడారు. కాని ఆ సేనల ధాటికి తట్టుకోలేక కొందరు పారిపోయారు. మరి కొందరు ప్రాణాలు కోల్పోయారు.

తెల్లవారేసరికి తిరుగుబాటుదారుల ప్రయత్నాలన్నీ విఫలమై నగరం మళ్ళీ అశోకుడి సేనల హస్తగతమయింది. బందీలుగా దొరికినతిరుగుబాటుదారుల నాయకులనూ, వాళ్ళ మిత్రులనూ పెడరెక్కలు విరిచికట్టి నగర మధ్యానికి నడిపించారు. నగరమధ్యంలో ఎత్తుగా, సమతలంగా బ్రహ్మాండమైన రచ్చబండ ఒకటి ఉన్నది. ఖైదీలందరినీ దాని మీదికి నడిపించారు. నగర ప్రజల నందరినీ అక్కడికి చేరమని చాటింపు వేయడంతో తక్షశిల ప్రజలందరూ ఏం జరుగనున్నదో అన్న ఉత్కంఠతతో రచ్చబండ చుట్టూ గుమిగూడారు.

కొంతసేపటికి యువరాజు అశోకుడు అక్కడికి గుర్రంమీదవచ్చి, రచ్చబండమీదికి చేరాడు. తలలువంచుకుని మౌనంగా నిలబడిన తిరుగుబాటుదారులనుచూసి అశోకుడు, "మీ కేవైనా బాధలు ఉన్నట్టయితే అధికారులకు చెప్పుకోవాలి.అంతేగాని అధికారానికి ఎదురుతిరిగి మగధ అధికారులను చంపి వారి ఆస్తులను దోచుకోవాలనే దుర్బుద్ధి మీకెలా కలిగింది?" అని అడిగాడు.

కొంతసేపు మౌనం తరవాత బందీలలో ఒకడు, "మా బాధలను ఇక్కడున్న రాజప్రతినిధికి చెప్పుకున్నాం. కాని ఆయన వాటిని లెక్కచేయలేదు, ప్రభూ!" అన్నాడు.

"రాజప్రతినిధి అశ్రద్ధ చేశాడనే అనుకుందాం. మీరాసంగతిని రాజధానికి వచ్చి మహారాజుకు గాని, ప్రధానమంత్రికి గాని చెప్పుకో వచ్చు కదా? మరి ఎందుకు అలా చేయలేదు?" అని అడిగాడు అశోకుడు.



దానికి బందీలనుంచి ఎటువంటి సమాధానమూ రాలేదు.

"సరే, మీబాధలగురించి రాజుకు చెప్పుకో లేదు. ఆసంగతి అలాఉంచుదాం. ఈ విషయంగా మీరు పరాయిదేశస్థులను సంప్రతించవలసిన అవసరం ఏముంది? మనరాజ్య వ్యవహారాలలో వారి జోక్యం ఎందుకు?"అని ప్రశ్నించాడు అశోకుడు.

ఆ ప్రశ్నకు కూడా బందీల నుంచి సమాధానం రాలేదు.

"గ్రీకులూ, స్వార్థపరులైన కొందరు స్థానిక ప్రముఖులూ కలిసిపన్నినకుట్రఫలితమే ఈ తిరుగుబాటు అన్నది తేటతెల్లమైపోయింది. ఒకప్పుడు ఈ ప్రాంతం గ్రీకుల సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. మౌర్యసామ్రాజ్య స్థాపకుడైన చంద్రగుప్తుడు గ్రీకులను ఈ ప్రాంతం నుంచి వెడలగొట్టాడు. ఆ అవమానాన్ని గ్రీకులు ఇంకా మరిచిపోలేదు. వారి చర్యలను అర్థం చేసుకోగలం. కాని వారితో చేతులు కలిపి అలజడినిసృష్టించిన మనరాజ్య పౌరుల మాటేమిటి? వారి ప్రవర్తనను ఎలా సమర్థించగలం? తమ దేశాన్ని పరాయివారికి అప్పగించడానికి వెనుకాడని పరమ నీచస్వభావం వారిది. వాళ్ళు క్షమార్హులుకారు. తగినవిధంగా శిక్షించాలి!" అన్నాడు అశోకుడు గంభీరంగా.

వాళ్ళకు ఎలాంటి శిక్ష పడుతుందో అని ప్రజలు ఉత్కంఠతతో ఊపిరి బిగబట్టుకుని వినసాగారు. మౌనాన్ని ఛేదించుకుంటూ అశోకుడు, "మనరాజ్యంలో తిరుగుబాటును పురికొల్పిన విదేశీయులకు మరణశిక్ష విధిస్తున్నాను. వారితో చేతులు కలిపిన రాజద్రోహులైన స్థానికులకుకూడా మరణదండన విధిస్తున్నాను!" అని ప్రకటించి వెనక్కు తిరిగాడు.

"క్షమించండి యువరాజా! క్షమించండి! తెలియక నేరంచేశాం. ఇకపై బుద్ధిగామసలుకుంటాం. ప్రాణభిక్ష పెట్టండి!" అని బందీలు ఏడ్వసాగారు.

అశోకుడు ఒకక్షణం ఆగి, వెనక్కుతిరిగి, "ద్రోహులను కరుణించి, క్షమించడం తగని కార్యం! ఈ శిక్ష మిగిలిన అందరికీ హెచ్చరిక కావాలి!" అని అధికారుల కేసి ఒకసారి చూసి, గుర్రాన్ని అధిరోహించి శిబిరానికి బయలుదేరాడు.

ఆమరుక్షణమే బందీల ఊచకోత ఆరంభమయింది. అక్కడి వాతావరణం భయానకంగా మారిపోయింది. — (ఇంకావుంది)





సామ్రాట్ అశోక

5

[మగధ చక్రవర్తి బిందుసారుడు వృద్ధుడై అనారోగ్యంతో ఉన్న సమయంలో, తక్షశిలలో తిరుగుబాటు బయలుదేరింది. దానిని అణచడానికి చక్రవర్తి జ్యేష్ఠకుమారుడు సుశేముడు సుముఖత చూపకపోవడంతో, కనిష్ఠ కుమారుడైన యువరాజు అశోకుడు సైన్యంతో వెళ్ళి, ఒక్కరోజులో తక్షశిల తిరుగుబాటును అణచి, తిరుగుబాటుదారుల పట్ల ఏమాత్రం కనికరం చూపకుండా మరణశిక్ష విధించాడు. – తరవాత]

అది ఒక సాయంకాలం. బిందుసార మహారాజు జ్యేష్ఠకుమారుడైన సుశేముడు, తన తమ్ములతో కలిసి వనవిహారానికి బయలుదేరాడు. రాజధాని పాటలీపుత్రం సమీపంలో ప్రవహించే నదీతీరంలో ఉన్న సుందర ఉపవనానికి వాళ్ళుచేరారు. రాజకుమారులు అక్కడ చేరడానికి ముందే వారికి కావలసిన భోజన పదార్థాలూ, పానీయాలూ, ఫలాలూ సేవకులు అక్కడ అమర్చారు. రాజకుమారులు ఉపవనంలోకి చేరిన తరవాత, మరెవ్వరూ లోపలికి రాకుండా అంగరక్షకులు తగు జాగ్రత్తలుతీసుకున్నారు. వాళ్ళు రుచికరమైన రకరకాల పిండివంటలు కావలిసినంత తిని, ఫలరసాలు సేవించి, ఉపవనం మధ్య పరచిన పట్టు తివాసీలపై కూర్చున్నారు. కొంత సేపటికి వాళ్ళ ఎదుట సుందరీమణుల నృత్యగాన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి.



యువతుల నృత్యగీతాలను చూసి ఆనం దిస్తూన్న సుశేముడికి, కొంతసేపటికి వెనక నుంచి ఏవో రణగొణధ్వనులు వినిపిం చాయి. అతడు వెనక్కు తిరిగి చూశాడు. ఒక అంగరక్షకుడు హడావుడిగా పరిగెత్తుకు వచ్చి, అతనికి నమస్కరించి, "ప్రభూ! మన దళనాయకుడొకడు భటులతో ఈ ఉపవనం లోకి ప్రవేశించాలంటున్నాడు. ఈ రోజు, ఈ వనంలోకి మరెవ్వరూ ప్రవేశించరాదని తమరు ఆజ్ఞాపించారని చెప్పాను. కాని, అతడు వినిపించుకోకుండా లోపలికి ప్రవేశించడానికి రాజముద్రికను చూపుతున్నాడు!" అన్నాడు.

"దళనాయకుడికి ఇప్పుడిక్కడేం పని?" అని అసహనంగా ప్రశ్నించాడు సుశేముడు.

"ఆ సంగతి చెప్పనంటున్నాడు. తమతో చెబుతాడేమో!" అన్నాడు అంగరక్షకుడు.

"సరే, త్వరగా రమ్మను!" అన్నాడు సుశే ముడు విసుక్కుంటూ.

అంగరక్షకుడు అక్కడినుంచి వెళ్ళి, కొంత సేపటికి దళనాయకుణ్ణి వెంట బెట్టుకుని తిరిగివచ్చాడు.

దళనాయకుడు యువరాజు సుశేము డికి నమస్కరించాడు. సుశేముడు అంగ రక్షకుణ్ణి వెళ్ళమన్నట్టు చేత్తో సైగ చేసి, "మావినోదానికి అంతరాయం కలిగించ డానికి నీ కెంత ధైర్యం!" అన్నాడు దళనాయ కుడికేసి కోపంగా చూస్తూ.

"తమకు అంతరాయం కలిగించడా నికి మేమెంతవారం ప్రభూ! అది మా ఉద్దేశమూ కాదు!" అన్నాడు దళనాయ కుడు.



"మరెందుకు వచ్చావు?" అని రెట్టించాడు సుశేముడు.

"రేపు సాయంకాలం ఈ ఉపవనం మధ్య ఒక బ్రహ్మాండమైన అభినందన సభ జరుగనున్నది. అందుకు కావలసిన వేది కను సిద్ధం చేయమని సేనాధిపతి ఆజ్ఞాపిం చారు. ఆయన ఆజ్ఞను నెరవేర్చడానికి నాతోపాటు వచ్చిన భటులు కొందరు, ఉపవనం వెలుపల తమ అనుమతికోసం కాచుకుని ఉన్నారు!" అన్నాడు దళనాయ కుడు.

"బ్రహ్మాండమైన అభినందన సభ! అంత గొప్ప అభినందనలు ఎవరికి?" అని అడిగాడు సుశేముడు.

"యువరాజు అశోకులవారికి!" అన్నాడు దళనాయకుడు.

"అశోకుడికి ఎందుకు అభినందనలు?" అని అడిగాడు సుశేముడు.

"ప్రభూ! యువరాజు అశోకుడు తిరుగుబాటును తృటికాలంలో అణచి విజయవంతంగా తిరిగివస్తున్నాడు. ఆయనకు ఘన స్వాగతం పలకడానికి అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయి," అన్నాడు దళనాయకుడు వినయంగా.

ఆమాట వినగానే సుశేముడి ముఖం వెలవెల బోయింది. అతని తమ్ములు పిడుగుపాటుకు లోనైనట్టు దిగ్భ్రాంతి చెందారు. ఎవరి నోటినుంచీ మాటరాలేదు. దళనాయకుడి మాటలు విన్న ఒక నాట్యకత్తె, "ఆహా! ఎంత సంతోషకరమైన వార్త!" అన్నది.

"ఛీ, నోర్ముయ్!" అన్నాడు సుశేముడు పట్టరాని కోపంతో.

అశోకుడిపట్ల సుశేముడికున్న ఈర్ష్య గురించి అంతకుముందే ఎరిగిన వాళ్ళు గనక, అతని కోపానికి ఆ యువతులు లోలోపలే నవ్వుకున్నారు.

కొంతసేపు మౌనం తరవాత, "ఈ వార్త ఇంతవరకు నాకెందుకు తెలియజేయలేదు?" అని దళనాయకుణ్ణి అడిగాడు సుశేముడు.

"ఆ విజయవార్త రాజధానికి చేరగానే, మహారాజుగారు తమకు తెలియచేయమన్నారు. కాని తమరు ఉన్నచోటు ఎవరికీ తెలియలేదు. అందువల్ల ఆవార్తను వెంటనే తమకు తెలియ జేయలేకపోయారు," అన్నాడు దళనాయకుడు.

"నోర్ముయ్," అన్నాడు సుశేముడు.

"తమరు కారణం అడిగారు గనక, చెప్పాను, క్షమించండి ప్రభూ!" అన్నాడు దళనాయకుడు.

"అంతా మాకుతెలుసు, ఊరుకో!" అంటూ సుశేముడు నిప్పుతొక్కిన కోతిలా, అటు ఇటూ తిరగసాగాడు. ఆ తరవాత పిడికిలి బిగించి ఆకాశంకేసి చూశాడు. తల పంకించి దళనాయకుణ్ణి సమీపించాడు. దళనాయకుడికి ఏం చేయాలో తోచక అలాగే నిలబడ్డాడు.

ఉన్నట్టుండి సుశేముడు తన వేలికివున్న వజ్రపుటుంగరం తీసి, దళనాయకుడి వేలికి తొడిగాడు. ఆ తరవాత నవ్వుతూ దళనాయకుడి వెన్ను తట్టాడు. ఈ ఆకస్మిక పరిణామానికి ఉక్కిరిబిక్కిరయిన దళనాయకుడు చిన్నగా నవ్వుతూ సుశేముడికి వంగినమస్కరించాడు.

"శుభవార్తను తెచ్చావు. అందుకే నీకీ బహుమతి. రేపు దీనికన్నా గొప్ప బహుమతి ఇస్తాను," అన్నాడు సుశేముడు.

"కృతజ్ఞుణ్ణి, మహాప్రభూ!" అంటూ దళ నాయకుడు చేతులు జోడించాడు.

"అయితే, ఆబహుమతి అందుకోవాలంటే నువ్వొక పనిచేయాలి!" అన్నాడు సుశేముడు.

ఏమిటి అన్నట్టుచూశాడు దళనాయకుడు.

"అది తరవాత చెబుతాను. ఇప్పుడునే నెవరోచెప్పు, చుద్దాం," అన్నాడు సుశేముడు.

"అదేమిటి ప్రభూ! యువరాజుగారు కదా!" అన్నాడు దళనాయకుడు.

"ఈనాటి యువరాజు అంటే, ఈ రాజ్యానికి ఏమవుతాను?" అని అడిగాడు సుశేముడు.

"కాబోయే మహారాజు ప్రభూ!" అన్నాడు దళనాయకుడు.

"శభాష్! చక్కగా చెప్పావు. కాబోయే మహారాజుకు నీ సహకారం అందించావంటే, నీ భవిష్యత్తు బంగారమవుతుంది. సరేనా?" అన్నాడు సుశేముడు.

"ఆజ్ఞాపించండి,ప్రభూ! శిరసావహిస్తాను," అన్నాడు దళనాయకుడు వేలి వజ్రపుటుంగరాన్ని, సంతోషంగా తడువుకుంటూ.

"అశోకుడి అభినందనసభ ఏర్పాట్లన్నీ నీ ఆధ్వర్యంలోనే కదా జరుగుతున్నాయి. ఆ ఏర్పాట్లన్నీ ఘనంగా, అపూర్వరీతిలో జరగాలి. ఆసన్మానంతరవాత పరిచారికా పుత్రుడికి మరేసన్మానమూ అవసరంలేనంత పరిపూర్ణంగా, పకడ్బందీగా జరగాలి. తెలిసిందా?" అన్నాడు సుశేముడు.

ఆ మాటలు వినగానే దళనాయకుడి కనుబొమలు ముడిపడ్డాయి. కాని సుశేముడు ఆప్యాయంగా వాడి చేయి పట్టుకుని, "అప్పుడే కంగారు పడకు పిరికిపందలా. దళనాయకుడివి సేనాధిపతి కావాలంటే నామాటవిను. ఏంచేయాలో వివరంగా చెబుతాను. రా," అంటూ నిర్మానుష్యంగా వున్న పొదలచాటుకు తీసుకుపోయాడు.



మరునాడు సాయంకాలం అశోకుడికి స్వాగతం పలకడానికి మగధరాజ్య ప్రధాన మంత్రీ, ఇతర మంత్రులూ, సేనాధిపతీ, దళనాయకులూ, అధికారులూ, పురప్రముఖులూ, రాజకుటుంబానికి చెందిన సుశేముడూ అతని సోదరులూ ఉపవనం చేరారు.

సూర్యుడు అస్తగిరిని చేరుకుంటున్నా, ఇంకా అశోకుడి జాడ కనిపించలేదు. ప్రధానమంత్రి సేనాధిపతిని, "మన యువరాజు రావడానికి ఇంత ఆలస్యమయిందేమిటి?" అని అడిగాడు.

"సూర్యాస్తమయంలోగా ఇక్కడికి చేరాలి. మార్గమధ్యంలో ఏదో అంతరాయం కలిగి ఉంటుంది," అన్నాడు సేనాధిపతి.

అంతలో గుర్రం మీద వేగంగా వచ్చిదిగిన ఒకదూత, అందరికీ నమస్కరించి, ప్రధాన మంత్రితో, "యువరాజుల వారికి మార్గమధ్యంలో వున్న విక్షుపుర ప్రజలు గుమిగూడి ఘనస్వాగతం పలికారు. వాళ్ళ మధ్య నుంచి బయటపడడానికి గంటసేపు పట్టింది. అందుకే ఆలస్యమయింది. యువరాజు సైన్యంతో బయలుదేరారు. త్వరలో రాగలరు," అన్నాడు.

సుశేముడు పక్కనే వున్న తన మిత్రుడికేసి చూస్తూ నర్మగర్భంగా మందహాసం చేశాడు. సుశేముడి పథకం ప్రకారమే విక్షుపురంలో జనం గుమిగూడి, స్వాగతం పేరిట అశోకుడి ప్రయాణానికి ఆలస్యం కలగించారన్న విషయం సుశేముడికీ, అతని విశ్వాసపాత్రులకూ మాత్రమే తెలుసు. చీకటిపడిన తరవాతే, అశోకుడు ఉపవనానికి చేరేలాగా చేయాలన్నది వాళ్ళ పథకం!

ఉపవననానికి వెళ్ళే బాటకు ఒకవైపున ఎత్తయిన ఏటికట్ట ఉన్నది. నది పొంగినప్పుడు, వెల్లువ వెలుపలికి ప్రవహించి భూభాగాన్ని ముంచెత్త కుండా ఉండడానికి నదీతీరం పొడవునా కొంతదూరం పెద్ద పెద్ద బండ రాళ్ళతో ఎత్తయిన కట్టను నిర్మించారు. అది నిర్మించి చాలా కాలమయింది. అందువల్ల అక్కడక్కడ బండరాళ్ళు ఊడిపోయి వదులుగా ఉన్నాయి.

సూర్యుడు అస్తమించి చీకటి నాలుగు దిక్కులనూ ఆవరిస్తున్నది. అక్కడక్కడవున్న పెద్దపెద్ద స్తంభాల మీద భటులు జ్యోతులు వెలిగించారు. ఆ సమయంలో దూరంగా గుర్రాల డెక్కల చప్పుడు వినిపించింది. "మౌర్య చక్రవర్తి బిందుసార మహారాజుకు జై!" అనే నినాదాలు వినిపించాయి.

ఉపవనంమధ్య చేరిన వాళ్ళందరూఉరక లెత్తే ఉత్సాహంతో వస్తూన్న సేనలకేసి చూడ సాగారు. సేనలు కంటబడగానే, "వీరాధి వీరుడు యువరాజు అశోకుడికీ జై! యువ రాజు అశోకుడికీ జై!" అనే నినాదాలు మిన్నుముట్టాయి.

సుశేముడూ, అతని అనుచరులూ చెప్ప రాని ఉద్రిక్తతకులోనయ్యారు.

ప్రధానమంత్రి మహారాజు తరఫున యువ రాజు అశోకుణ్ణి పుష్పమాలాంకృతుణ్ణి చేయ డానికి చేతిలో పుష్పహారంతో నిలబడ్డాడు.

అశోకుడి సేనలు ఏటికట్టను సమీపించి, దాని దాపులనున్న ఉపవనంలోకి దారితీసే బాటలో ప్రవేశించాయి. అక్కడ గుమి గూడిన ప్రజల ఆనందానికి అవధులు దాటాయి!

వస్తూన్న సేనలమధ్య హఠాత్తుగా పెళపెళా రావాలు వినిపించాయి. మసక చీకటిలో ఏదీ స్పష్టంగా కనిపించలేదు. కాని సైనికుల హాహా కారాలు, వేదనాస్వరాలుమాత్రంనాలుగు దిక్కులా ప్రతిధ్వనించాయి.

"ఏమిటది? ఏం జరిగింది? నా సోదరుడు అశోకుడు క్షేమమే కదా?" అని అరిచాడు సుశేముడు ఆవేశంతో. అతని ప్రశ్నలకు ఎవరూ సమాధానం చెప్పలేకపోయారు. కొందరుభటులు దివిటీలుపట్టుకుని ముం దుకు పరిగెత్తారు. అసరికే పెద్దపెద్ద బండలు ఏటికట్ట పై నుంచి దొర్లుకుంటూ వచ్చి, సేనలమీదపడి కొందరు సైనికులను నుగ్గు నుగ్గు చేశాయి. దాంతో మిగిలిన సైనికులు కూడా భయభ్రాంతులై హాహాకారాలు చేస్తూ, దిక్కుకొకరుగా పరిగెత్తసాగారు.

ప్రధానమంత్రీ, సేనాధిపతీ అశోకుడికోసం వెతుకుతూ, "యువరాజా! తమరెక్కడున్నారు? యువరాజా! యువరాజా!" అని బిగ్గరగా పిలువసాగారు.

కొంతసేపటికి ఏటికట్టపై నుంచి అశోకుడి కంఠస్వరం గంభీరంగా వినిపించింది: "నేను క్షేమంగా ఉన్నాను. మొదట నేను చెప్పినట్టు చేయండి. బండలకిందపడి క్షత గాత్రులైన వారిని జాగ్రత్తగా వెలుపలికి తీసి, దాపులనున్న విడిదిగృహాలకు తరలించండి. కట్టపై నుంచి బండలను సైనికులపై దొర్లించి పారిపోతూన్న దుండగులను తరిమి పట్టు కోండి. మమ్మల్ని హతమార్చాలన్న వాళ్ళ దురుద్దేశం తెలుస్తూనే ఉన్నది. కాని, వాళ్ళెవ రైనదీ తెలుసుకోవాలి!"–(ఇంకావుంది)





6

[మౌర్యచక్రవర్తి బిందుసారుడు అనారోగ్యంతో ఉన్నప్పుడు తక్షశిలలో తిరుగుబాటు బయలుదేరింది. బిందుసారుడి జ్యేష్ఠకుమారుడు సుశేముడు సుముఖత చూపకపోవడంతో, కనిష్ఠకుమారుడైన అశోకుడు కొంత సైన్యాన్ని వెంటబెట్టుకుని తక్షశిలకు వెళ్ళి, ఒక్క రోజులో తిరుగుబాటును అణచి రాజధానికి తిరుగు ప్రయాణమయ్యాడు. రాజధాని నగరంలో ప్రవేశించడానికి ముందే అశోకుణ్ణి హతమార్చాలని సుశేముడు పథకం వేశాడు. కాని, అది విఫలమయింది. – తరవాత]

నగరం పొలిమేరలో జరిగిన దుర్ఘటన గురించి తెలియజేసిన ప్రధానమంత్రి ఖల్లాటకుడితో రాజు బిందుసారుడు, "ఎంత దారుణం జరిగిపోయింది! అశోకుడి ప్రాణాలకు ఆపద వాటిల్లలేదు కదా? అశోకుడి వ్యూహకౌశలం గురించీ, విజయంగురించీ మీరు వివరంగా తెలియజేయగలరని ఉత్సాహంగా ఎదురు చూస్తూ కూర్చున్నాను. ఆఖరికి ఈ దుర్వార్త వినవలసి వచ్చింది. ఇప్పుడు ఆ దుర్ఘటన పూర్వాపరాల గురించి చర్చించవలసిన పరిస్థితి ఏర్పడింది!" అన్నాడు.

ప్రధానమంత్రి మౌనంగా ఉండడంతో రాజు, "తక్షశిలలో తిరుగుబాటు జరిపిన వారి ప్రతినిధులు కొందరు ఇక్కడున్నారనుకుంటాను. వాళ్ళు తిరుగుబాటును అణచిన అశోకుడి మీద ప్రతీకారంగా ఈ దారుణ చర్యకు పాల్పడి ఉంటారు.



తమరేమంటారు, మహా మంత్రీ!" అని అడిగాడు.

"ఏటికట్టపై నుంచి సేనలమీదికి బండలను దొర్లించిన దుండగులలో కొందరు పట్టుబడ్డారు. మన నగరపాలకుడు వాళ్ళ మీద విచారణ జరుపుతున్నాడు. ఏక్షణం లోనైనా ఆయన ఇక్కడికి రావచ్చు," అన్నాడు ప్రధానమంత్రి.

"అంటే, మీరీ విషయంలో మరెవరినో కూడా అనుమానిస్తున్నట్టున్నది!" అంటూ రాజు ప్రధానమంత్రి కేసి ఆతృతగా చూశాడు.

"అవును, ప్రభూ! మీ ఊహ సరైనదే," అన్నాడు ప్రధానమంత్రి.

ప్రధానమంత్రి సమాధానం విని రాజు ఒక్క క్షణం దిగ్భ్రాంతి చెందాడు. నగరపాలకుడి విచారణలో ఎటువంటి దారుణ విషయాలు బయటపడతాయో అని ఆయన ఒక్క నిమిషం ఆందోళనకు గురయ్యాడు.

ఆ విశాలమైన రాజమందిరాన్ని భయంకరమైన నిశ్శబ్దత ఆవరించింది. కొంత సేపటికి నగరపాలకుడు అక్కడికి వచ్చి రాజుకూ, మంత్రికీ నమస్కరించాడు. అతడి ముఖం విచారగ్రస్తమై ఉన్నది.

"నీ విచారణ పూర్తయిందా?" అని అడిగాడు రాజు.

"పూర్తయింది, మహాప్రభూ!" అన్నాడు. నగరపాలకుడు మెల్లగా.

"ఆ దుర్ఘటన అనుకోకుండా జరిగిన విపత్తే కదా?" అని అడిగాడు రాజు.

"కాదు, మహాప్రభూ! ఏటికట్టపై వున్న బండరాళ్ళను వదులు చేసి, వాటికింద కొయ్యపలకలను అమర్చారు. వెనక నుంచి కొయ్యపలకలను కదిలించగానే బండరాళ్ళుదొర్లుకుంటూవచ్చి సేనలపై పడ్డాయి. కొయ్యపలకలను అలా అమర్చడం చాలా శ్రమతో కూడుకున్నపని. అందుకు కనీసం వందమందినినియోగించిఉండాలి!" అన్నాడు నగరపాలకుడు.

"నమ్మశక్యం కాకుండా ఉన్నది! మన దళనాయకుడొకడూ, కొందరు సైనికులూ ఉదయం నుంచి ఉద్యానవనం వద్దే ఉన్నారు కదా! మరి వాళ్ళ కళ్ళబడకుండా అంతమంది ఎలా పనిచేయగలిగారు?" అని అడిగాడు రాజు.

"మన దళనాయకులలో ఒకడు ఈ విషయంలో దోషులకు సలహాలిచ్చి సహక



రించాడు ప్రభూ!" అన్నాడు నగరపాలకుడు విచారంగా.

"ఎంత పొగరు! ఇంతటి రాజద్రోహానికి ఇంతకుముందెన్నడూ మౌర్య సైన్యంలోని ఏ దళనాయకుడూ పాల్పడలేదే!" అన్నాడు రాజు ఆశ్చర్యంగా.

"మౌర్య సింహాసనాన్ని అధిష్ఠించబోతున్న యువరాజే, లంచమిచ్చి పురికొల్పినప్పుడు ఏ దళనాయకుడైనా ఇలాంటి రాజద్రోహానికి పాల్పడడంలో ఆశ్చర్యం ఏముంది మహారాజా!" అన్నాడు నగరపాలకుడు విచారం నిండిన కంఠస్వరంతో.

"ఏమిటి నువ్వనేది?" అన్నాడు రాజు.

"మహాప్రభువులు మన్నించాలి. నా విచారణలో బయల్పడిన సత్యాలను ప్రభువులకు తెలియజేయడం నా బాధ్యత. నేను సత్యమే చెబుతున్నాను," అన్నాడు నగరపాలకుడు వినయంగా.

కొంతసేపు అక్కడ నిశ్శబ్దం అలముకున్నది. ఆ తరవాత రాజు, "నిన్ను నేను సంపూర్ణంగా విశ్వసిస్తున్నాను. నువ్వు నాకీ సత్యం తెలియజేసినందుకు నిన్నూ, నీ రాజభక్తినీ హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. సంతోషమే కదా!" అన్నాడు నెమ్మదిగా.

"తమకీ విషయం తెలియజేయడానికి నా గుండె విలవిలలాడింది ప్రభూ. అయినా, కర్తవ్య నిర్వహణకోసం గుండెను రాయి చేసుకుని వచ్చాను. ప్రభువులు మన్నించాలి," అన్నాడు నగరపాలకుడు.

అంతవరకు వాళ్ళమాటలనుమౌనంగా వింటూన్న ప్రధానమంత్రి నగరపాలకుడితో, "నీ గుండెను మరింత దిటవు చేసుకోవలసిన అవసరం ఇప్పుడు ఏర్పడింది. మన మహారాజుకోసం, మన రాజ్యం కోసం, మౌర్యరాజకుటుంబ గౌరవం కోసం ఆ ముట్టడి రహస్యం బయటపడకూడదు. ఆ దుండగానికి పాల్పడి పారిపోతూ పట్టుబడిన ఏ ఒక్కరుగానీ, మీచే బందీ అయిన దళనాయకుడు గానీ, ఆకుట్రలో పాలుపంచుకున్న ఏ సైనికుడుగానీ దానిని గురించి నోరు తెరవడానికి ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదు!" అని, రాజుకేసి తిరిగి, "నా మాటలకు ప్రభువుల ఆమోదం లభిస్తుందనుకుంటాను," అన్నాడు.

"మహామంత్రి విజ్ఞతనూ, వివేకాన్నీ గౌరవిస్తాను," అన్నాడు రాజు విచారంగా.

"అయినా, వాళ్ళందరూ కలిస్తే వంద మందికి పైగా ఉంటారే!" అన్నాడు నగర పాలకుడు ప్రధానమంత్రితో మెల్లగాతనలో గొణుక్కుంటున్నట్టు.

"ఉండనీ! వాళ్ళందరి నోళ్ళూ శాశ్వతంగామూయించాలి. ఆపని కూడాసూర్యోదయంలోగా జరిగిపోవాలి. తెల్లవార గానే సేనలమీద బండలుదొర్లించి యువరాజు అశోకుణ్ణి హతమార్చడానికి కుట్ర పన్నింది తక్షశిల తిరుగుబాటుదార్లనీ, ఆ దుండగులందరినీ పట్టుకుని మరణదండన విధించామనీ చాటింపుద్వారా ప్రజలకు తెలియజేయాలి," అన్నాడు ప్రధానమంత్రి.

"మీ నిర్ణయం సరైనదే! కాని..." అని ఇంకేదో అనబోతూఆగాడునగరపాలకుడు.

"మన రాజ్య సంరక్షణకోసం వెయ్యి మందిని హతమార్చాలంటే నువ్వు వెనకాడగలవా?" అని అడిగాడు ప్రధానమంత్రి.

"ఏమాత్రం వెనకాడను!" అన్నాడు నగరపాలకుడు.

"మన యువరాజు సుశేముడికీ, అశోకుడికీ మధ్య ఉన్న ద్వేషం, పగగురించిన వదంతులు కూడా రాజ్య విచ్ఛిత్తికి దారితీస్తాయి. ఇప్పుడు బందీలుగా పట్టుబడిన వాళ్ళను వదిలి పెడితే లేనిపోని వదంతులను వ్యాపింపజేస్తారు కదా!" అన్నాడు ప్రధానమంత్రి.

"అవును, మీరన్నది నిజమే!" అన్నాడు నగరపాలకుడు దృఢమైన కంఠస్వరంతో.

"మంచిది. సరిగ్గా అర్ధరాత్రిసమయంలో నీ కర్తవ్యాన్ని నిర్దాక్షిణ్యంగా నిర్వర్తించు!" అని ఆజ్ఞాపించాడు రాజు.

నగరపాలకుడురాజుకూ,మంత్రికీనమస్కరించి అక్కడి నుంచి బయలుదేరాడు.

నగరపాలకుడు రాజభవనం దాటకముందే యువరాజు సుశేముడు అతనికి



ఎదురుపడి, "పట్టుబడిన దళనాయకుడు, అశోకుణ్ణి హతమార్చే కుట్రతో నాకూ సంబంధం ఉందని చెప్పాడని విన్నాను, నిజమేనా?" అని అడిగాడు.

"అవును. అలాగే చెబుతున్నాడు," అన్నాడు నగరపాలకుడు.

"అబద్ధం! అంతా అబద్ధం! అబద్ధాలు పలికే ఆ నీచుడికి మరణదండన విధిం చాలి!" అని అరిచాడు సుశేముడు.

ఆ మాటకు నగరపాలకుడు ఒక క్షణం నిర్విణ్ణుడయ్యాడు. ఇంతటి కపట బుద్ధి కలవాడా తమకు కాబోయే రాజుఅని అతడు మనసులో బాధపడ్డాడు.

"దళనాయుకుడు చెప్పిన అబద్ధం మహారాజుకు తెలిసిందా?" అని అడిగాడు సుశేముడు మళ్ళీ.

"దళనాయకుడు చెప్పిన విషయాలు మహారాజుకు తెలియజేయడం నాఉద్యోగ ధర్మం, ప్రభూ!" అన్నాడు నగరపాలకుడు.

"ఆ విషయం రాజు నమ్మారా?" అని అడిగాడు సుశేముడు.

"ఆ విషయం నేను చెప్పలేను,ప్రభూ!" అన్నాడు నగరపాలకుడు.

"అది సరే. ఆవిషయం వినగానేరాజు ఏమన్నారు"? అని రెట్టించాడు సుశేముడు మళ్ళీ.

"అది కూడా చెప్పడం కష్టం. అయితే, ఒక్కవిషయం మాత్రం తెలుసు. దళనాయ కుడితోసహా ఆ దుండగానికి పాల్పడిన వారందరికీ, మరణదండన విధించాలని మహారాజు నిర్ణయించారు," అన్నాడు నగరపాలకుడు.

"బావుంది! అద్భుతమైన నిర్ణయం! నాలాగే నా తండ్రి కూడా ఎంతటి వివేక వంతుడో చూశావా!" అంటూ సుశేముడు ఆనందంతో చప్పట్లు కొట్టాడు.

నగరపాలకుడికి పట్టరాని ఆగ్రహం కలిగింది. కాని దానిని బయటకు కనబడనీయకుండా, "నిజమే ప్రభూ!" అన్నాడు.

అప్పుడే మగధసేనాధిపతి రాజదర్శనానికి వెళుతూ అటువచ్చాడు. ఆయన సుశేముడికి నమస్కరించాడు. నగరపాలకుడు సేనాధిపతికి నమస్కరించి, "నేను తమరిని చూడ డానికే వస్తున్నాను," అన్నాడు.

"ఇక్కడే ఉండు. ఇప్పుడే తిరిగి వస్తాను," అంటూ సేనాధిపతి ముందుకు నడిచాడు.

"మిమ్మల్నీ, నన్నూ మహారాజు ఒక్కసారిగా రమ్మన్నట్టున్నది," అంటూ సుశేముడు కూడా సేనాధిపతి వెంట వేగంగా నడిచాడు.

మహారాజు వాళ్ళను చూడగానే, "ముఖ్యులైన మీరు ముగ్గురూ ఒక్కసారిగా నా దగ్గరికి రావడం మంచిదయింది. మీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి. కూర్చోండి," అన్నాడు.

ప్రధానమంత్రీ, సేనాధిపతీ, సుశేముడూ పట్టుపరుపులు పరచిన ఆసనాల మీద కూర్చున్నారు. కొన్ని నిమిషాల మౌనం తరవాత మహారాజు సుశేముడి కేసి చూస్తూ, "నేను విన్నది నమ్మడానికి నా మనసొప్పడం లేదు నాయనా!" అన్నాడు విచారంగా

"మీరు విన్నదేదో నాకు తెలియదు," అన్నాడు సుశేముడు.

"దీనిని కూడా నేను నమ్మలేను. నేను విన్నదేదో నీకు బాగాతెలుసు. దానిని నేను నా నోటితో చెప్పలేను. కాలగతిలో అన్నీ బయట పడతాయి. జరగవలసినదేదోకాలమే నిర్ణయిస్తుంది. దానినిఅలా ఉంచి ప్రస్తుత విషయానికి వద్దాం. మన పరగణాలలో ముఖ్యమైన అవంతీ రాజధాని ఉజ్జయినికి రాజ ప్రతినిధిగా ఒక యువరాజును పంపాలని మన ప్రధానమంత్రీ, సేనాధిపతీ అభిప్రాయపడుతున్నారు. నువ్వూ, అశోకుడూ తప్ప మరెవ్వరూ ఆ పదవికి అర్హులు కారు. మరొక ముఖ్యమైన విషయం ఏమంటే శత్రువుల్లా కాకుండా వివేకవంతులైన సోదరులుగా మీరిద్దరూ మసలుకునేంత వరకు, మీరుఒకరికొకరు దూరంగా ఉండాలని మేము ఆశిస్తున్నాము," అన్నాడు రాజు.

సుశేముడు మాట్లాడకుండా మౌనం వహించాడు.

"నువ్వు ఉజ్జయినికి వెళతావా?" అని అడిగాడు రాజు.

"నేను ఇక్కడే ఉంటాను," అన్నాడు సుశేముడు.

"జ్యేష్ఠ కుమారుడిగా, వెళ్ళే ప్రదేశాన్ని నిర్ణయించుకునే అవకాశం నీకే కల్పించాను. సరే, ఉజ్జయినికి అశోకుడే వెళ్ళనీ, అతడునాసలహానుపాటించగలడనుకుంటాను. ఇకనువ్వువెళ్ళు," అన్నాడు రాజు.

సుశేముడు లేచినిబడ్డాడు. రాజు తనను యువరాజుగా కాకుండా, కేవలం జ్యేష్ఠకుమారుడిగాప్రస్తావించడం అతనికి ఆగ్రహం కలిగించింది. వడివడిగా వెలుపలికి నడిచాడు.

* * *

"అయ్యా! నా మీద కనికరించి, ఒకే ఒక్కసారి యువరాజు సుశేముణ్ణి చూసే అవకాశం కల్పించండి. ఈ సమయంలో ఆయన ఒక్కడే నన్ను రక్షించగలడు! నేనొక్క పాపమూ ఎరగను. అంతా ఆయన చెప్పినట్టే చేశాను. అంతేగాని నాకేమీ తెలియదు!" అని ప్రాధేయ పడసాగాడు పట్టుబడిన దళనాయకుడు నగరపాకుడితో. బందీలుగా పట్టుబడిన వందమంది సైనికులతో పాటు దళనాయకుణ్ణి కూడా వధ్యస్థలానికి నడిపించారు.

దళనాయకుడి గోడు వినలేక నగరపాలకుడు, "నీకు మరణదండన విధించాలని ఆయువరాజే సెలవిచ్చాడు.జీవితం చివరిఘడియల్లోఉన్న నీతోఅబద్ధం చెప్పవలసిన అవసరం నాకు లేదు," అన్నాడు.

"ఏమిటీ! యువరాజు సుశేముడునాకు మరణదండన విధించాలన్నాడా?"అంటూ బిగ్గరగా విలపించసాగాడు దళనాయకుడు.

"అవును, ఎందుకంటే ఈ కుట్రలో నువ్వతణ్ణి భాగస్వామిని చేశావు కాబట్టి!అది అబద్ధం అని ఆయన అంటున్నాడు!" అన్నాడు నగరపాలకుడు.

"ఎంత అన్యాయం జరిగిపోయిందిరా దేవుడా! సుశేముడు సర్వనాశనమైపోతాడు. నాకు పట్టి నగతి వాడికీ పడుతుంది!" అంటూ వధ్యస్థలంలో దీనంగా విలపిస్తూన్న దళనాయకుడి మెడ మీద కత్తి పడింది! — (ఇంకావుంది)



సామ్రాట్ అశోక

7

[తక్షశిలలో చెలరేగిన తిరుగుబాటును అణచి తిరిగి వస్తూన్న అశోకుణ్ణి హతమార్చడానికి సుశేముడు వేసిన పథకం విఫలమయింది. జ్యేష్ఠకుమారుడి దుర్మార్గం తెలిసి బిందుసారుడు దిగ్భ్రాంతి చెందాడు. రాకుమారులు ఇరువురిలో ఒకరిని ఉజ్జయినికి పంపాలని రాజు నిర్ణయించాడు. రాజధాని పాటలీపుత్రాన్ని వదిలి అక్కడికి వెళ్ళడానికి సుశేముడు సుముఖత చూపక పోడవంతో, రాజు అశోకుణ్ణి పిలిపించాడు. —తరవాత]

తన దగ్గరికి వచ్చి నమస్కరించిన అశోకుణ్ణి కూర్చోమని చేయిచూపి, బిందుసారుడు పడకపై లేచి కూర్చుంటూ, "నాయనా, అశోకా! విజయవంతంగా యుద్ధం చేయడం ఒక ఎత్తు, అస్తవ్యస్తమైన పరిపాలనా వ్యవహారాలను సరిదిద్ది సక్రమమార్గంలో పెట్టడం మరొక ఎత్తు. ఈ రెండూ రాజకుమారులకు రెండు కళ్ళలాంటివి. మొదటి విషయంలో నీ సామర్థ్యాన్ని నిరూపించావు. రెండవ విషయంలో కూడా నీ సామర్థ్యాన్ని పరీక్షించాలను కుంటున్నాము," అన్నాడు.

"ఏం చేయాలో ఆజ్ఞాపించండి, ప్రభూ!" అన్నాడు అశోకుడు వినయంగా.

"సుసంపన్నమైన అవంతీ రాజధాని ఉజ్జయిని, మనకు అన్నివిధాలా తక్షశిల కన్నా చాలా ముఖ్యమైనది. అక్కడి మన ప్రతినిధి అకాలమరణం పాలయ్యాడు.

నువ్వు స్వయంగా అక్కడికి వెళ్ళి పరిపాలనా బాధ్యతలను చేపట్టగలవా?" అని అడిగాడు రాజు.

"తండ్రి కోరికను నెరవేర్చడం మహాభాగ్యంగా భావిస్తున్నాను, ప్రభూ!" అన్నాడు అశోకుడు ఏమాత్రం వెనుకాడకుండా.

"చాలా సంతోషం. క్షిప్రానదీ తీరంలో వెలసిన ఆ సుందరనగరంలో ఇప్పటికే మన అధికారులు చాలామంది ఉన్నారు. కావాలంటే, నువ్వు నీకు విశ్వాసపాత్రులైన అధికారులను పాటలీపుత్రం నుంచి వెంటబెట్టుకుని వెళ్ళవచ్చు. త్వరలో ఉజ్జయినికి బయలుదేరు," అన్నాడు రాజు.

"చిత్తం, ప్రభూ!" అని తండ్రికి నమస్కరించి, అక్కడి నుంచి బయలుదేరిన అశోకుడు తిన్నగా తల్లి దగ్గరికి వెళ్ళాడు. తండ్రి ఆనతి గురించి చెప్పి ఉజ్జయినికి వెళ్ళడానికి తనను దీవించమని తల్లిపాదాలకు ప్రణమిల్లాడు. ఆమాట విని తల్లి సుభద్ర ఉలిక్కిపడి, కొంతసేపటికి తేరుకుని, "నిన్ను చూస్తూ శోకాన్ని మరిచి పోవడంవల్లే నీకు అశోకుడని పేరు పెట్టాను. నిన్ను చూడకుండా ఎలా ఉండగలను? నువ్వు క్షేమంగా తిరిగి వచ్చేంతవరకు నా విచారం తీరదు. ఒక విధంగా నువ్వు దూరంగా వెళ్ళడం కూడా మంచిదే. క్షేమంగా వెళ్ళి రా నాయనా!" అంటూ సజలనయనాలతో అతన్ని లేవనెత్తింది.

"అనవసరంగా దిగులు చెందడం మంచిది కాదు, తల్లీ! అది సరే. నేనుదూరంగా వెళ్ళడం కూడా మంచిదే అన్నారు కదా, అది ఎలాగా?" అంటూ అశోకుడు తల్లి పక్కన కూర్చున్నాడు.

"సుదూరంలో ఉన్న ఉజ్జయినిలో నువ్వు ఇక్కడికన్నా క్షేమంగా ఉండగలవని ఒక ఆశ తండ్రీ! ఇక్కడ నీకు భయంకరమైన శత్రువులున్నారు. అయినా, నా చాదస్తం కాని, ఆ దుర్మార్గులు అక్కడికి కూడా రారని నమ్మకం ఏమిటి? నీ రక్షణ విషయంలో ఎల్ల వేళలా జాగ్రత్తగా ఉండు. నీ తల్లి దీవెనలు నీ కెప్పుడూ ఉంటాయి," అని అశోకుణ్ణి రెండు చేతులతో ఆశీర్వదించింది సుభద్ర.

ఒకనాటి ఉషోదయ శుభఘడియలలో, అశోకుడు వందమంది అంగరక్షకులతో ఉజ్జయినికి బయలుదేరాడు.

ఆరోజు మధ్యాహ్నానికి అందమైన విదిశాలోయలోని ఒక గ్రామం చేరుకున్నాడు. చుట్టూ చిన్న చిన్న కొండలతో పరివేష్టింప

బడిన చిన్నగ్రామం అది. గ్రామంలోచాలా ఆలయాలూ, ఒక బౌద్ధ విహారం కనిపించాయి. ఆ గ్రామంలో గౌతమబుద్ధుడు జన్మించిన శాక్యవంశానికి చెందిన కొన్ని సంపన్నకుటుంబాలు నివసిస్తున్నాయి.

విదిశాలోయ శాక్యనాయకుడు అశోకుడికి గౌరవంగా స్వాగతం పలికి, తమఇంట ఆతిథ్యానికి కావలసిన ఏర్పాట్లు చేయించాడు. కాని అశోకుడు గ్రామానికి వెలుపలే బసచేయాలని నిర్ణయించాడు. ఆయన ఆనతి ప్రకారం సమతలంగా ఉన్న ఒక కొండమీద ఆయన విశ్రాంతి తీసుకోవడానికి గుడారంవేశారు. రాత్రి భోజనంచేసి తన గుడారంలో హాయిగా నిద్రపోయాడు.

అరుణోదయ సమయంలో ఆయనకుమెలకువవచ్చింది. గుడారం వెలుపలికి వచ్చాడు. చుట్టూ దట్టమైన పొగమంచు.ఆ ప్రశాంత సుందర వాతావరణంలో కొంత దూరం నడిచి వెళ్ళి రావాలని ఆయనకు బుద్ధి పుట్టింది. అంగరక్షకులెవరినీ వెంట రావద్దని చెప్పి అశోకుడు మాత్రం ఒంటరిగా ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ మెల్లగా నడవసాగాడు. అప్పుడే నిద్ర మేల్కొంటూన్న రకరకాల పక్షుల కిలకిలారావాలు తప్ప, కొండలూ కోనలూ నిశ్శబ్దంగా ఉన్నాయి. అప్పుడే ఉదయాద్రిలో సూర్యుడు ఉదయిస్తున్నాడు. సూర్యుడి బంగారు కిరణాలు నీలిరంగు మంచును ఛేదించుకుంటూ ఆకాశంలో వింతశోభను ఏర్పరచాయి. చల్లటి గాలిలోనిలబడి, ఆఅద్భుత దృశ్యాన్ని కొంతసేపు తన్మయత్వంతో తిలకించి అశోకుడు అడుగు ముందుకు వేయబోయాడు.

"ఆగండి! అక్కడే ఆగండి! అన్న మాటలు వినిపించాయి.

తనను శాసించే ఆ సుమధుర కంఠస్వరం ఎవరిదా అని అశోకుడు వెనుదిరిగి చూశాడు. కొంత దూరంలో ఒక అందమైన యువతి కనిపించింది. తెల్లటి మంచు తెరలమధ్య ఆమె అప్పుడేఆకాశం నుంచి భూమిమీద కాలుమోపిన దేవతలా కనిపించింది అశోకుడికి.

"మిమ్మల్ని ఆపినందుకు క్షమించండి. మీముందు పెద్దఅగాధం ఉన్నది!"అన్నదా యువతి.

అప్పటికే మంచుకరిగి దిక్కులు ప్రకాశవంతమవుతున్నాయి. అశోకుడు కుడివైపుకు తిరిగి కిందికి చూశాడు. భయంకరమైన అగాధం. తానొక అగాధం అంచున

నిలబడి ఉండడం గ్రహించి అశోకుడు ఒక్క క్షణం దిగ్భ్రాంతి చెందాడు. రాయి రప్పలతో నిండిన పాతాళంలాంటి అగాధం! ఒక్క అడుగు ముందుకు వేసి ఉన్నట్ట యితే ప్రాణాలకే ముప్పువాటిల్లి ఉండేది!

అశోకుడు వెనుదిరిగి ఆ యువతిని సమీపించాడు. ఆమె తలవంచుకుని, "తమకు ఆటంకం కలిగించినందుకు, క్షమించండి, యువరాజా!" అన్నది వినయంగా.

"నిన్ను క్షమించడమా! నువ్వేలేకుంటే నేనిప్పుడు ప్రాణంతో ఉండేవాణ్ణి కాదు!" అన్నాడు అశోకుడు.

"తమరిని రక్షించింది నేనుకాదు. శాక్య ముని బుద్ధుడి కరుణ ద్వారా తమరు రక్షింప బడ్డారు!" అన్నదాయువతి.

"నువ్వెవరు? ఈ సమయంలో ఇక్కడేం చేస్తున్నావు?" అని అడిగాడు అశోకుడు.

"ఈ ప్రాంతం పేరే నా పేరు! విదీశఅని పిలుస్తారు. ఇక్కడి శాక్యనాయకుడు మాతండ్రి. ఒక గుహలో ఉంటూన్న వృద్ధ భిక్షువుకు పరిచర్యలు చేసి తిరిగివస్తు న్నాను," అన్నదా యువతి.

విదీశ మాట తీరు, అందచందాలు అశోకుణ్ణి ఎంతో ఆకర్షించాయి. ఆమె ప్రశాంతవదనం ఆయనకు ముగ్ధ మనో హరంగా కనిపించింది.

"యువరాణి విదీశా! నీ కెలా కృతజ్ఞ తలు చెప్పాలో తెలియడంలేదు!" అన్నాడు అశోకుడు.

"నేను యువరాణిని కాను, యువ రాజా!" అన్నది విదీశ.

"యువరాణి కన్నా గొప్పదానివి! నన్ను రక్షించిన దేవతవు!" అన్నాడు అశోకుడు.

"యువరాజా! తమకు ఒక విషయం గుర్తుచేయడం నా కర్తవ్యం. తమ ప్రాణా లను నేనురక్షించలేదు. శాక్యముని బుద్ధ దేవుడి భక్తుడికి పరిచర్యలు చేసి నేను ఇటువచ్చాను. అంటే ఆ బుద్ధుడి పరమ కరుణ మాత్రమే తమను రక్షించింది," అని చెప్పి విదీశ వెళ్ళిపోయింది.

అశోకుడి దృష్టి మళ్ళీ ప్రకృతి మీదికి మళ్ళింది. ఎంతటి విశాల ప్రపంచం! ఈ ప్రపంచంలో ఎన్నెన్ని మధురిమలు! ఎంత కరుణ! తానిన్నాళ్ళు గడిపిన రాజ భవనంలో అసూయ, ద్వేషం, పగ, కోరిక, కక్షలు, పోరాటాలూ—ఇవి తప్ప మరేం ఉన్నాయి? అని ఆలోచిస్తూ కొంతసేపు



అలాగే తిరిగి గుడారంచేరుకున్నాడు. ఆ రోజంతా అక్కడే విశ్రాంతి తీసుకుని మరునాడే ఉజ్జయినికి బయలుదేరాలని నిర్ణయించాడు. అంగరక్షకులతో, ఆమాట చెప్పి, "రేపే మన ప్రయాణం. నా ఏకాంతానికి భంగంగాని, ఈ గ్రామ ప్రజలకు ఇబ్బంది గాని కలిగించకుండా, మీరు ఈ రోజంతా మీ ఇష్టానుసారం గడపవచ్చు!" అన్నాడు.

ఆ తరవాత అశోకుడు క్షిప్రానదిలో స్నానం చేశాడు. కొండలపై, కోనలలోతన ఇష్టానుసారం తిరిగాడు.

అంగరక్షకులు ఆరోజంతా అశోకుడి దరిదాపులకు రాలేదు. వాళ్ళకు, గ్రామం పొలిమేరలలో ముగ్గురు నాట్యకత్తెలు తారసపడ్డారు. నాట్యకత్తెల వెంట కొందరు వాద్యకారులువచ్చారు. అందమైన ఆనాట్యకత్తెలు నవరసాలొలికించే గీతాలతో,నాట్యాలతో సైనికులను అలరించారు. ఆట పాటలు ముగిశాక, ఆ రాత్రి తమతోభోజనానికి రమ్మని సైనికులు నాట్యకత్తెలను పిలిచారు. ఆమాట వినగానే వాళ్ళు అమిత సంతోషంతో, "అంతకన్నా భాగ్యమా? తప్పకుండా వస్తాము. మీరు అనుమతిస్తే వంట చేయడంలో కూడా మీకు సహాయ పడతాం," అన్నారు.

సైనికులు సరే అన్నారు.

ఆ రోజు సాయంకాలం శాక్యనాయకుడు అశోకుడి దగ్గరికివచ్చి, రాత్రి భోజనానికి తమ ఇంటికి రమ్మని ఆహ్వానించాడు. అశోకుడు ఒక్క నిమిషం ఆలోచనలో పడ్డాడు. ఎట్టి పరిస్థితిలోగాని పరిచయంలేని వాళ్ళు పెట్టే ఆహారం భుజించరాదని ప్రధానమంత్రీ, సేనాధిపతీ చేసిన హెచ్చరిక ఆయన స్మృతి పథంలో మెదిలింది. శాక్యనాయకుడితో తనకు అంతకుముందు పరిచయం లేకపోయినా ఋజువర్తనుడిలా అశోకుడికి కనిపించాడు. పైగా అతని ఇంటికి వెళితే అక్కడ అతని కుమార్తె విదీశను చూసే అవకాశం కలగవచ్చు. అందువల్ల శాక్యనాయకుడి ఆహ్వానాన్ని అశోకుడు అంగీకరించాడు.

ఆ రాత్రి అశోకుడికి షడ్రసోపేతమైన విందు భోజనం వడ్డించారు. అన్నీ విదీశ, ఆమె తల్లి వండిన వంటకాలే. దీపం వెలుగులో విదీశ ప్రశాంతవదనం చూసి అశోకుడి హృదయం ఉప్పొంగింది.

భోజనంముగించేసరికి ఆకాశం మేఘావృతమయింది. శాక్యనాయకుడూ, అతని మిత్రులూ స్వయంగా దివిటీలు పట్టుకుని ముందు నడిచి, అశోకుణ్ణి ఆయన గుడారానికి చేర్చారు.

అశోకుడు గుడారం చేరిన కొంతసేపటికి పూలవానలా సన్నటిచినుకులు పడడం ఆరంభమయింది. అతడుశయ్యపై పడుకుని ప్రశాంతంగా నిద్రకు ఉపక్రమించాడు. అర్ధరాత్రి సమయంలో అశోకుడు గాఢ నిద్రలో ఉన్నప్పుడు, హఠాత్తుగా కీచుగొంతుతో పెద్దకేక వినిపించడంతో ఉలిక్కిపడిలేచాడు. గుడారంలోపల నల్లటి ఆకారాలు రెండు కనిపించాయి. ఒక ఆకారం మెరుస్తూన్న కత్తిని పైకెత్తింది!

అంతే! అశోకుడు ఒక్క ఉదుటున బంతిలాలేచి శయ్యకిందఉన్నకత్తిని అందుకునినల్లటి ఆకారంమీదికి ఉరకబోయాడు. అంతలోనే ఆ ఆకారాలురెండూ గుడారం నుంచి బయటపడి పరిగెత్తి పారిపోసాగాయి.

అశోకుడు అంగరక్షకుల కోసం కేకవేసి, ఆ ఆకారాలను వెంబడించాడు. తనకు ముందు మరెవరో ఒక వ్యక్తి ఆ ఆకారాలను తరమడం అశోకుడికి కనిపించింది. అశోకుడు కిందపడదోసి పట్టుకునేలోగా ఆవ్యక్తి కూడా రెండవ ఆకారాన్ని పట్టుకున్నది. పట్టుబడిన ఆ ఇద్దరూ స్త్రీలే!

ఆలోగా కొందరు అంగరక్షకులు అక్కడికివచ్చారు. ఆకాశంలో మేఘాలు తొలగి పుచ్చపువ్వులా వెన్నెల కాస్తోంది. పట్టుబడిన ఇద్దరు స్త్రీలను చూసి సైనికులు దిగ్భ్రాంతి చెందారు. ఆరోజు పగలంతా సైనికులను



ఆటపాలతో ఆనందపరచిన నాట్యకత్తెలే వాళ్ళు! యువరాజును హతమార్చడానికే వాళ్ళు వచ్చారన్న విషయం తెలిసిపోయింది! మరి ఆ అపరాత్రివేళ కీచుగొంతుతో కేకపెట్టి అశోకుణ్ణి నిద్రలేపిన వారెవరు? తనకు ముందుపరిగెత్తి రెండవ దోషిని పట్టుకున్న ఆ వ్యక్తిని అశోకుడు పరిశీలనగాచూశాడు. ఆమె మరెవరోకాదు; విదీశ! అశోకుడి ముఖంలోని ఆశ్చర్యం పసిగట్టిన విదీశ, "రోజంతా మీ సైనికులను ఆటపాటలతో అలరించిన నాట్యకత్తెలను చూడగానే నా కెందుకో అనుమానం కలిగింది. వాళ్ళు కేవలం నాట్యకత్తెల్లా కనిపించలేదు. వాళ్ళతెలివితేటలు, అతి జాగ్రత్త నాకు మరింత సందేహం కలిగించాయి.నేను వృద్ధభిక్షువుకు పరిచ

ర్యలుచేసి తిరిగి వస్తూన్నప్పుడు వీళ్ళిద్దరూ మరి కొందరు అనుచరులతో మీగుడారం ఉన్న కొండమీదికి రావడం చూశాను. అప్పుడే అడ్డుకుంటే నన్ను హతమార్చే వాళ్ళే! అదృష్టవశాత్తు నాసోదరుడు యశుడు ఆ సమయంలో నాకు కనిపించాడు. అతన్ని కొండ పాదతలంలో ఉండమని చెప్పి నేను రహస్యంగా వాళ్ళవెనకే కొండ పైకి వచ్చాను. ఆఇద్దరిలో ఒకస్త్రీ గుడారం వెలుపలే కత్తి ఝళిపించడం చూసి, ఇక అలస్యం చేయరాదని గట్టిగాకేక పెట్టాను," అన్నది. "అంటే, రెండవసారి కూడా నా ప్రాణాలు రక్షించింది విదీశ అన్న మాట!" అన్నాడు అశోకుడు.

"కాదు; బుద్ధుడి అపారకరుణ మాత్రమే తమను రక్షించిందని మళ్ళీ మనవి చేస్తున్నాను," అన్నది విదీశ.

అశోకుడు మౌనంగా తలపంకించి, తనను చంపడానికివచ్చిన స్త్రీల కేసి ఒక సారి పరిశీలనగాచూసి, గుడారానికి బయలు దేరాడు. ఇద్దరు స్త్రీలు దొరికారు. వాళ్ళతో పాటు వచ్చిన పురుషుల కోసం సైనికులు చుట్టుపక్కల వెతికారు. ఒక్కడూ కనిపించలేదు. కొండ దిగువ కాచుకుని వున్న విదీశ సోదరుడు యశుడికి పొదల మాటున ఒకడు దాగి ఉండడం కనిపించింది. యశుణ్ణి చూడగానే వాడు నదిలోదూకి పారిపోవడానికి పరిగెత్తాడు. కాని యశుడు వాణ్ణి నదిలో దూకేలోగా పట్టి బంధించాడు.

పట్టుబడిన వాణ్ణీ, ఇద్దరు స్త్రీలనూ సైనికులు పెడరెక్కలు విరిచికట్టి అశోకుడి సమక్షానికి తీసుకువచ్చారు. అంతలో అక్కడికి విదీశతండ్రిఅయిన శాక్యనాయకుడూ మరికొందరు పెద్దలూ చేరారు. నాట్యకత్తెలు సైనికుల ఆహారంలో మత్తు మందు కలిపారని విచారణలో తెలియ వచ్చింది. అందుకే అశోకుడి రక్షణలో ఎప్పుడూ అప్రమత్తులుగా ఉండే సైనికులు ఆరాత్రి అశోకుడు కేకవేసి పిలిచినా నిద్ర లేవలేకపోయారు.అంతావిన్న విదీశతండ్రి, "వీళ్ళు చేసిన దుండగం తెలిసిపోయింది. ఆదుండగం చేయడానికి వీళ్ళను పంపిన వారెవరో మనకు తెలియాలి," అన్నాడు.

"అవును, అది చాలా ముఖ్యం," అన్నాడు యశుడు. — (ఇంకావుంది)



8

[తండ్రి బిందుసారుడి ఆజ్ఞానుసారం అశోకుడు అవంతీ రాజధాని ఉజ్జయినికి బయలు దేరాడు. ఆరోజు సాయంకాలం మార్గమధ్యంలోని విదిశాలోయలో విడిది చేశాడు. తెల్ల వారుజామున అశోకుడు ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ నడుస్తూపోయి అగాథంలోకి అడుగు వేయబోతూండగా, శాక్యనాయకుడి కుమార్తె విదీశ కాపాడింది. ఆ రాత్రి ఇద్దరు యువతులు అశోకుణ్ణి హత్యచేయడానికివచ్చి పట్టుబడ్డారు. —తరవాత]

పట్టుబడిన నాట్యకత్తెల ఎదుట వాళ్ళకు తోడుగా వచ్చిన పురుషులను యశుడు నానా హింసలు పెట్టి బాధించాడు. ఆ తరవాత అతడు స్త్రీలకేసి తిరిగి, "మీరు యువరాజును హతమార్చడానికి వచ్చారు. దానికి మరణశిక్ష తప్పదు. మీకు ఎలాగూ చావుతప్పదు. చావడానికి ముందు నిజం చెప్పండి. కనీసం నరకంలోనైనా తక్కువ శిక్ష అనుభవించగలరు!" అన్నాడు.

నాట్యకత్తెలు బెదురుతూ ఒకరినొకరు చూసుకున్నారు. వాళ్ళల్లో ఒకతె, "అయ్యా, మా మీద కరుణ చూపండి. మాకు నరకం అంటే భయం లేదు. దానిని మేమెప్పుడూ చూడలేదు. కాని మీరు పెట్టే బాధలు భరించలేకుండా ఉన్నాం. మాకు చావంటే భయం. మమ్మల్ని హింసించి చంపడంలో మీరు సాధించే దేమీ ఉండదు. ప్రాణాలతో వదిలిపెడితే



మునుముందు మీకు ఉపయోగపడవచ్చు. ఇప్పుడు నిజం చెప్పేస్తాం," అన్నది.

"మొదట నిజం చెప్పండి. ఆ తరవాత మీ చావుబతుకుల సంగతి యువరాజు నిర్ణయిస్తాడు!" అన్నాడు యశుడు.

"రాజధాని పాటలీపుత్రం నుంచే మేము యువరాజునూ, ఆయన పరివారాన్నీ వెన్నంటి వచ్చాం. మేము నాట్యకత్తెలం. మాకు డబ్బిచ్చిన వాళ్ళు చెప్పినట్టు చేయడం మా వృత్తి. మమ్మల్ని పంపిన వారు యువరాజుకు శత్రువులేగాని, మేము ఆయనకు శత్రువులం కాము," అన్నది ఒక నాట్యకత్తె.

"డబ్బిచ్చి మిమ్మల్ని పంపిన యువరాజు శత్రువులు ఎవరు?" అని అడిగాడు యశుడు.

"మాకు ప్రాణభిక్ష పెడతామని ముందు మాట ఇవ్వండి!" అన్నది నాట్యకత్తె.

"షరతులు వద్దు. నిజం చెప్పు, లేదా చంపేస్తాను," అని హెచ్చరించాడు యశుడు కోపంగా.

"అయ్యా! రాకుమారుడు అశోకుణ్ణి హతమార్చమని మాకు డబ్బిచ్చి పంపింది మరెవరోకాదు; బిందుసార చక్రవర్తి జ్యేష్ఠ కుమారుడూ, కాబోయే రాజూ అయిన సుశేముడు!" అన్నది నాట్యకత్తె.

ఆ మాట విని, "నిజంగానా!" అంటూ అశోకుడు గుడారం నుంచి వెలుపలికి వచ్చాడు.

"ముమ్మాటికీ నిజం ప్రభూ!" అంటూ, సుశేముడు తమను రాజమందిరానికి రహస్యంగా పిలిపించినదీ, వెయ్యి బంగారు

నాణాలతో పాటు మనిషికొక వజ్రపుటుంగరం బహూకరించినదీ, చెప్పినపని విజయవంతంగా నెరవేర్చినట్టయితే మరింత ధనం ఇస్తామని ఆశ చూపినదీ పూసగుచ్చినట్టు తెలియజేశారు నాట్యకత్తెలు. వాళ్ళ దగ్గరున్న వజ్రపుటుంగరాలూ, చెప్పిన రాజోద్యోగుల పేర్లూ వాళ్ళు నిజమే చెబుతున్నారనడానికి సాక్ష్యాధారాలుగా తోచాయి. అశోకుడూ, యశుడూ వాళ్ళ మాటలు నమ్మారు.

విచారణ పూర్తయిన వెంటనే అశోకుడు చప్పట్లు చరిచాడు. దృఢకాయులైన ముగ్గురు సైనికులు వచ్చి అశోకుడికి నమస్కరించారు. "వీళ్ళను ఇక్కడి నుంచి తీసుకువెళ్ళి, పంపవలసిన చోటికి పంపండి!" అన్నాడు అశోకుడు.



"మమ్మల్ని ఎక్కడికి పంపుతారు ప్రభూ!" అని అడిగారు నాట్యకత్తెలు.

"మీరు నన్ను పంపాలనుకున్న చోటికి!" అన్నాడు అశోకుడు.

"అయ్యో! వద్దు ప్రభూ, వద్దు!" అంటూ హృదయ విదారకంగా విలపించసాగారు నాట్యకత్తెలు.

"ఏడవకండి! దురదృష్ట వంతులైన యువతులారా, ఏడవకండి! శాక్యముని గౌతమ బుద్ధుణ్ణి ప్రార్థించండి. ఆయన అపారకరుణ యువరాజును కాపాడినట్టే మిమ్మల్ని కూడా కాపాడుతుంది!" అన్న మధురకంఠస్వరం వినిపించింది.

అందరూ అటు కేసి తిరిగి చూశారు. విదీశాదేవి మందహాసం చేస్తూ అక్కడికి వచ్చింది.

"చెల్లాయీ! వాళ్ళలో లేనిపోని ఆశలు కలిగించవద్దు!" అన్నాడు యశుడు.

"నేను వాళ్ళకు ఆశలు కల్పిస్తున్నానా! వాళ్ళను ప్రాణాలతో విడిచిపెడతాననినువ్వే ఆశ చూపావు. ఇంతలో ఆ మాట మరిచి పోవద్దు!" అన్నది విదీశ.

"వివేకవంతురాలివి! ఇలా అర్థ రహితంగా మాట్లాడటమేమిటి? నేనెప్పుడు వాళ్ళను ప్రాణాలతో విడిచి పెడతాన న్నాను? అయినా, ప్రాణాలతో వదలిపెట్ట డానికి నేనెవర్ని?" అన్నాడు యశుడు కాస్త కటువుగా.

"నిజం చెప్పండి, లేకుంటే చంపే స్తానని నువ్వే వాళ్ళను హెచ్చరించావు. నిజం చెబితే ప్రాణాలతో వదిలి పెడతాననే కదా ఆమాటకు అర్థం! ఇప్పుడెలా నువ్వి చ్చిన మాట తప్పుతావు?" అన్నది విదీశ.

"అద్భుతం!" అంటూ అశోకుడు చప్పట్లు చరుస్తూ, యశుడికేసి తిరిగి, "ఇటువంటి తెలివైన యువతిని సోదరిగా పొందిన నువ్వు చాలా అదృష్టవంతుడివి మిత్రమా!" అన్నాడు.

యశుడు అవాక్కయ్యాడు. విదీశ సంతోషంతో ఒక్క నిమిషం ఉక్కిరిబిక్కి రయింది. విదీశ మాటలు వినగానేనాట్య కత్తెల కళ్ళు కృతజ్ఞతతో నిండాయి.

యశుడు తేరుకుని అశోకుణ్ణి, "ఈ మోసకత్తెలను ప్రాణాలతో వదిలి పెట్టాలని తమరు నిజంగానే ఆశిస్తున్నారా, యువ రాజా!" అని అడిగాడు.

"విదీశ కోరిందంటే అలా చెయ్యక తప్పదు మరి! అయితే, ఆమె అందుకు

తగిన ధర చెల్లించాలి!" అంటూ అశోకుడు విదీశ కేసి చూశాడు.

"నా శక్తికి మించనిదైతే సంతోషంగా చెల్లిస్తాను, యువరాజా! అదేమిటో చెప్పండి!" అన్నది విదీశ.

"ఆ ధర నువ్వు మాత్రమే చెల్లించ తగినది. ఎంతో అమూల్యమైనది. చెప్పాలంటే మాట రావడం లేదు!" అని కొంతసేపు ఆగి, "ఆ సంగతి మీ అన్న యశుడితో చెబుతాను," అన్నాడు అశోకుడు.

యశుడు చిన్నగా నవ్వుతూ విదీశకేసి చూశాడు. ఆమె తలవంచుకుని అక్కడి నుంచి వెళ్ళింది.

నాట్యకత్తెలనూ, మగ ఖైదీలనూ దూరంగా తీసుకు వెళ్ళమని అశోకుడు భటులను ఆజ్ఞాపించాడు.

* * *

యువరాజు అశోకుడు తమ కుమార్తె విదీశను వివాహమాడడానికి ఇష్టపడుతున్నాడని, యశుడు చెప్పడం విని, శాక్య నాయకుడు, ఆయన భార్య మొదట నమ్మలేకపోయారు. ఆ తరవాతఆశ్చర్యంతో ఏమీ మాట్లాడలేక మౌనం వహించారు. అప్పుడు యశుడు, "యువరాజు అశోకుడు ఉన్నత వంశానికి చెందినవాడు. అందరు రాజకుమారుల్లాగే ఆయనకూ రాజ్యకాంక్ష అధికార ప్రీతి ఉన్నాయి. అంతేగాని, ఆయన స్వభావం చాలా ఉన్నతమైనదనీ, ఆయన సున్నితమనస్కుడనీ అందరూ చెప్పుకుంటారు. నా అభిప్రాయం కూడా అదే. సుసంపన్నమైన అవంతీ ప్రాంతానికి ఆయన రాజప్రతినిధిగా అధికారంచేపట్టనున్నాడు. ఆయన్ను వివాహ మాడినట్టయితే, మన విదీశ దాదాపు రాణి అయినట్టే," అన్నాడు.

అంతలో అక్కడికి వచ్చిన విదీశ, "ఇదా నువ్వు, నీ సొంత చెల్లెలుగా భావిస్తూన్న నన్ను అర్థంచేసుకున్న తీరు? రాణి కావడంలోనే నా ఆనందం ఉన్నదని నువ్వు భావిస్తున్నావా?" అని అడిగింది.

యశుడు వెంటనే ఏమి చెప్పడానికీ తోచక ఊరుకుని, ఆ తరవాత చిన్నగా నవ్వుతూ, "అవును, చెల్లెమ్మా! తనచెల్లెలు రాణిఅయితేచూసిఆనందించనిఅన్నయ్య ఉంటాడా? ఇందులో తప్పేమిటి? అయినా, యువరాజు కోరికను అంగీకరించడానికి నువ్వెందుకు వెనుకాడుతున్నావో నా కర్థం కావడంలేదు!" అన్నాడు.

విదీశ తల్లి, "అవును నాయనా, మొదట యువరాజు నిజంగానే మన అమ్మాయిని వివాహమాడడానికి కోరాడా అని నమ్మలేకపోయాను. మన అమ్మాయి మామూలు ఆడపిల్లకాదని నానమ్మకం. జరిగిన సంఘటలను చూస్తూంటే ఆ సంఘటనలవెనక ఏదో దైవనిర్ణయం ఉన్నట్టు నా కనిపిస్తున్నది. యువరాజు మన ఊళ్లోనే ఎందుకు బసచేయాలి? అతడు అగాథంలో పడిపోకుండా ఆపడానికి విదీశను అక్కడికి పంపిన వారెవరు? అశోకుణ్ణి హతమార్చడానికి వెళుతూన్న హంతకులు మీకళ్ళబడడమేమిటి? అంతా విచిత్రంగా ఉన్నది కదా!" అన్నది.

అంతవరకు మౌనంగా ఉన్న విదీశ తండ్రి, "నా కుమార్తె జీవితం యువరాజు జీవితంతో ముడిపడి ఉన్నదని నాకనిపిస్తున్నది. లేకుంటేఒక్కరేయీ, పగలూ వ్యవధిలో రెండుసార్లు ఆమె యువరాజు ప్రాణాలను కాపాడి ఉండదు!" అన్నాడు.

వాళ్ళ మాటలకు విదీశ కళ్ళనుంచి బాష్పాలు పెల్లుబికాయి. ఆమె మౌనంగా ఇంటినుంచి వెలుపలికి వచ్చి, చేతులు జోడించి పైకి చూస్తూ, "తథాగత బుద్ధా! ఏమిటీ పరీక్ష? అల్లకల్లోలంగా ఉన్న నా మానసికస్థితి నుంచి బయటపడే మార్గం చూపించు. సన్యాసిని జీవితాన్ని స్వీకరించి, నువ్వు చూపిన మార్గంలో పయనించి, నిర్వాణం పొందాలన్నదే నా అభీష్టం. అధికారం కోసం, ఐహిక సుఖాలకోసం నేనెన్నడూ ఆశలు పెంచుకోలేదు. ఎటూ తేల్చుకోలేని ఇటువంటి దోలాయమాన స్థితిని నేను ఎందుకు ఎదుర్కోవలసి వచ్చింది?" అని ప్రార్థించింది.

కొంతసేపు అక్కడ నిశ్శబ్దం ఆవరించింది. ఆ తరవాత ఆమె యశుడికేసి తిరిగి, "నాకు మంచి ఏదో, చెడు ఏదో తెలియడం లేదు. నిజానికి ఈ విషయంలో నా తల్లి దండ్రుల సలహాపై కూడా నాకు నమ్మకం లేదు. ఎందుకంటే వాళ్ళు నా ఐహిక సుఖాలనే కోరుకుంటారు. తమ కుమార్తె యోగ్యుడైన యువరాజును పెళ్ళాడడం కన్నా మించిన అదృష్టం ఉంటుందని ఏ తల్లి దండ్రులైనా ఊహించ గలరా? ఈ విషయంలో నాకు సరైన సలహా ఇవ్వగల వాడు గురుదేవుడు ఉపగుప్తుడు ఒక్కడే!" అన్నది.

"మంచిది, అలాగే ఆయన సలహా తీసుకో," అన్నాడు యశుడు.

ఆమె తల్లిదండ్రులు కూడా అందుకు సమ్మతించారు.

ఉపగుప్తుడు మరునాడే విదీశకు రాను న్నాడని తెలిసింది. యశుడి ద్వారా విదీశ అభిప్రాయం తెలుసుకున్న అశోకుడు అంతవరకు వేచి ఉండడానికి సంతోషంగా సమ్మతించాడు.

మరునాడు తెల్లవారగానే విదీశ, ఆమె తల్లిదండ్రులు, యశుడితో కలిసి ఉపగుప్తుడు విడిది చేసిన విహారానికి వెళ్ళారు. తల్లిదండ్రులు, యశుడు విహారానికి వెలుపలే ఆగిపోయారు. విదీశ మాత్రం ఉపగుప్తుణ్ణి దర్శించడానికి లోపలికి వెళ్ళింది.

కొంతసేపు తరవాత గంభీరవదనంతో విదీశ, విహారం నుంచి వెలుపలికివచ్చింది. అందరూ ఉత్కంఠతతో ఆమెకేసి చూడసాగారు. ఆమె చిరుదరహాసంతో, "మీకుదగ్గర కావాలనుకుంటూన్న యువరాజు దూరంగా ఎందుకు నిలబడ్డారు?" అన్నది చెట్టు కింద నిలబడ్డ అశోకుణ్ణి చూపుతూ.

యశుడి ముఖం ఆనందంతో వెలిగిపోయింది. అతడు పరుగుపరుగున వెళ్ళి, అశోకుణ్ణి విదీశ తల్లిదండ్రుల వద్దకు తీసుకు వచ్చాడు.

"యువరాజా! గురుదేవుడు తమ కోరికను అంగీకరించమని సెలవిచ్చాడు. అయితే, ఒక విన్నపం! బుద్ధుడు బోధించిన ధర్మమార్గాన్ని నేను అనుసరించడానికి తమరు అంగీకరించాలి!" అన్నది విదీశ ప్రశాంతమైన కంఠస్వరంతో.



"విదీశాదేవి విన్నపాన్ని హృదయ పూర్వకంగా అంగీకరిస్తున్నాను," అన్నాడు అశోకుడు.

"కృతజ్ఞురాలిని! మీతో నా వివాహం జరగడం తథాగతుడికి ప్రీతిపాత్రంకాగలదని గురుదేవుడి విశ్వాసం. నా గురువు పట్ల నాకు అపారమైన నమ్మకం ఉన్నది. ఆయన సలహాను పాటించడానికి సిద్ధంగా ఉన్నాను," అంటూ విదీశ తన తల్లి దండ్రులకూ, అశోకుడికీ, యశుడికీ వంగి నమస్కరించింది.

* * *

వివాహానికి అనుమతిని వేడుతూ, శాక్యనాయకుడూ, అశోకుడూ బిందుసార చక్రవర్తికి ఒక దూతద్వారా లేఖలు పంపారు. కాని ఆ లేఖలు బిందుసారు

డికి అందలేదు. సుశేముడి మిత్రుడొకడు దూతకు డబ్బిచ్చి, ఆ లేఖలను తీసుకుని వాటిని నాశపరిచాడు. సుశేముడి మనుషులు - తాను వివాహానికి పరిపూర్ణంగా సమ్మతిస్తున్నట్టు చక్రవర్తి రాసినట్టే ఒక ఉత్తరం రాసి ఆయనకు తెలియకుండా అశోకుడికి పంపారు!

అశోకుడు అవంతీ ప్రాంతానికి రాజ ప్రతినిధిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరవాత విదీశను వివాహమాడాడు.

ఒకనాడు సుశేముడు తండ్రి దగ్గరికి వెళ్ళి, "అశోకుడు శాక్యనాయకుడి కుమార్తెను వివాహమాడాడట! వేగుల ద్వారా తెలిసింది!" అన్నాడు.

"ఏమిటీ! తండ్రికి తెలియకుండా తనయుడి వివాహమా? అదీ రాజకుమారుడు ఒక సాధారణ యువతిని వివాహమాడడమా!" అని రాజు ఎంతో బాధపడ్డాడు. "సాధారణ స్త్రీ కడుపున పుట్టిన వాడి బుద్ధి అలాగే ఉంటుంది. మరో విధంగా ఎలా ఉంటుంది?" అని విరక్తితో అనుకోసాగాడు. దానిని చూసి సుశేముడు ఎంతో సంతోషించాడు.

కొన్నాళ్ళు గడిచాయి. మళ్ళీ తక్షశిలలో తిరుగుబాటు బయలుదేరింది. బిందుసారుడు సుశేముణ్ణి పిలిచి, "ఉజ్జయినిలో వున్న అశోకుణ్ణి పిలిచించి, తక్షశిలకు పంపడం కష్టం. నువ్వు గాని, నీ సోదరులలో ఒకరుగాని వెళ్ళి తక్షశిల తిరుగుబాటును అణచిరండి," అన్నాడు.

సుశేముడికి తన సామర్థ్యం మీద నమ్మకం లేదు. వెళ్ళనంటే తన అసమర్థత బయట పడుతుంది. అందువల్ల, "తండ్రీ! తక్షశిలకు వెళ్ళి తిరుగుబాటును అణచడం నా బాధ్యతగా భావిస్తున్నాను. అయినా, అశోకుడు వెళ్ళి తిరుగుబాటును అణచినప్పుడు శత్రుశేషం లేకుండా నిర్మూలించి ఉన్నట్టయితే, ఇంతత్వరలో తిరుగుబాటు మళ్ళీ తలెత్తి ఉండేది కాదు!" అన్నాడు.

"ఇందులో గ్రీకులహస్తంఉందని భావిస్తున్నాను. నేను అస్వస్థగా ఉన్న విషయం వాళ్ళకు తెలుసు. తమ భారత భూభాగాన్ని మౌర్యులకు వదులుకున్నామన్న సంగతి వాళ్ళింకా మరిచిపోలేకుండా ఉన్నారు. అలజడి సృష్టించడానికి అదేకారణం," అన్నాడు బిందుసారుడు. - (ఇంకావుంది)



సామ్రాట్ అశోక

9

[అశోకుడు తండ్రి కోరిక ప్రకారం ఉజ్జయినికి బయలుదేరాడు. మార్గ మధ్యంలో విదిశాలోయలో విడిది చేశాడు. శాక్యనాయకుడి కుమార్తె విదీశతో పరిచయం ఏర్పడింది. అశోకుణ్ణి హత్యచేయడానికి సుశేముడు పంపిన ఇద్దరు నాట్యకత్తెలు – సమయానికి అటుకేసి విదీశ రావడంతో పట్టుబడ్డారు. అశోకుడు విదీశను వివాహమాడ కోరాడు. బౌద్ధ భిక్షువు ఉపగుప్తుడి అనుమతితో విదీశ, అశోకుణ్ణి వివాహమాడింది. —తరవాత]

క్షిప్రానదీ తీరంలో వెలసిన ఉజ్జయిని చాలా అందమైన నగరం. పాడిపంటలతో, వర్తక వ్యాపారాలతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారు. యువరాజు అశోకుడు రాజ ప్రతినిధి పదవిని చేపట్టిన తరవాత, ప్రజలకు ఎటువంటి కొరతా లేకుండా పరిపాలనా వ్యవహారాలునిర్వర్తించసాగాడు.

ఆయన భార్య విదీశాదేవి తన దయాగుణంతోఅందరిగౌరవమన్ననలకూ పాత్రమయింది. ఐదేళ్ళలో రాజదంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె జన్మించారు. కుమారుడికి మహేంద్రుడనీ, కుమార్తెకు సంఘమిత్ర అనీ నామకరణం చేసి, అల్లారుముద్దుగా పెంచసాగారు.

ఉజ్జయినీ ప్రాంత విశేషాలను తెలియచేయడానికి, యశుడు అశోకుడి ప్రత్యేక దూతగా రాజు బిందుసారుణ్ణి దర్శించడానికి రాజధాని పాటలీపుత్రానికి వెళ్ళాడు.

యశుణ్ణి చూడగానే రాజు ఆగ్రహంతో, "అశోకుడు ఎంతపని చేశాడు! నా అనుమతి పొందకుండా ఎవతెనో వివాహమాడడానికి అతడి కెంత ధైర్యం? తండ్రిని గౌరవించే తనయుడెవడైనా ఇటువంటి కృత్యంచేయ గలడా?" అని అడిగాడు.

"ప్రభువులు మన్నించాలి. యువరాజు అశోకుడు విదీశను వివాహమాడడానికి తమ అనుమతిని వేడుతూ ప్రత్యేక దూత ద్వారా ఒకలేఖను పంపాడు. ఆయనచేసిన మొట్టమొదటి పని అదే! అయినా ఆ లేఖ మీకు చేరకపోవడం ఆశ్చర్యంగా ఉన్నది. పైగా అనుమతిని తెలియజేస్తూ తమనుంచి ప్రత్యుత్తరం కూడా యువరాజు అశోకుడికి వచ్చింది. ఇందులో ఏదో తిర కాసు ఉన్నది!" అన్నాడు యశుడు వినయంగా.

రాజు బిందుసారుడు మౌనంగా తల పంకించాడు. యశుడు, యువరాజు అశో కుడి ప్రాణాలను విదీశ రెండుసార్లు ఎలా కాపాడిందో తెలియజేశాడు. ఆ తరవాత వారిరువురికీ కలిగిన పరిచయం, ఏర్పడిన అనురాగం గురించి చెప్పి, ప్రస్తుతం విదీశాదేవి యువరాజు అశోకుడికి ఎలా ఆదర్శపత్నిగా ఉంటున్నదో వివరించాడు.

రాజు అన్నిటినీఓర్పుగావిన్నాడు. భటు లను పిలిచి, యశుడు విడిదిచేయడానికి తగినఏర్పాట్లు చేయమని ఆజ్ఞాపించాడు.

ఆరోజు సాయంకాలం రాజు ప్రధాన మంత్రి ఖల్లాటకుణ్ణి పిలిపించాడు.

"మహామంత్రీ! నేను వ్యాధిగ్రస్తుణ్ణయి దాదాపు పదేళ్ళయింది.నేను ఎంతో కాలం

బతకననిపిస్తున్నది.అలాగని మరణిద్దా మన్నా భయంగానే ఉన్నది. నా సంకట పరిస్థితికికారణం ఏమిటోతెలుసా?" అని అడిగాడు రాజు.

"అంతమాత్రం గ్రహించలేకపోతే నేనిన్నాళ్ళు తమ సేవచేయడానికి అర్హుణ్ణి కాను, మహాప్రభూ!" అన్నాడు మంత్రి.

రాజు విచారంగా నవ్వి, "చంద్రగుప్త మౌర్యుడు స్థాపించిన సువిశాలసామ్రాజ్యం భవిష్యత్తును తలుచుకుంటే నాకు భయం కలుగుతున్నది. మరణ శయ్యపై వున్న రాజు పక్కన, కాబోయే రాజు ఉండడం అవసరం కదా. సుశీముణ్ణి తక్షశిల నుంచి పిలిపించు," అన్నాడు.

"చిత్తం ప్రభూ! అలాగే పిలిపిస్తాను. అయినా, తమరు మరింత కాలం జీవిం

TL-F3



చాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాము," అన్నాడు.

"సుశేముణ్ణి వెనక్కు పిలిపించడానికి కారణం ఏమిటో గ్రహించే ఉంటావు. దానితో నీకు అభిప్రాయభేదం లేదు కదా?" అని అడిగాడు రాజు.

ఆప్రశ్నకు మంత్రి వెంటనే సమాధానం చెప్పలేదు. కొంతసేపు మౌనం వహించి, "మహాప్రభూ! నా మనోగత అభిప్రాయం ఏమిటో తమకు తెలుసు. అయినాదానిని బహిర్గతం చేయడం నా బాధ్యత. దురదృష్టవశాత్తు, యువరాజు సుశేముడు తక్షశిలకు వెళ్ళడం వల్ల మనకు మేలుకన్నా కీడే ఎక్కువ జరిగింది. యువరాజు సుశేముడు తిరుగుబాటుదారులను నిర్మూలించడానికి బదులు, వాళ్ళ నాయకులకు లంచాలిచ్చి, పదవులిచ్చి లోబరచుకున్నాడు. వాళ్ళు సాధారణ ప్రజలను మరింత వేధిస్తున్నారు. ఎదురు తిరిగిన వాళ్ళను కారాగారాలకు పంపుతున్నారు, చంపుతున్నారు. యువరాజు ఆ దుండగులను ఆదరిస్తున్నాడు. ఆ విధంగా దుర్మార్గులైన మన శత్రువులు బలపడుతున్నారు. అమాయకులైన సాధారణ ప్రజలు నానాబాధలు అనుభవిస్తున్నారు. ఏక్షణంలో నైనా అక్కడ ప్రజల తిరుగుబాటు జరగవచ్చునని చారుల ద్వారా తెలియ వచ్చింది. మరొక విషయం ఏమంటే యువరాజు సదా సర్వవేళలా వినోదాలతో కాలక్షేపం చేస్తున్నాడు. పరిపాలనా యంత్రాంగం సర్వనాశనమైపోయింది?" అన్నాడు ఆవేశంగా.

"ఈ వార్తలు నాకూ అందాయి. కాని అవి అతిశయోక్తులయి ఉంటాయని భావించాను," అన్నాడు రాజు నిట్టూరుస్తూ.

"కాదు ప్రభూ! అవన్నీ పచ్చినిజాలు!" అన్నాడు మంత్రి.

"అంటే నా అనంతరం మగధ సింహాసనం అధిష్ఠించే అర్హత సుశేముడికిలేదనే కదా తమ అభిప్రాయం!" అన్నాడురాజు.

"అవును ప్రభూ! అవును. ముమ్మాటికీ అదే నా అభిప్రాయం," అన్నాడు మంత్రి.

"మరి సింహాసనాన్ని ఎవరికి అప్పగించమంటావు?" అని అడిగాడు రాజు.

"యువరాజు అశోకుడికి సింహాసనాన్ని అధిరోహించే అర్హతలన్నీ ఉన్నాయి. తిరుగుబాటును అణచడంలోనూ, విశాలప్రాంతాన్ని పరిపాలించడంలోనూ తన సామర్థ్యాన్నీ, దక్షతనూ ఆయన స్పష్టంగా నిరూపించుకున్నాడు!" అన్నాడు మంత్రి.

రాజు కొంతసేపు మౌనం వహించి, "ఖల్లాటకా! నేనీ విషయంలో నిర్ణయం తీసుకోలేకుండా ఉన్నాను," అన్నాడు.

"ప్రభూ! విశ్రాంతి తీసుకోండి. అవసర మైనప్పుడు సరైన నిర్ణయం తీసుకో వచ్చు!" అని చెప్పి మంత్రి రాజుకు నమస్కరించి అక్కడినుంచి బయలుదేరాడు.

ఒక గంటసేపట్లో మంత్రికి రాజభవనం నుంచి మళ్ళీ పిలుపు వచ్చింది. ఇప్పుడు పిలిపించింది రాజు కాదు; రాజుగారి పెద్ద భార్య. మంత్రి రాజమందిరానికి వెళ్ళేలోగా రాజుగారి శయ్యసమీపంలో రాజవైద్యులూ, రాజపురోహితుడూ, పెద్దరాణీ ఉన్నారు.

మంత్రిని చూడగానే మహారాణి, "రాజు గారు ఉన్నట్టుండి గుండె పట్టుకుని,స్పృహ తప్పి పడిపోయారు," అని కొంతసేపు ఆగి, "మహామంత్రీ! యువరాజు సుశేముణ్ణి వెంటనే పిలిపించాలి," అన్నది.

"చిత్తం, మహారాణీ!" అన్నాడు మంత్రి.

"ఇప్పుడే దూతలను పంపగలవా?" అని అడిగింది మహారాణి.

"ఒక్క గంటలో సిద్ధం చేస్తాను, మహా రాణీ! అన్నాడు మంత్రి.

"మంచిది. ఈలోగా నా కుమారుడికి నేనొక లేఖ రాస్తాను. భటులను దానిని తీసుకువెళ్ళమనిచెప్పు," అని అక్కడినుంచి హడావుడిగా లోపలికి వెళ్ళింది మహారాణి.

మంత్రి వైద్యుడి కేసి తిరిగి, "రాజుగారి పరిస్థితి ఇప్పుడెలా ఉన్నది?" అని అడి గాడు ఆతృతగా. "మహారాజు రేపు సూర్యో దయం చూడ గలిగితే గొప్ప అద్భుతం జరిగినట్టే!" అన్నాడు రాజవైద్యుడు.



"ఎలాగైనా రాజుగారి ప్రాణాలు నిల బెట్టడానికి ప్రయత్నించండి. నా సహాయం ఏదైనా అవసరమైతే కబురు చేయండి, వస్తాను," అంటూ అక్కడి నుంచి బయలు దేరాడు మంత్రి.

అక్కడే వున్న రాజపురోహితుడు కూడా మంత్రి వెంట నడిచాడు. మంత్రి ద్వారం వద్ద నిలబడిన భటుణ్ణి పిలిచి, "మేము రహస్యాలోచనా మందిరంలో ఉంటాము. సేనాధిపతిని అక్కడికి రమ్మను," అని ఆజ్ఞాపించి వేగంగా ముందుకు నడి చాడు.

* * *

యశుడు సుభద్రాదేవి భవనంలో ప్రవేశించి ఆమెకు చేతులు జోడించి, "తల్లీ! యువరాజు అశోకుడు ఉజ్జయినీ నగరం

నుంచి పంపగావచ్చాను.నాపేరుయశుడు," అన్నాడు వినయంగా.

"అలాగా నాయనా! నా బిడ్డ అశోకుణ్ణి చూసి ఎన్నేళ్ళయింది? నా బిడ్డ క్షేమంగా ఉన్నాడా?" అని అడిగింది సుభద్ర.

"యువరాజు క్షేమంగా ఉన్నాడు తల్లీ! అంతేకాదు; దేవత వంటి విదీశాదేవిని వివాహమాడాడు. వాళ్ళకు బంగారంలాంటి ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. వాళ్ళను చూస్తే తమరు పొంగిపోగలరు," అన్నాడు యశుడు సంతోషంగా.

"నాకూ ఉజ్జయినికి రావాలనే ఉన్నది నాయనా! కాని మహారాజుకు ఆరోగ్యం బాగాలేదు. ఈ స్థితిలో బయలుదేరలేను కదా!" అంటూ సుభద్రాదేవి ఆగింది. ఆమెను రమ్మన్నట్టు పరిచారిక సైగ చేయడంతో, లోపలికి వెళ్ళి వెంటనే ఆందోళనతో తిరిగి వచ్చి "రాజుగారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందట. ఈ రాత్రి గడవడమే కష్టం అంటున్నారు," అన్నది గద్గదస్వరంతో.

"అలాగా!" అంటూ అక్కడి నుంచి బయలుదేరబోయాడు యశుడు.

"నాయనా! రాజుగారు ఉన్నంతవరకు ఫరవాలేదు. ఒకవేళ జరగకూడనిది జరిగి పోతే మాత్రం నాకీ భవనం నరకమే అవుతుంది. యువరాజు సుశేముడి పట్ల నేనెంత మాతృ ప్రేమ కనబరచినా అతడు నన్ను ద్వేషిస్తూనే ఉన్నాడు. అతని తల్లి పట్టపురాణి నన్ను కళ్ళతో చూడలేకపోతు న్నది. నాయనా, నువ్వు ఇక్కడే కొన్నా ళ్ళుండాలి. జరగకూడనిది జరిగితే నేను నీతో ఉజ్జయినికి వస్తాను," అన్నది సుభద్రారాణి సజలనయనాలతో.

"తల్లీ నువ్వేమీ భయపడనవసరంలేదు. మిగిలిన రాణులందరూ నిన్నుచూసి భయ పడి, రాజమాతవని గౌరవించే రోజులు అట్టే దూరంలో లేవు!" అన్నాడు యశుడు.

సుభద్రాదేవిఏమీమాట్లాడలేకపోయింది. దిగ్భ్రాంతితో చూస్తూ ఉండిపోయింది.

"ఓర్పు వహించు తల్లీ! ఉత్తముడైన తమ తనయుడికోసం నా సేవలు అందిం చవలసిన తరుణం ఆసన్నమయింది. ఈ సామ్రాజ్యం భవిష్యత్తు మరికొన్ని రోజుల లోనే నిర్ణయమవుతుంది. నేను నిన్ను మాటిమాటికీ దర్శించలేను. రాజభవ నంలో జరిగే విషయాలను విశ్వాసపా త్రులైన పరిచారికలద్వారా అప్పటికప్పుడు

నాకు తెలియచేశారంటే చాలు. మిగతా విషయాలు నేను చూసుకుంటాను. నన్ను ఆశీర్వదించుతల్లీ," అంటూ యశుడు సుభద్రాదేవి పాదాలకు నమస్కరించి అక్కడి నుంచి బయలుదేరాడు.

* * *

రహస్యాలోచనా మందిరంలో మంత్రిని చూడవచ్చిన సేనాధిపతి, "మహామంత్రీ! సుశేముడు రాజ్యసింహాసనాన్ని అధిష్ఠించడం నాకు వ్యక్తిగతంగా సమ్మతంకాదు. కాని సేనాధిపతిగా, సింహాసనానికి పోటీ అన్నప్పుడు రాజుగారి జ్యేష్ఠకుమారుడికి పట్టం కట్టడం నాబాధ్యతగా భావిస్తున్నాను," అన్నాడు.

"మీ రాజభక్తికీ, కర్తవ్య నిర్వహరణలో మీరు చూపుతూన్న శ్రద్ధకూ జోహార్లు!" అన్నాడు మంత్రి.

"కృతజ్ఞతలు మిత్రమా!" అన్నాడు సేనాధిపతి.

"అయితే, ఇక్కడ ఒకవిషయం గుర్తుంచుకోవాలి. మగధ సింహాసనానికి సంబంధించినంతవరకు రాజపురోహితుడిదే నిర్ణాయకపాత్ర. మౌర్యసామ్రాజ్య స్థాపనకు మూలకారకుడైన చాణక్యుడు మొదట రాజపురోహితుడు; ఆ తరవాతే మంత్రిఅన్న విషయం మనం మరిచి పోకూడదు," అన్నాడు మంత్రి.

"అంటేమీఉద్దేశం?"అన్నాడుసేనాధిపతి.

మంత్రి, పక్కనే కూర్చున్న రాజపురోహితుడికేసి చూశాడు.

"నేను రాజుగారికుమారులందరి జాతకాలనూ పరిశీలించాను. అశోకుడికి ఒక్కడికే చక్రవర్తి అయ్యే అర్హతలున్నాయి. సుశేముడు సామ్రాజ్య విచ్ఛిత్తికి కారకుడవుతాడు!" అన్నాడు రాజపురోహితుడు.



"అలాగా! అయితే, తమఇష్టానుసారమే కానివ్వండి," అన్నాడు సేనాధిపతి.

"చాలా సంతోషం! అశోకుడంటే నాకు అభిమానంలేదు. కాని సామ్రాజ్య పరిరక్షణకుఇలాచేయకతప్పదు!"అన్నాడుమంత్రి.

"నిజమే! ఆ విషయం నాకూ తెలుసు. అయినా, సేనాధిపతిగా ఇక్కడి విషయం తెలియజేస్తూ తక్షశిలకూ, ఉజ్జయినికీ దూతలను పంపడం నా కర్తవ్యం. వారిరువురిలో ఎవరుముందుగా ఇక్కడికివస్తారన్న దాన్నిబట్టి మిగిలినవిషయాలు ఆధారపడి ఉంటాయి!" అన్నాడు సేనాధిపతి.

* * *

మసక చీకటి ఆవరించిన గదిలో యశుడు, "ఇక్కడికి ముందుగా ఎవరు వస్తారన్న దాన్ని బట్టి మిగిలిన విషయాలు ఆధారపడి ఉంటాయి!" అన్నాడు ఇద్దరు నాట్యకత్తెలతో.

ఐదేళ్ళ క్రితం అశోకుణ్ణి హతమార్చడానికి వెళ్ళిన నాట్యకత్తెలే వాళ్ళు. అశోకుడు ప్రాణభిక్ష పెట్టడం వల్ల వాళ్ళు ఇన్నాళ్ళు విదిశాదేవికి పరిచారికలుగా ఉండి ఇప్పుడే పాటలీపుత్రానికి వచ్చారు.

"మేమేం చేయాలో చెప్పండి?" అని అడిగారు నాట్యకత్తెలు.

"యువరాజు అశోకుడు మీకు ప్రాణభిక్ష పెట్టాడు కదా. దానికిప్పుడు ప్రత్యుపకారం చేయాలి!" అన్నాడు యశుడు.

"ఇప్పుడు మేము చేయవలసనదేదో సూటిగా చెప్పండి," అన్నది ఒక నాట్యకత్తె.

"మీరు సుశేముడి ప్రయాణాన్ని జాప్యం చేసి, అతడు ఆలస్యంగా ఇక్కడికి చేరేలా చూడాలి. మీకు గుర్రపుస్వారీ వచ్చుకదా? మీకోసం రెండు ఉత్తమ అశ్వాలనూ, మరిద్దరు రక్షకులనూ సిద్ధంగా ఉంచాను. వాళ్ళకు తక్షశిలకు దగ్గరి అడ్డుదారి తెలుసు. మీరు ఆ మార్గంగుండా వెళ్ళి, రాజదూతలకు ముందే తక్షశిల చేరుకోవాలి. దూతలు రేపు ఉదయమే బయలుదేరనున్నారు. మీరు ఈ రాత్రే బయలుదేరాలి," అన్నాడు యశుడు.

"ఈ రాత్రేనా! బయట సన్నగా వానకురుస్తున్నది," అన్నది ఒక నాట్యకత్తె.

"యువరాజు అశోకుడు చక్రవర్తి అయినట్టయితే, మీ జీవితమంతా బంగారు వాన కురుస్తుంది!" అన్నాడు యశుడు నవ్వుతూ.

"మేము సుశేముణ్ణి మోసగించామని విదిశాదేవికి తెలిస్తే ఆమె హర్షించదు. అయినా మేము అశోకుడి ఋణం తీర్చుకోవాలి!" అన్నారు నాట్యకత్తెలు.

"అంతేకాదు. ఇన్నాళ్ళు సన్యాసినుల్లా జీవించారు. ఇప్పుడు మీ సహజ సామర్థ్యం ప్రదర్శించడానికి అవకాశం లభించింది కదా!" అన్నాడు యశుడు చిన్నగా నవ్వుతూ.

"అది మా గత నైజం. ఇప్పుడు మారిపోయాం. అయినా మా గతశక్తి సామర్థ్యాలు ఏ స్థితిలో ఉన్నాయో పరీక్షిద్దాం," అన్నారు నాట్యకత్తెలు నవ్వుతూ. – (ఇంకావుంది)



సామ్రాట్ అశోక

10

[తండ్రి ఆనతి ప్రకారం అశోకుడు ఉజ్జయినిలో రాజప్రతినిధి పదవిని చేపట్టి, ప్రజారంజకంగా పరిపాలన సాగించసాగాడు. మగధరాజధాని పాటలీపుత్రంలో వృద్ధుడైన రాజు బిందుసారుడి ఆరోగ్యం ఆందోళనకరంగా పరిణమించడంతో – తక్షశిలలో ఉన్న సుశేముణ్ణీ, ఉజ్జయినిలో ఉన్న అశోకుణ్ణీ పాటలీపుత్రానికి రప్పించాలని ప్రధాన మంత్రీ, సేనాధిపతీ రాజపురోహితుడూ నిర్ణయించారు. సుశేముడి ప్రయాణాన్ని జాప్యం చేయించడానికి, అశోకుడి మిత్రుడైన యశుడు ఇద్దరు నాట్యకత్తెలను తక్షశిలకు పంపాడు.–తరవాత]

అశోకుడు అడవికి వేటకు వెళ్ళి, సాయంకాలానికిరాజభవనానికితిరిగివచ్చి, "విదీశా! అడవిలో చాలాజంతువులనువేటాడి బాగా అలిసిపోయాను," అన్నాడు భార్యతో.

"తమరిప్పుడు శారీరకంగా మాత్రమే అలిసిపోయారు. జంతువులనూ, పక్షులనూ వేటాడాలంటే, మానసికంగా కూడా అలిసిపోయే మంచిరోజుకోసం నేను ఎదురుచూస్తున్నాను, ప్రభూ!" అన్నది విదీశాదేవి.

"అదేమిటి దేవీ, అలా అంటున్నావు? రాజ్యవ్యవహారాలలో సతమతమయ్యే నా మనసుకు కాస్త ఆహ్లాదం కలిగించే వినోదం ఈ వేట ఒక్కటే కదా! అయినా నేను జంతువుల మాంసం తినడానికి వాటిని వేటాడటం లేదు కదా?" అన్నాడు అశోకుడు.

"అంటే తమరు జంతువులను కేవలం చంపడంలో ఆనందం అనుభవిస్తున్నా

రన్న మాట! అది మరీ ఘోరం ప్రభూ!" అన్నది విదీశాదేవి బాధగా.

"ఈ రోజు నేనొక పెద్దపులినీ, చిరుత పులినీ చంపాను. ఆ దుష్టమృగాలను చంపడం ద్వారా వాటికి ఆహారంకానున్న జింకలు, కుందేళ్ళు వంటి అనేక సాధు జంతువుల ప్రాణాలను రక్షించినట్టే కదా?" అని అడిగాడు అశోకుడు.

"ప్రభూ! పులులూ, సింహాలూ వినోదం కోసం జంతువులను చంపడం లేదు. తమ ఆకలి తీర్చుకోవడానికి మాత్రమే వాటిని చంపుతున్నాయి. అయినా, జంతువులకు మంచి చెడ్డలు, ధర్మాధర్మాలు తెలియవు కదా! కాని మనుషులకు తెలును. క్రూర జంతువులకు సాధుజంతువులను చంపి తినడం సహజగుణం. పైగా అవి మరొక విధంగా బతకలేవు. కాని వివేకవంతులైన మనుషుల విషయం వేరు కదా!" అన్నది విదీశాదేవి ప్రశాంతంగా.

అశోకుడుభార్యమాటలకుమందహాసం చేశాడు. కాని ఏమీ మాట్లాడలేదు. అంతలో ఒకపరిచారిక లోపలికివచ్చి, అశోకుడికి నమస్కరించి, "వారణాశినుంచి వచ్చిన ఒక జ్యోతిష్కుడు తమదర్శనం కోసం ప్రవేశమంటపంలో వేచి ఉన్నాడు," అన్నది.

"జ్యోతిష్కుడా!" అన్నది విదీశాదేవి.

"అవును దేవీ, నీకా విషయం చెప్పడం మరిచాను. అతడు భవిష్యత్తును చెప్పడమే కాదు; దానిని సాధించే సులభమార్గంకూడా సూచిస్తాడట. అతడు ఇక్కడి మహాకాల ఆలయదర్శనానికి వచ్చినట్టు ప్రముఖవర్తకుడులలితదత్తుడుచెప్పాడు. నేనే రమ్మన్నాను," అంటూ అక్కడినుంచి లేచి వెలుపలికి నడిచాడు అశోకుడు.

జ్యోతిష్కుడూ, లలితదత్తుడూ అశోకుణ్ణి చూడగానే లేచి నిలబడ్డారు. జ్యోతిష్కుడు ఒంటినిండా కాషాయాంబరాలు ధరించి, నొసట పెద్ద కుంకుమబొట్టు పెట్టుకుని, మెడలో రుద్రాక్షమాల వేసుకుని ఉన్నాడు.

అశోకుడు కూర్చున్న తరవాత, జ్యోతిష్కుడు ఏదో మంత్రం పఠించి, ఆయన కుడిచేతినిపుచ్చుకుని హస్తరేఖలను పరిశీలించాడు. ఆ తరవాత కళ్ళు మూసుకుని, కొంతసేపటికి తెరిచి, "శుభ ఘడియలు ఆసన్నమయ్యాయి!" అన్నాడు నవ్వుతూ.

"దేనికి?" అన్నాడు అశోకుడు.

"తమరు స్వతంత్రం ప్రకటించుకోవడానికి!" అన్నాడు జ్యోతిష్కుడు.

"ఎవరినుంచి?" అని అడిగాడు అశోకుడు ఆశ్చర్యంగా.

"తమరు అవంతీ ప్రాంతానికి రాజయ్యే శుభఘడియలు సమీపించాయి. అవంతిని స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకునిరాజుగా పట్టాభిషిక్తులు కావచ్చు!" అన్నాడు జ్యోతిష్కుడు.

"అది మగధ సామ్రాజ్యాధినేత అయిన మా తండ్రికి వ్యతిరేకంగా చేసే తిరుగుబాటు అవుతుంది కదా?" అన్నాడు అశోకుడు.

"నిజమే. అయితే, తమరు మహారాజు కావడానికి అదొక్కటేమార్గం! కాబట్టి దానిని అనుసరించడంలో తప్పులేదు. పాటలీ పుత్రంలో మహారాజుగారి ఆరోగ్యం ఆందోళనకరంగా పరిణమించింది. యువరాజు సుశేముణ్ణి రాజును చేయాలని నిర్ణయించారు!" అన్నాడు జ్యోతిష్కుడు.

"మా తండ్రి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందా?" అన్నాడు అశోకుడు విచారంగా.

"అవును. అయినా తమరు పాటలీ పుత్రానికి వెళ్ళడానికి లేదు. వెళితే, మీ ప్రాణానికే ఆపద వాటిల్లుతుంది! కనీసం ఇంకొక్క సంవత్సరంపాటు ఉజ్జయినిని వదిలివెళ్ళడం క్షేమం కాదు," అన్నాడు జ్యోతిష్కుడు.

అంతలో పక్కనుంచి ఏదోశబ్దం రావడంతో అశోకుడు అటుకేసి తిరిగి చూశాడు. కిటికీ నుంచి ఎవరో తొంగి చూస్తున్నారు. కోపంతో అశోకుడి కనుబొమలు ముడి పడ్డాయి. మరుక్షణంలో అక్కడినుంచి వచ్చిన యశుణ్ణి చూడగానే అశోకుడు నవ్వుతూ, "రా, మిత్రమా రా! కిటికీ

నుంచి తొంగి చూసే సాహసం చేసిందెవరా? అని ఆశ్చర్యపోయాను," అన్నాడు.

"ఇక మేము సెలవుతీసుకుంటాము!" అన్నాడు లలితదత్తుడు అశోకుడితో.

"ఒక్క అడుగు ముందుకు వేయడానికి సాధ్యపడదు!" అన్నాడు యశుడు తన ఒరలోని కత్తిమీద చేయివేస్తూ.

"యువరాజుగారి సమక్షంలోనే వారి అతిథికి జరిగే మర్యాద ఇదా?" అన్నాడు జ్యోతిష్కుడు బాధగా.

"శత్రు గూఢచారులను ఇంతకన్నా-ఘనంగానే సత్కరించాలి!" అంటూ యశుడు జ్యోతిష్కుడి చేయిని వడిసి పట్టుకుని, "శిఖరసేనా! నువ్వు నన్నెరుగవు. కాని నిన్నునేనుబాగా ఎరుగుదును. పాటలీ పుత్రంలో నువ్వు సుశేముడి తమ్ముళతో

కలిసి తిరగడం నేను చూశాను. మగధ సామ్రాజ్యానికి అశోకుణ్ణి మహారాజును చేయకూడదని భావించే వాళ్ళలో నువ్వు ఒకడివి. ప్రాణాలపై ఆశవున్నట్టయితే ఏ పథకంతో ఇక్కడికి వచ్చావో మర్యాదగా చెప్పు!" అని గద్దించాడు.

జ్యోతిష్కుడి ముఖం వెలవెలబోయింది. లలితదత్తుడు భయంతో వణకసాగాడు.

యశుడు, "ఎవరక్కడ?" అని చేతులు చరచగానే ఇద్దరుభటులువచ్చినిలబడ్డారు.

"ఈ దుర్మార్గులను కాళ్ళు చేతులు బంధించి కారాగారంలో వేయడానికి తమ అనుమతిని ప్రార్థిస్తున్నాను," అన్నాడు యశుడు అశోకుడితో.

అశోకుడు అంగీకార సూచకంగా తల పంకించాడు.

భటులు వాళ్ళిద్దరినీ అవతలికి లాక్కుపోయారు.

"తమరిని పాటలీపుత్రం వెళ్ళకుండా చేయాలన్నదే ఆ దుర్మార్గులపథకం!తమ సవతి సోదరులలో తమకు మద్దతునిచ్చే వారు ఒక్కరూ లేరు. అందరూ అసూయాగ్రస్తులే. రాజుగారి మరణానంతరం తమరిని సింహాసనం అధిష్ఠించకుండా చేయాలని పథకాలు ఆలోచిస్తున్నారు. రాజుగారి ఆరోగ్యం క్షీణించింది. ఈ శిఖరసేనుడు తక్షశిలకు చెందిన వాడు. యువరాజు సుశీముడి ప్రతినిధిగా పాటలీపుత్రంలో పరిస్థితులను పరిశీలిస్తున్నాడు. ఈ అవంతి ప్రాంతానికి మాత్రం రాజు కావాలనేఆశను తమలో కలిగించినట్టయితే, తమ దృష్టి మగధ సింహాసనం మీద పడదని ఆ మూర్ఖులు కలలుకంటున్నారు!" అన్నాడు యశుడు ఆవేశంగా.

ఆ తరవాత అతడు, తాను పాటలీపుత్రానికి వెళ్ళి అశోకుడి తల్లిదండ్రులను దర్శించి మాట్లాడిన విషయం గురించీ, రాజుగారి అనారోగ్యం కారణంగా రాజధాని రాజకీయాలలో ఏర్పడిన పరిణామాలను గురించీ అశోకుడికి వివరంగా తెలియ జేశాడు.

"మిత్రమా! తమరు వెంటనే పాటలీపుత్రానికి బయలుదేరాలి. ప్రధానమంత్రీ, సేనాధిపతీ, రాజపురోహితుడూ మగధ ప్రజలక్షేమాన్ని కాంక్షించి, తమరిని రాజును చేయాలనే ఉద్దేశంతోనే ఉన్నారు. స్వార్థపరులైన రాజోద్యోగులు కొందరు తమ స్వలాభం కోసం సుశీముణ్ణి రాజును

చేయాలని ఉబలాట పడుతున్నారు. అయినా, పాటలీపుత్రానికి మొదట చేరు కునే వారికే మహారాజుగా పట్టాభిషిక్తుడయ్యే అవకాశం ఎక్కువ!" అన్నాడు యశుడు.

అశోకుడు ఏమీ మాట్లాడలేదు. గంభీర వదనంతో కూర్చున్నాడు. ఆయన మన సులో ఏవేవో ఆలోచనలు రాసాగాయి.

కొంతసేపటికి అక్కడికి వచ్చిన విదీశా దేవి,యశుణ్ణిచూసి,"నమస్కారం,అన్నయ్యా! నువ్వు పాటలీపుత్రం నుంచి తిరిగి వచ్చిన విషయం తెలియనేలేదే!" అన్నది చిన్నగా నవ్వుతూ.

"ఇప్పుడే వస్తున్నాను, చెల్లెమ్మా!" అన్నాడు యశుడు.

విదీశాదేవి అశోకుడికేసి తిరిగి, "పాటలీ పుత్రం నుంచి ఇద్దరు దూతలు వచ్చారు. ప్రభూ, తమ దర్శనంకోసం వేచి ఉన్నారు," అన్నది.

అశోకుడు ఏమీ మాట్లాడలేదు. కాని యశుడు వెంటనే, "చాలా సంతోషం! ఆ దూతలు తెచ్చిన సందేశం ఏమిటో నాకు తెలుసు. యువరాజు అశోకుడు వెంటనే పాటలీపుత్రానికి బయలుదేరాలి. తక్షశిల లోని సుశేముడికి కూడా అటువంటి సందేశమే పంపి ఉంటారు!" అన్నాడు.

"యువరాజు వెంటనే బయలుదే రాలా?" అని అడిగింది విదీశాదేవి.

"వెళ్ళి తీరాలి!" అన్నాడు యశుడు.

"కారణం?" అని అడిగింది విదీశాదేవి.

"తండ్రి మరణశయ్యపై ఉన్నప్పుడు పక్కనే ఉండడం తనయుడి నైతికధర్మం! రాజకీయంగా ఆలోచిస్తే సుశేముణ్ణి రాజ్యా

ధికారం చేపట్టకుండా చేయడానికి యువ రాజు రాజధానిలో ఉండడం చాలాఅవ సరం!" అన్నాడు యశుడు.

"అగ్రసోదరుడికి రాజ్యాధికారం దక్క నీయకుండా చేయడంఅన్యాయంకాదా?" అని అడిగింది విదీశాదేవి నెమ్మదిగా.

"ఒక తమ్ముడిగా అలా చేయడం అన్యాయమే. అయితే, సుశేముడు రాజ్యాధికారం చేపడితే అది మగధ సామ్రాజ్యంలోని అశేష ప్రజానీకానికి అన్యాయం చేసినట్టవుతుంది. అది అంత కన్నా అన్యాయం!" అన్నాడు యశుడు.

ఆ సమాధానానికి విదీశాదేవి మౌనం వహించింది.

యశుడు అశోకుడితో, "మిత్రమా! ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకూ

డదు! మన సైన్యంలో సగం ఇక్కడేఉం టుంది. మిగతా సగం మీవెంట వస్తుంది!" అన్నాడు దృఢమైన కంఠస్వరంతో.

* * *

అర్ధరాత్రి వేళ ఒక విశాలమైన గదిలో పట్టు పరుపు మీద కూర్చుని, మద్యం సేవిస్తూ, గ్రీకుసుందరి నాట్యాన్ని చూస్తూన్న సుశేముడు హఠాత్తుగా అక్కడికి వచ్చిన ఇద్దరు నాట్యకత్తెలను చూడగానే, "మీరెలా ఇక్కడికి వచ్చారు?" అన్నాడు ఆశ్చర్యంగా.

"తమరిచ్చిన రాజముద్రిక సాయంతోనే వచ్చాము ప్రభూ!" అన్నారు నాట్యకత్తెలు గలగలా నవ్వుతూ.

"వెళ్ళిన పని పూర్తిచేయక పోగా, మూర్ఖు ల్లాగా పట్టుబడిపోయి, అశోకుడి భార్యకు పరిచారికలుగా చేరిపోయారని గూఢ చారులద్వారావిన్నాను. అది నిజమే కదా?" అన్నాడు సుశేముడు.

"అక్షరాలా నిజం ప్రభూ! అయితే, తమరు ఆదేశించిన పనిని ఎలాగైనా ముగించుకుని రావాలన్న పట్టుదలతోనే ఇన్నాళ్ళూ అక్కడ గడిపాము," అన్నారు నాట్యకత్తెలు.

"అంటే?" అని కనుబొమలు ఎగుర వేశాడు సుశేముడు.

నాట్యకత్తెలు గ్రీకు సుందరికేసి చూశారు.

సుశేముడు చేయి ఊపడంతో గ్రీకు సుందరి అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

"ఇప్పుడు చెప్పండి. ఆ నీచుణ్ణి మీరు హతమార్చారా?" అని అడిగాడు సుశే ముడు.

"తమరు మాకిస్తామన్న బహుమతి గురించి మరిచిపోలేదు కదా? మొదట ఆవిషయంచెప్పండి!" అన్నారు నాట్య కత్తెలు.

"అదేలా మరిచిపోగలను? మగధ సింహాసనం అధిష్ఠించగానే మీ కిస్తానన్న బహుమతిని రెండింతలు చేస్తాను! ఆ పరిచారికాపుత్రుణ్ణి ఎలా హతమార్చారో ఇప్పుడు చెప్పండి," అన్నాడు సుశేముడు పట్టరాని ఉత్సాహంతో.

"ఒక్కసారిగా హతమార్చడంకన్నా, గొప్పపని చేశాం. ఆహారంలో ఒకరకమైన విషం కలిపాం. దానిని భుజించడంతో అశోకుడు పక్షవాతంపాలై పడకనుంచి కదలలేకుండా పడి ఉన్నాడు?" అన్నారు నాట్యకత్తెలు.

"విషం కాస్త ఎక్కువ కలిపి, వాడి పీడ సాంతం విరగడ చేయలేకపోయారా?" అన్నాడు సుశేముడు కాస్త నిరుత్సాహంతో.

"ఆ పని చేసివుంటే మేము పట్టుబడి ఉండేవాళ్ళం. ఇప్పుడు మమ్మల్ని ఎవరూ అనుమానించలేదు. వెళ్ళిన పనీ జయప్రద మయింది. లేచి పడకమీద కూర్చోలేని వాడు సింహాసనం అధిష్ఠించగలడా?" అన్నారు నాట్యకత్తెలు.

"ఆహా! చాలా తెలివైన పనిచేశారు?" అంటూ సుశేముడు పట్టరాని సంతోషంతో మెడలోని రత్నాలహారం తీసి నాట్యకత్తెల కిచ్చాడు.

అంతలో ఎవరో తలుపు తట్టిన చప్పు డయింది.

"రావచ్చు!" అన్నాడు సుశేముడు.

సుశేముడి ప్రధాన అంగరక్షకుడు లోపలికి వచ్చి, "ప్రభూ! పాటలీపుత్రం నుంచి ఇద్దరు దూతలు వచ్చారు. వెంటనే తమరిని చూడాలంటున్నారు," అన్నాడు.

"రమ్మను," అన్నాడు సుశేముడు.

దూతలు వచ్చి సుశేముడికి నమస్క రించి, రెండు లేఖలు అందించారు. మొదటి లేఖ ప్రధానమంత్రీ, సేనాధిపతీ పంపినది. రాజు ఆరోగ్యం ఆందోళనక రంగా ఉందనీ వెంటనే రాజధానికి బయలుదేరి రమ్మనీ ఆ లేఖలో ఉన్నది. రెండవలేఖ ఆయన తల్లిగారు పంపినది. 'అశోకుడు నీ కన్నా ముందు రాజధానికి చేరి సింహాసనానికి పోటీపడే అవకాశం ఉంది. కాబట్టి తక్షణమే రాజధానికి బయలుదేరి రావాలి! ఆలస్యంచేయవద్దు.' అన్నది ఆ లేఖలోని సారాంశం!

రెండు లేఖలూ చదివిన సుశేముడు వాటి సందేశాలను తేలిగ్గా తీసుకుని, "అశోకుడికి మీరు పట్టించిన దుర్గతి గురించి అమాయకురాలైన మా తల్లికి తెలియదు పాపం! అనవసరంగా భయ పడుతున్నది!" అని బిగ్గరగా నవ్వి, "నేనేం త్వరపడనవసరం లేదు. రేపు నన్ను చూడడానికి ఒక గ్రీకు వర్తకుడు వస్తు న్నాడు. అతని సరుకులు తక్షశిలలో అమ్ముకోవడానికి అనుమతించాను. దానికి ప్రత్యుపకారంగా ఆమిత్రుడు నాకొక పెద్ద మణిని బహూకరించనున్నాడు!" అన్నాడు. —(ఇంకావుంది)



సామ్రాట్ అశోక

11

[పాటలీపుత్రంలో రాజు బిందుసారుడి ఆరోగ్యం ఆందోళనకరంగా పరిణమించింది. తక్షశిలలో వున్న సుశేముణ్ణి, ఉజ్జయినిలోవున్న అశోకుణ్ణీ వెంటనే బయలుదేరి రమ్మని ప్రధానమంత్రి దూతలనుపంపాడు. సుశేముడి ప్రయాణాన్ని ఆలస్యంచేయించడానికి అశోకుడి మిత్రుడు యశుడు ఇద్దరు నాట్యకత్తెలను తక్షశిలకు పంపాడు. యశుడు ఉజ్జయినికి తిరిగి వచ్చి, జ్యోతిష్కుడిలా అక్కడికివచ్చిన సుశేముడి మిత్రుడి కుట్రనుబట్టబయలు చేశాడు. పాటలీపుత్రం నుంచి కబురు అందగానే, కొంతసైన్యంతో బయలుదేరాలని యశుడు అశోకుణ్ణి ఒప్పించాడు. —[తరవాత]

అశోకుడు పాటలీపుత్రానికి బయలుదేరడానికి సిద్ధమవుతూ, ఆ విషయం తెలియజేయడానికి దళనాయకులను పిలిపించాడు. దళనాయకులను ఉద్దేశించి యశుడు ఇలా అన్నాడు:

"మిత్రులారా! మనమందరం మన కర్తవ్యాలను నిర్వర్తించవలసిన సమయం సమీపించింది. అది మగధ సామ్రాజ్య భవిష్యత్తునే నిర్ణయిస్తుంది.చంద్రగుప్త మౌర్యుడు స్థాపించిన సామ్రాజ్యం మన కళ్ళెదుటే విచ్ఛిన్నం కావడం చూస్తూ, చేతులుకట్టుకుని కూర్చోవడమా? లేక దక్షతతో ముందుకు ఉరికి దానిని పరిరక్షించడమా? అన్నదే మనం ఇప్పుడు నిర్ణయించుకోవాలి!"

"సామ్రాజ్య రక్షణకు మనం పోరాడాలి. మాకు మన యువరాజు పట్ల, ఆయనకు ఆప్తమిత్రుడైన మీ పట్ల అచంచలమైన



విశ్వాసం ఉన్నది. అది సరే; ఇప్పుడు మగధ సామ్రాజ్యానికి ముంచుకు వచ్చిన ఆపద ఏమిటి? దాని శత్రువు లెవరు?" అన్నాడు అవంతీ సర్వసేనాధ్యక్షుడు.

"మిత్రులారా! మీరు రాజ్యానికి వెలుపలవున్న శత్రువులతో అనేకసార్లు పోరాడి ఉండవచ్చు. ఇప్పుడు మనం రాజకుటుంబంలోనే ఏర్పడిన అంతశ్శత్రువులతోనూ, వాళ్ళతో చేతులు కలిపిన స్వార్థపరులతోనూ పోరాడాలి. వీళ్ళు బాహ్యశత్రువులకన్నా భయంకరులు. బాహ్యశత్రువులతో పోరాడడానికి ధైర్యం వుంటే చాలు. అంతశ్శత్రువులను అదుపు చేసి అంతమొందించడానికి ధైర్యంతో పాటు అచంచలమైన విశ్వాసం, చిత్తశుద్ధి కావాలి! లక్ష్యం ఉన్నతంగా ఉన్నప్పుడు హృదయాలలో అచంచలమైన విశ్వాసం ఏర్పడుతుంది. సరే, మహారాజు తరవాత మగధ సింహాసనాన్ని ఎవరు అధిరోహించగలరని మీరు భావిస్తున్నారు?" అని అడిగాడు యశుడు.

కొంతసేపు మౌనం తరవాత సేనాధ్యక్షుడు, "యువరాజు సుశేముడికి రాజ్యాభిషేకం చేయాలని మహారాజుగారు నిర్ణయించినట్టు కొందరు మిత్రుల ద్వారా విన్నాను. అయితే అలా జరగకూడదని నేను ఆశిస్తున్నాను," అన్నాడు.

"ఎందుకలా ఆశిస్తున్నావు?" అని అడిగాడు యశుడు.

"యువరాజు సుశేముడు దుర్మార్గుడే కాదు; పరమ మూర్ఖుడుకూడా. ఒకప్పుడు నేనాయనకు ఒక చురుకైన సైనికుణ్ణి అంగరక్షకుడిగా పంపాను. వాడు దాపుల నిలబడి వుండగా – ఏదో ఎగురుతూన్న పక్షి తన తలపాగా మీద రెట్టవేసిందని, సుశేముడు ఆ అంగరక్షకుడికి మరణశిక్ష విధించాడు. అటువంటి దుందుడుకు స్వభావంగల మూర్ఖుడు రాజైతే, ప్రజల పరిస్థితిని ఊహించలేకుండా ఉన్నాను," అన్నాడు సేనాధ్యక్షుడు బాధగా.

"అలాంటప్పుడు అతన్ని రాజ్యాధికారానికి రానీయకుండా మన ప్రయత్నం మనం చేయాలి కదా! మరొక్క విషయం. యువరాజు అశోకుడు మగధ సింహాసనం అధిష్ఠించడానికి అర్హుడా? కాదా?" అని అడిగాడు యశుడు.

"అన్నివిధాలాఅర్హుడు! అశోకుడే మగధ మహారాజుకావాలి!"అన్నాడు సేనాధ్యక్షుడు.

అతని అభిప్రాయాన్ని మిగిలిన దళనాయకులు ఆనందోత్సాహాలతో ఆమోదించారు.

"మంచిది! మీ న్యాయమైన కోరికను అభినందిస్తున్నాను. అయితే, మనకు న్యాయమైన కోరిక ఉన్నంతమాత్రాన, ఊరుకుంటే అదినెరవేరదు. దానిని సాధించడానికి శాయశక్తులా పోరాడాలి. యువరాజు అశోకుడు మగధ సింహాసనం అధిష్ఠించాలంటే – అందుకుమనం మన ఖడ్గబలంతో రాజమార్గం నిర్మించాలి! దానికెంతో ధైర్యసాహసాలు కావాలి! త్యాగం చేయాలి. అందుకు మీరుసిద్ధంగాఉన్నారా?" అనిఅడిగాడు యశుడు ఆవేశంగా.

"యువరాజుకోసం ప్రాణాలర్పించడానికైనామేము సిద్ధంగా ఉన్నాం?" అన్నారు దళనాయకులందరూ ఏకకంఠంతో.

యువరాజు అశోకుడు అప్పుడే అక్కడికి వచ్చాడు.

"కాబోయే మగధ మహారాజు యువరాజు అశోకులవారికి నమస్కారం!" అన్నాడు సేనాధ్యక్షుడు. మిగతా దళనాయకులు అశోకుడికి తలలువంచి నమస్కరించారు.

"ఇక ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకూడదు. ఇక్కడ ఏఏ దళనాయకులు ఉండాలో సేనాధ్యక్షుడే నిర్ణయించాలి. అవసరమైతే వాళ్ళు పోరాడి రాజభవనాన్ని రక్షించవలసివుంటుంది. మిగిలిన వాళ్ళందరూ తమ దళాలతో తెల్లవారకముందే యువరాజు వెంట పాటలీపుత్రానికి బయలుదేరాలి!" అని ఆజ్ఞాపించాడు యశుడు.



దళనాయకులు అంగీకార సూచకంగా చేతులు పైకెత్తారు.

"మిత్రులారా! మా పితామహుడు స్థాపించిన మగధ సామ్రాజ్య సంరక్షణ కోసం, ఈ క్లిష్ట పరిస్థితులలో మీరు అందజేస్తున్న సహకారాన్ని, నేనెన్నడూ మరువను," అన్నాడు అశోకుడు.

* * *

"ప్రభూ! మహారాజుగారు మరణించారు?" అంటూ ఒక దూత లోపలికి వచ్చాడు.

ఆ గదిలో ఇద్దరు గ్రీకువర్తకులతో కలిసి మద్యం సేవిస్తున్న యువరాజు సుశేముడు ఇబ్బందిగా చూస్తూ తలపైకెత్తాడు. వాళ్ళ ముందున్న మేజా మీద పెద్ద వజ్రం వింతకాంతులు వెదజల్లుతున్నది.



"ఈ వార్తను తెచ్చినందుకు బహుమతిగా నీకీ వజ్రాన్ని ఇస్తాననుకుంటున్నావా? నిన్ను ఇక్కడికి అనుమతించిందెవరు?" అన్నాడు సుశేముడు తన ఆనందానికి అంతరాయం కలిగిందన్న ఆగ్రహంతో.

"తమరే అనుమతించారు ప్రభూ!" అన్నాడు అక్కడే నిలబడిన సుశేముడి ఆంతరంగిక సలహాదారు సుబాహుడు.

"అలాగా!" అంటూ సుశేముడు కొంత స్థిమితపడి, "నా తండ్రి మరణించాడా?" అన్నాడు.

"అవును, ప్రభూ! ప్రధానమంత్రి నుంచి వచ్చిన వర్తమానం ఇక్కడే ఉన్నది?" అన్నాడు సుబాహుడు.

"ప్రధానమంత్రి! నేను రాజుగా పట్టాభిషిక్తుడైన మరుక్షణమే ఆ ఖల్లాటకుణ్ణి దాపులనున్న తటాకంలో ముంచి చంపుతాను," అంటూ లేచినిలబడిన సుశేముడు గ్రీకువర్తకులకేసి తిరిగి, "సరే! తరవాత కలుద్దాం!" అన్నాడు.

ఇద్దరు వర్తకుల చూపులూ ఒక్కసారిగా మేజా మీదవున్న వజ్రంమీద పడ్డాయి. తక్షశిలలో వ్యాపారం చేసుకోవడానికి అనుమతించగలడన్న ఆశతో, వాళ్ళు సుశేముడికి విలువైన వజ్రాన్ని బహుమతిగా ఇచ్చారు. కాని దానికి సంబంధించిన ఆనతి ఇంకా జారీకాలేదు.

సుశేముడు ఆవజ్రాన్ని చేతిలోకి తీసుకుని; "మరికొన్ని వజ్రాలతో పాటలీపుత్రానికిరండి. తక్షశిలలో మాత్రమేకాదు; మగధ దేశమంతటా వర్తకం చేసుకునే హక్కును మీకు ఇస్తాను," అంటూ పకపకా నవ్వాడు.

వర్తకులు మౌనంగా నిలబడ్డారు.

"నా మాటలు మీకు అర్థంకాలేదా?" అన్నాడు సుశేముడు మెరుస్తూన్న కళ్ళతో.

"తమ పట్టాభిషేకం నిరాటంకంగా జరిగిపోవాలని ఆశిస్తున్నాము, ప్రభూ!" అన్నారు వర్తకులు.

"ఇప్పుడే నేను పాటలీపుత్రానికి బయలుదేరాలి. సుబాహూ! మన దళనాయకులను రప్పించు," అన్నాడు సుశేముడు.

"సైన్యంతో వెళ్ళడం ఉత్తమం!" అన్న మాటలు వెనకనుంచి వినిపించాయి.

సుశేముడు తలత్రిప్పి చూశాడు. ఆమాట అన్నవాడు పాటలీపుత్రంలోని అతని ప్రధాన గూఢచారి.

"ఏమిటా తొందర? ఎందుకలా రొప్పుతున్నావు?" అని అడిగాడు సుశేముడు.

"ప్రభూ! నేను ఇప్పుడే పాటలీపుత్రం నుంచి వస్తున్నాను. యువరాజు అశోకుడు పాటలీపుత్రం చేరుకోనున్నాడు!" అన్నాడు గూఢచారి.

"అర్థరహితంగా వాగకు! నువ్వంటూన్న యువరాజు అశోకుడు కదలలేనిమాంసపు ముద్దగా, లేచి నిలబడడానికి కూడా వీలు కాకుండా ఉజ్జయినిలో అవస్థపడు తున్నాడు!" అన్నాడు సుశేముడు హేళనగా.

"ప్రభూ! ఆయన సైన్యంతో గుర్రాల మీద రాజధానికేసి దూసుకు వెళ్ళడం నేను నా కళ్ళారా చూశాను!" అన్నాడు గూఢచారి.

"నిజంగానా!" అన్నాడు సుశేముడు ఇంకా నమ్మలేనట్టు.

"నా మాటలలో అవలేశం అబద్ధం వున్నా, నన్నూ ఖల్లాటకుడితో పాటు నీళ్ళ లోకి తోసి చంపండి.!" అన్నాడు గూఢచారి.

"అయితే..." అంటూ సుశేముడు సుబాహుడికేసి చూశాడు అసహనంగా.

"చెప్పండి, ప్రభూ!" అన్నాడు సుబాహు ఒక అడుగు ముందుకు వేసి.

"ఉజ్జయిని నుంచి వచ్చిన ఆ యువ తులు ఎక్కడ? సుబాహూ వాళ్ళను వెంటనే ఇక్కడికి తీసుకురా!" అని ఆజ్ఞాపించాడు.

"వాళ్ళెక్కడున్నారు ప్రభూ!" అని అడిగాడు సుబాహుడు.

"అది, నాకెలా తెలుసు? నా దగ్గర బహుమతి పుచ్చుకుని తరవాత వస్తామని చెప్పి వెళ్ళారు. ఈ నగరంలోనే ఎక్కడో ఉంటారు. మన భటులు వెదికి పట్టుకో లేరా?" అన్నాడు సుశేముడు.



అంతలో మరొక భటుడు వచ్చి సుశే ముడికి నమస్కరించాడు. వాడు ఉజ్జయి నిలో వున్న సుశేముడి గూఢచారి. వాణ్ణి చూడగానే, "ఆహా! సమయానికి వచ్చావు. అశోకుడు పాటలీపుత్రానికి బయలుదేరా డని చెప్పడానికికాదుకదా నువ్వువచ్చింది!" అని అడిగాడు సుశేముడు ఉత్కంఠతతో.

"అంటే, ప్రభువులవారికి ఈ వార్త ముందే అందిందన్న మాట! అశోకుడు అటు పాటలీపుత్రానికి బయలుదేరగానే నేనుఇటు తక్షశిలకు వచ్చాను," అన్నాడు గూఢచారి.

"అశోడు పక్షవాతం పాలుకాలేదా?" అన్నాడు సుశేముడు ఆవేశంగా.

"పక్షవాతమా! ఆయన మునుపటికన్నా ఇప్పుడుఎంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా



గుర్రం మీద బయలుదేరాడు, ప్రభూ!" అన్నాడు గూఢచారి.

"చాలు, నోర్మూయ్! ఆ మోసకత్తెలను పట్టుకురండి! కోసి కాకులకూ, గద్దలకూ ఆహారంగా వేయండి.నిలువునా నిప్పుల్లో తగలబెట్టండి! గొంతు నులిమి చంపండి!" అంటూ పట్టరానిఆవేశంతో మతిచలించిన వాడిలా కేకలువేయసాగాడు సుశేముడు.

* * *

సూర్యుడు పడమటి కొండలను చేరు కుంటున్నాడు. రాజు బిందుసారుడి భౌతిక కాయాన్ని దహనంచేయడానికి నదీ తీరా నికి తీసుకువచ్చారు. ఆయన కుమారు లలో ఆరుగురు అక్కడే ఉన్నారు. రాజు గారి చితికి నిప్పంటించేదెవరో ఇంకా నిర్ణయం కాలేదు.

"ఆరుగురు కుమారులకూ ఆపనిని అప్పగించవచ్చా?" అని అడిగాడు సేనాధి పతి ప్రధానమంత్రిని.

"అశోకుడు నగరాన్ని సమీపించాడని నాకు వర్తమానం అందింది. సుశేముడి తరవాత ఆయనే అర్హుడైన యువరాజు గనక, ఆయనే చితికి నిప్పంటించడం న్యాయమని నేను భావిస్తున్నాను" అన్నాడు ప్రధానమంత్రి.

"అవును, అదే ధర్మ సమ్మతం!" అన్నాడు పురోహితుడు.

"అదిగో యువరాజు అశోకుడు వచ్చే శాడు!"అన్నారు దూరంగా నిలబడినప్రజలు.

"యువరాజు అశోకుడు వర్థిల్లాలి!" అని మిగతావాళ్ళు నినాదాలు చేశారు.

అప్పటికే అక్కడున్న ఆరుగురు రాకు మారులు అదృశ్యమయ్యారు.కొంతసేప టికి దూరంగా కలకలం బయలుదేరింది.

"ఏమిటది?" అని అడిగాడు ప్రధాన మంత్రి.

"రాకుమారులుఆరుగురి ఆజ్ఞప్రకారం, కొందరు సైనికులు యువరాజు అశోకుణ్ణి ఇక్కడికి రానీయకుండా అడ్డుకుంటు న్నారు" అని చెప్పాడు అక్కడికి పరుగెత్తుకు వచ్చిన ఒక రాజోద్యోగి.

సేనాధిపతి దాపులనున్న ఎత్తయిన ప్రదేశాన్ని చేరి, "మన సైనికులెవ్వరూ యువరాజు అశోకుణ్ణి అడ్డుకోకండి! అలా చేసిన వారికి మరణశిక్ష తప్పదు!" అని హెచ్చరించాడు.

అయినా, అంతకు ముందే రాజకు మారులు, కొందరు దళనాయకులకు



లంచమిచ్చి వశపరచుకుని వుండడం వల్ల, ఆ దళనాయకుల కింది సైనికులు, అశోకుడికి అడ్డుపడడానికి ప్రయత్నిం చారు. అశోకుడి వెనక బలమైన సైన్యం వస్తూన్న విషయం వాళ్ళెరుగరు!

"యువరాజు అశోకుడికి అడ్డుపడే వాళ్ళందరినీ హతమార్చండి!" అని ఆజ్ఞా పించాడు యశుడు.

"యువరాజు అశోకుణ్ణి రక్షించాలని మన సైనికులను ఆజ్ఞాపిస్తున్నాను!" గట్టిగా అరిచాడు సేనాధిపతి.

"దహన సంస్కారానికి తగిన సమయం ఆసన్నమయింది, ఇప్పుడేంచేయడానికీ తోచడం లేదు!" అన్నాడు పురోహితుడు.

అంతలో అశోకుడు అక్కడికి వచ్చాడు!

"యువరాజులవారికి స్వాగతం! ఈ సమయంలో తమరు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవలసిరావడంవిచారకరం!అయినా, అదృష్టవశాత్తు నిరపాయకరంగా బయట పడ్డారు.అంతేచాలు!"అన్నాడుప్రధానమంత్రి.

"మండుతూన్న కాగడాను అందుకుని మీ తండ్రిగారి చితికి నిప్పంటించండి!" అన్నాడు రాజపురోహితుడు.

కొన్ని నిమిషాలలో ఆ తంతు పూర్త యింది!

"సింహాసనం ఖాళీగా ఉండకూడదు. రాజుగారిచితికి నిప్పంటించిన వారే సింహా సనానికి వారసులవుతారు. ఈ రాత్రికే తమ మకుటాభిషేకం జరగాలి. కావలసిన ఏర్పాట్లుచేశాను!" అన్నాడు ప్రధానమంత్రి.

"నేను పరిపాలనాధికారాన్నిచేపడతాను. అయితే, మకుటాభిషేకోత్సవం అప్పుడే వద్దు. నేను మహారాజు కావడానికి రాజోద్యో గులూ, ప్రముఖులూ, సామంతులూ సుము ఖంగా ఉన్నారా- అని మొదట తెలుసుకో వాలి!" అన్నాడు అశోకుడు గంభీరంగా.

"ఉన్నతమైన మీ మనోప్రవృత్తిని మీ మాటలు చాటుతున్నాయి!" అన్నాడు ప్రధానమంత్రి.

అశోకుణ్ణి హతమార్చడానికి వచ్చిన వాళ్ళందరూ హతులయ్యారని తెలియ డానికి మరొక గంటసేపు పట్టింది. హతు లైన వారిలో ఆరుగురు రాకుమారులూ ఉన్నారు. రాజభవనం అంతటా శోకం అలముకున్నది. రాణులూ, పరిచారికలూ దీనంగా విలపించసాగారు! – (ఇంకావుంది)



సామ్రాట్ అశోక

12

[తన తదనతరం మగధ సింహాసనానికి వారసుడు ఎవరని ప్రకటించకుండానే రాజు బిందుసారుడు మరణించాడు. తక్షశిలకు రాజు మరణవార్త అందినప్పటికీ సుశేముడు అక్కడినుంచి కదలలేదు. అశోకుడు ఉజ్జయిని నుంచి కొంత సైన్యంతో పాటలీపుత్రం చేరుకున్నాడు. తనను హతమార్చడానికి ప్రయత్నించిన ఆరుగురు రాకుమారులను వధించి, ముందుకు వెళ్ళి, పెద్దల కోరిక ప్రకారం తండ్రి చితికి నిప్పంటించాడు. అన్ని విధాలా అర్హుడైన యువరాజు అశోకుణ్ణే రాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేయాలని ప్రధానమంత్రీ, రాజపురోహితుడూ, సేనాధిపతీ నిర్ణయించారు. —తరవాత]

బిందుసార మహారాజు మరణించాడన్న విచారంతో వున్న మగధ ప్రజలు, రాజ కుమారులు కూడా హతులయ్యారని తెలిసి మరింత విషాదానికి లోనయ్యారు. అయినా రాజకుమారుల మరణానికి వాళ్ళే కార కులనీ, వాళ్ళ దుర్మార్గమే వాళ్ళ నాశనానికి దారి తీసిందనీ గ్రహించి ఊరట చెందారు.

అర్ధరాత్రి సమయంలో ప్రధానమంత్రి అశోకుడికి రాజ్యాధికారం అప్పగించాడు. అశోకుడు సింహాసనం అధిష్ఠించాడు గాని, కిరీటం ధరించలేదు. "ఈ విషాద పరిస్థితిలో రాజ్యాభిషేకానికి నా మనసు అంగీకరించడంలేదు. ఇప్పుడు మకుటాభి షేకోత్సవం వద్దు!" అన్నాడు అశోకుడు.

మంత్రులూ, సేనాధిపతీ అశోకుడి అభిప్రాయాన్ని అభినందించి, అంగీకరిం చారు. కాని వారిలో ఏ ఒక్కరు గానీ ప్రశాంతంగా ఉండలేకపోయారు. ఎందు



కంటే, తక్షశిల నుంచి రాజుగారి జ్యేష్ఠ కుమారుడు సుశేముడు ఏ క్షణాన వచ్చి ఎటువంటి అఘాయిత్యానికి పూనుకుంటాడో అని దిగులుపడసాగారు.

తక్షశిలలో సుశేముడు, నాట్యకత్తెలు వంచనతో చెప్పిన మాటలనే ఇంకా నమ్ముకుని, అశోకుడు కదలలేని స్థితిలో పడివున్నాడని ఊహించుకుంటూ కాలయాపన చేయసాగాడు. సుశేముడి తల్లి, మళ్ళీ తన కుమారుడికి రహస్యంగా ఒక లేఖ పంపింది. "తండ్రి మరణించాడు. కానీ, నువ్వు ఇప్పుడు పాటలీపుత్రానికి రావద్దు!" అని ఆ లేఖలో ఉన్నది. ఆ లేఖను చదవగానే సుశేముడు ఒక్క క్షణం దిగ్భ్రాంతి చెందాడు. లేఖ తెచ్చిన దూతకేసి ఆగ్రహంగా చూశాడు.

మహారాజు బిందుసారుడి దహన సంస్కారానికి ముందు జరిగిన పోరాటం గురించీ, రాకుమారుల మరణం గురించీ, ఆ తరవాత అశోకుడు రాజ్యాధికారాన్ని చేపట్టిన విషయం గరించీ దూత సుశేముడికి తెలియచెప్పాడు.

"ఆహాఁ! ఎంతఘోరం జరిగిపోయింది! ఆ పరిచారికాపుత్రుణ్ణి ఇక ప్రాణాలతో వదలకూడదు. ఈ క్షణమే నా ఖడ్గంతో తెగనరుకుతాను! పాటలీపుత్రానికి బయలుదేరాలి; దళానాయకులను పిలవండి!" అని కేకవేశాడు సుశేముడు.

"మహారాణిగారు తమర్ని ఇప్పుడే రావద్దని హెచ్చరించారుకదా?" అన్నాడు దూత వినయంగా చేతులు జోడించి.

"నోర్ముయ్!" అని దూతను కిందికి తోసి, "నా మాటకు ఎదురాడకు. నన్ను కాబోయే రాజుగా నా తండ్రి నిర్ణయించాడు కదా? నేను దహనసంస్కారానికి రావడానికి కొంత ఆలస్యమైనంత మాత్రాన మా తండ్రి నిర్ణయాన్నికాదనడానికి, ఆ దుర్మార్గులు ఎవరు? ఇదంతా ఆ గుంటనక్క ఖల్లాటకుడి కుట్ర! ఆనీచుడే నా ఖడ్గానికి మొదటి బలికావాలి!" అంటూ సుశేముడు తోక తొక్కిన త్రాచులా బుస్సున లేచాడు.

☆ ☆ ☆

యువరాజు సుశేముడు తక్షశిలలో వున్న సైన్యాన్ని వెంటబెట్టుకుని పాటలీపుత్రంకేసి వస్తున్నాడని తెలియగానే ప్రధానమంత్రీ, సేనాధిపతీ తీవ్రమైన ఆందోళనకు గురయ్యారు. కర్తవ్యం గురించి చర్చించడానికి అశోకుడు వాళ్ళందరినీ పిలిపిం

చాడు. అందరూ రహస్యాలోచన మంది రంలో సమావేశమయ్యారు. అశోకుడు వారిని, "సుశేముడు సైన్యంతో వస్తూన్న విషయం మీకుతెలిసి వుంటుంది. ఈ స్థితిలో మీసలహా ఏమిటి?" అని అడిగాడు.

ఏ ఒక్కరుగాని నోరు తెరవలేదు. అలముకున్న నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అశోకుడు మళ్ళీ, "మిత్రులారా! మౌనంవహించడానికి ఇది సమయం కాదు. మగధ రాజ్య శ్రేయోభిలాషులుగా మీ సలహా కోరుతున్నాను," అన్నాడు గంభీరంగా.

"ప్రభూ! మకుటాభిషేకం ఇప్పుడు వద్దన్నది తమరేతప్ప మేముకాదు. అయినా తమరే మాకు మహారాజు. శత్రువు తన మీదికి దండెత్తి వచ్చినప్పుడు ఒకరాజు ఏంచేయాలో అదే మీరు చేయండి. మహారాజుగా ఆ నిర్ణయం మీరే తీసుకోవాలి!" అంటూ ప్రధానమంత్రి ఖల్లాటకుడు ఇతర మంత్రులకేసిచూశాడు.

వాళ్ళందరూ ముక్తకంఠంతో, "యుద్ధం తప్పదు!" అన్నారు.

"మీసలహాకు కృతజ్ఞుణ్ణి! అయితే ఒక్క విషయం. నేను సుశేముడికి ఒక అవకాశం ఇవ్వదలచాను," అన్నాడు అశోకుడు.

"ఏమిటది?" అని అడిగాడు ప్రధాన మంత్రి.

"సుశేముడు శాంతంగా తిరిగివెళ్ళినట్టయితే తక్షశిలలోఇప్పటిలాగే రాజ ప్రతినిధిగా కొనసాగవచ్చు!"అన్నాడు అశోకుడు.

"రాజ ప్రతినిధిగా సుశేముడు మీకు లోబడి వుండడం అసంభవం. ఒకవేళ తిరిగి వెళ్ళినా, ఆయన స్వతంత్రం ప్రకటించుకోగలడు. అది మిగిలిన వారిని కూడా తప్పు దారిపట్టించి, రాజ్యంలో అశాంతికి దారితీయగలదని శంకిస్తున్నాను," అన్నాడు ఒక మంత్రి.



ప్రధానమంత్రి కొంతసేపు మౌనంగా ఆలోచించి, "మంత్రిమాటలలో ఏమాత్రం అతిశయోక్తిలేదు. ఆయన ఊహ అక్షరాలా నిజమవుతుంది. అయినా, మన రాజుగారి ఉద్దేశం కూడా చాలా ఉదాత్తమైనది. సుశేముడు శాంతంగా తక్షశిలకు తిరిగి వెళ్ళి, రాజప్రతినిధిగా కొనసాగడానికి అవకాశం ఇవ్వడంలో తప్పులేదు. ఒకవేళ ఆయన తక్షశిలకువెళ్ళి స్వతంత్రం ప్రకటించుకునే ప్రయత్నం చేసినట్టయితే అప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవచ్చు!" అన్నాడు.

"ఈ విషయాన్ని సుశేముడికి ముందే తెలియజేయడం ఎలా?" అని అడిగాడు అశోకుడు.

"ఆ పనిని నేనే చేస్తాను. నగరం పొలి మేరలో ద్వారతోరణం ఏర్పాటు చేసి, చేతిలో పుష్పహారంతో సుశేముడికి స్వాగతం చెబుతాను. ఒకరిద్దరు పెద్దలు తప్ప నా చుట్టూ ఆయుధాలు ధరించిన సైనికులెవ్వరూ ఉండకూడదు. మేము యుద్ధానికి సిద్ధంగాలేమనీ, శాంతిమంత నాలకు కాచుకుని ఉన్నామనీ సుశేముడికి అర్థమవుతుంది. ఆయన దగ్గరికి రాగానే పుష్పహారంవేసి తమ ప్రతిపాదనను తెలియ జేస్తాను," అన్నాడు ప్రధానమంత్రి.

"మీ ధైర్యాన్నీ, వివేకాన్నీ అభినందిస్తు న్నాను. ప్రధానమంత్రీ! అయినా, తమ ప్రాణాలకు ఆపద వాటిల్లుతుందేమోనని భయపడుతున్నాను," అన్నాడు అశోకుడు.

"నేను చేయబోయే పని అపాయకరమైనదే. కాని, యువరాజు నన్ను చంపడం ద్వారా సాధించేదేమీఉండదు. అదిఆయన ప్రాణాలకే ముప్పు అవుతుంది. అయినా, మగధ సామ్రాజ్య రక్షణకూ, శాంతికీ నా ప్రాణాలర్పించడానికి సిద్ధంగా ఉన్నాను," అన్నాడు ప్రధానమంత్రి.

"మీ రాజభక్తి శ్లాఘనీయమైనది. మీ సాహసం జయప్రదం కావాలని కాంక్షిస్తు న్నాను," అన్నాడు అశోకుడు.

సుశేముడు నగరం శివార్లను సమీపించ డానికి ముందే ఖల్లాటకుడు నగర ప్రవేశ ద్వారం దగ్గరికి చేరాడు. సుశేముడు దూరంగా కనిపించగానే చేతిలో పుష్పహారం పట్టుకుని నిలబడ్డాడు.

నగరాన్ని సమీపించే కొద్దీ సుశేముడిలో ఆగ్రహం పెల్లుబకసాగింది. "నేను రాజ భవనంలోకి ప్రవేశించి సింహాసనం అధి ష్ఠించేంతవరకు మార్గమధ్యంలో ఎవరు అడ్డుపడినా సరే హతమార్చండి!" అని సైనికులను హెచ్చరిస్తూ గుర్రంపై తుపా నులా ముందుకు రాసాగాడు.

సుశేముడు ద్వారాన్ని సమీపించగానే ప్రధానమంత్రి పుష్పమాలనుపైకెత్తిస్వాగతం అన్నట్టు అతన్ని ఆపబోయాడు. సుశేముడు ఒక్కక్షణం ఆగాడు. కానిఅంతలోనే, "దుర్మార్గుడా! నువ్వు ఇక్కడే ఉన్నావా?" అంటూ కత్తిదూశాడు.

"యువరాజా! ఆగండి..." అంటూ ప్రధానమంత్రి ఏదో చెప్పబోయాడు. కాని

అంతలోనే సుశేముడి కత్తివేటుకు ఆయన తల తెగి నేలపై పడింది!

ప్రాకారానికి అనుకుని వున్న భవనం ఉపరితలం మీద నిలబడి కింద జరిగిన దాన్ని పరిశీలించిన దళనాయకుడు ఆజ్ఞాపించగానే, గోడకు ఆవలనున్న సైనికులు గట్టు తెగిన వెల్లువలా సుశేముణ్ణీ అతని సేనలనూ చుట్టుముట్టారు. దాంతో సుశేముడు ఒక్క అడుగుకూడా ముందుకు వేయలేకపోయాడు. ప్రధానమంత్రి కుమారుడూ, దళనాయకుడూ అయిన ఒక యువకుడు సుశేముడి తలను తెగనరికాడు! దాంతో తక్షశిలనుంచి వచ్చిన సేనలులొంగిపోయాయి. సైనికులు జరిగినదానికి క్షమాపణలు చెప్పుకుని మగధసైన్యంలోకలిసిపోయారు.

శాంతిని కాంక్షించి, నిరాయుధపాణిగా నిలబడిన ప్రధానమంత్రి ఖల్లాటకుడికి వాటిల్లిన దుర్మరణానికి అశోకుడు విచారించాడు.ఆయన స్థానంలో నూతన ప్రధానమంత్రిగా రథగుప్తుణ్ణి నియమించాడు.

శత్రుశేషం లేకుండా నశించడంతో రాజ్యంలో శాంతి భద్రతలు నెలకొన్నాయి. రాజ్యపాలనలోతమరాజు అశోకుడు తాత చంద్రగుప్తుడంతటి సమర్థుడని వృద్ధులైన ప్రజలు చెప్పుకోసాగారు.

అశోకుడికి మకుటాభిషేకోత్సవం జరపడానికి జ్యోతిష్కులు శుభముహూర్తం నిర్ణయించారు. కాని ఈ విషయంలో పెద్దలకు ఒక సమస్య ఎదురయింది. విదీశాదేవి బౌద్ధమతావలంబిని. ఆమెను మగధ సామ్రాజ్య మహారాజ్ఞిగా అంగీకరించడానికి ఆస్థాన పురోహితులు సుముఖత చూప లేదు. ఎందుకంటే, ఆమెకు హైందవమత సంప్రదాయాలపట్ల విశ్వాసం లేదు. దానికి తోడు ఆమె ఇటీవల అనారోగ్యం పాలయింది. ఆమె చాలా దూరం ప్రయాణం చేయడం అపాయకరమని వైద్యులు సలహా ఇచ్చారు. అలా అని మకుటాభిషేకోత్సవాన్ని మరికొంత కాలం ఆలస్యం చేయడం కూడా సాధ్యపడదు. ఎందుకంటే ఇటువంటి శుభ ఘడియలు మరొక ఐదేళ్ళకుగాని రావని జ్యోతిష్కులు సెల విచ్చారు. రాణిగారు లేకుండా మకుటాభిషేకోత్సవం జరగడానికి లేదు.

ఇవన్నీ ఆలోచించి నూతన ప్రధానమంత్రి రథగుప్తుడు అశోకుడితో, "ప్రభూ!

తమ విషయంలో ఇంతటి చొరవ చూపుతున్నందుకు క్షమించండి. మహారాణి విదీశాదేవి ఆరోగ్యం అంత బాగాలేదు. పైగా తమ కుమారుడు యువరాజు మహేంద్రుడికికూడాబౌద్ధమతసిద్ధాంతాలనే బోధిస్తున్నారు. యుద్ధంపట్ల విశ్వాసంలేని యువరాజు మునుముందు తమ రాజ్యాన్నిఎలా రక్షించుకోగలడో ఆలోచించండి. రాజ్యం వీరభోజ్యంఅన్నసత్యంతమరెరుగనిదికాదు. రాజ్యం భవిష్యత్తు దృష్ట్యా తమరు వేరొక రాకుమారిని వివాహమాడడం ఒక్కటే తరుణోపాయంగా తోస్తున్నది!" అన్నాడు.

అశోకుడు మంత్రి ఆలోచనకు తల ఒగ్గలేదు. కాని విషయం తెలుసుకున్న విదీశాదేవి యశుడి ద్వారా-తన ఆరోగ్యం క్షీణించిందనీ, ఈ స్థితిలో రాజపత్నిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించజాలననీ; వేరొక రాకుమారిని వివాహమాడడమే అన్ని విధాలా శ్రేయస్కరమనీ అశోకుడికి తన ప్రార్థనగా తెలియజేసింది. ఆఖరికి అశోకుడు ద్వితీయ వివాహానికి సమ్మతించాడు. అసంధిమిత్రను వివాహమాడాడు. కొన్నాళ్ళకు, జ్యోతిష్కులు నిర్ణయించిన శుభముహూర్తంలో అశోకుడికి మగధరాజ్య మకుటాభిషేకోత్సవం వైభవోపేతంగా జరిగింది.

అయితే, అశోకుడు విదీశాదేవినీ, ఇద్దరు సంతానాన్నీ మరవలేకపోయాడు. క్రమంగా విచారానికి లోనై రాజ్యపాలనా వ్యవహారాలపట్ల ఆసక్తిని కోల్పోసాగాడు.

అశోకుడి వైఖరిని గురించి ప్రధాన మంత్రి సేనాధిపతిని సంప్రదించాడు. "మన రాజుగారు పెద్దభార్య విదీశాదేవిని గురించి ఆలోచిస్తూ, రాజ్య వ్యవహారాలను సైతం ఉదాసీనం చేస్తున్నాడు. ఇలాగే సాగితే ఆయన హఠాత్తుగా సింహాసనాన్ని త్యజించి ఉజ్జయినికి వెళ్ళి అక్కడ ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించినా ఆశ్చర్యం ఉండదు. ఆయనలో రాజ్యకాంక్షనురగిలించి, అధికార దాహాన్నీ, విజయోత్సాహాన్నీ కలిగించడం మన కర్తవ్యం. యుద్ధాలలో విజయం సాధించినప్పుడే రాజులకు ఆనందోత్సాహాలు సిద్ధిస్తాయి. శత్రురాజులను పరాజితులను చేసి విజయం సాధించడంలో కలిగే ఆనందం అద్భుతమైనది కదా!" అన్నాడు ప్రధానమంత్రి రథగుప్తుడు సేనాధిపతి వీరసింహుడితో.



"మీ అభిప్రాయం సమంజసంగానే ఉన్నది. సమయంచూసి రాజుగారిలో రాజ్యకాంక్షను కలిగించడం అవసరం," అన్నాడు సేనాధిపతి.

ఆ సమయంలోనే వారసుడు లేకుండానే కళింగరాజు మరణించాడన్నవార్తఅందింది. కొందరు అధికారులే పరిపాలనా వ్యవహారాలు చూస్తున్నారు.

ఒకనాటి సాయంకాలం వేళ ప్రధాన మంత్రి, ఉద్యానవనంలో విహరిస్తున్న అశోకుణ్ణి సమీపించి, "మహారాజా! చంద్రగుప్త మౌర్యుడూ, బిందుసార మహారాజూ జయించాలని కలలుగని,జయించకుండా వదిలిన రాజ్యం కళింగ ఒక్కటే. బాలీ, సుమత్ర వంటి దూరద్వీపాలతో వర్తక వ్యాపారాలు సాగిస్తున్న సుసంపన్న రాజ్యం కళింగ. ఒకరాజు కింద వివిధ వంశస్థులైనపాలకులు మైత్రీ సంబంధాలు కలిగివుండడం వల్ల అక్కడ ఐకమత్యానికి కొదువలేదు. ఇప్పుడు రాజు మరణించాడు గనక, పాలకులమధ్య ఐకమత్యం పటాపంచలుకావడంతథ్యం. కళింగను జయించడానికి ఇదొక సువర్ణావకాశం," అన్నాడు.

సేనాధిపతి కూడా అంతలో అక్కడికి వచ్చాడు.

మంత్రి మాటలకు అశోకుడు సమాధానం చెప్పలేదు. మౌనంగా ఆలోచించ సాగాడు.

"మన సైన్యం చాలా సంవత్సరాలుగా యుద్ధంచేయలేదు. ఇలాగేసాగితే మన సైనికులుసోమరులుగామారిపోయేప్రమాదం వుంది. సైన్యం అంటే తరచూశిక్షణకావాలి. ఇలాగేసాగితే శత్రువులనుఎదిరించే శక్తిని కూడాకోల్పోవచ్చు!" అన్నాడు సేనాధిపతి.

"సరే! కళింగపై దండెత్తడానికి కావలసిన ఏర్పాట్లన్నీచేయండి. మొదట కళింగకు మన గూఢచారులను పంపండి. ఆ రాజ్యంలోని సేనల బలాబలాలను తెలుసుకోవడం వాళ్ళ మొదటి పని! ఆ తరవాత వాళ్ళు అక్కడి పాలకులలో ఒకరిమీద ఒకరికి అనుమానం కలిగే పరిస్థితులను సృష్టించాలి!" అన్నాడు అశోకుడు.

"చిత్తం, ప్రభూ! మీ ఆజ్ఞను శిరసావహిస్తాము!" అన్నాడు ప్రధానమంత్రి.

కళింగపై దండయాత్రకు మగధ సిద్ధం కాసాగింది. – (ఇంకావుంది)



సామ్రాట్ అశోక

13

[తండ్రి బిందుసారుడి మరణవార్త అందగానే అశోకుడు ఉజ్జయిని నుంచి కొంత సైన్యంతో పాటలీపుత్రం చేరుకుని, తనను హతమార్చడానికి పూనుకున్న రాకుమారులను వధించి ముందుకు వెళ్ళాడు. తండ్రి చితికి నిప్పంటించిన తరవాత పెద్దలకోరిక ప్రకారం రాజ్యాధికారం చేపట్టాడు. తక్షశిలనుంచి క్రోధావేశంతో బయలుదేరిన సుశేముడు దురహంకారం కొద్దీ, రాజధాని నగరద్వారం దగ్గరే హతుడయ్యాడు. విదీశాదేవి అనుమతి మేరకు, పెద్దలకోరిక ప్రకారం ఒక రాకుమారిని వివాహమాడి అశోకుడు రాజ్యాభిషిక్తుడయ్యాడు. కొన్నాళ్ళ తరవాత మంత్రి, సేనాధిపతుల ప్రోద్బలంతో, కళింగపై దండెత్తడానికి పాటలీపుత్రంలో యుద్ధసన్నాహాలు ఆరంభమయ్యాయి. —తరవాత]

పాటలీపుత్రం నుంచి ఉజ్జయినికి చేరుకున్న దూత, రాజభవనంలోని విదీశాదేవిని దర్శించి, "మహారాణికి నమస్కారం!" అంటూ గౌరవంతో తలవంచి చేతులు జోడించాడు.

"నన్నంత ఆడంబరంగా సంబోధించ వలసిన అవసరంలేదు, నాయనా! మీ రాజుగారు ప్రస్తుతం వివాహమాడిన అసంధిమిత్ర మాత్రమే అటువంటి గొప్ప గౌరవమర్యాదలకు అర్హమైనది!" అని దూతను మృదువుగా వారించింది విదీశా దేవి.

"క్షమించాలి, మహారాణీ! రాజుగారు ద్వితీయ వివాహం చేసుకున్నంత మాత్రాన తమరు మహారాణి కాకుండా పోరు. మిమ్ములనూ, మీ పిల్లలనూ రాజుగారు అనుక్షణం తలచుకుంటున్నారు. తమరు ఒకటికి రెండుసార్లు రాజుగారి ప్రాణాలను

రక్షించిన విషయం ఆయన మరువలేక పోతున్నారు. తమరినీ, పిల్లలనూ చూడాలని తహతహ లాడుతున్నారు. త్వరలో రాజుగారు కళింగపై దండయాత్రకు బయలుదేరనున్నారు. ఎంతటి వీరులకైనా సరే, యుద్ధంలో జయాపజయాలు ఊహించలేనివి కదా! అందువల్ల తాను దండయాత్రకు బయలుదేరేలోగా తమరినీ, పిల్లలనూ పాటలీపుత్రంలో స్థిరపడేలా చేయాలని రాజుగారు ఆశిస్తున్నారు!" అన్నాడుదూత, అశోకుడు పంపిన లేఖను ఆమెకు అందిస్తూ.

ఆ మాటలు వినగానే విదీశాదేవి ప్రశాంత హృదయంలో విషాద మేఘాలు అలముకున్నాయి. ఆమె వదనం విచార గ్రస్తమయింది. ఆ లేఖను ఆమె నెమ్మదిగా చదివింది. ఆ తరవాత ఆమె దృష్టి, దూరంగా ఒక చెట్టు కింద ప్రశాంతంగా కూర్చుని తాళపత్ర గ్రంథాలను పఠిస్తున్న తన పిల్లలు మహేంద్రుడు, సంఘమిత్రల మీదికి మళ్ళింది.

తరవాత ఆమె దూతకేసి తిరిగి, "నాయనా! ఒకప్పుడు అలజడులు చెల రేగిన ఈ నగరంలో, శాంతి భద్రతలు నెలకొనడానికి కారణం నా భర్త. ఆయన ఎంతో జాగ్రత్తగా ధర్మబద్ధమైన చట్టాలను ప్రవేశపెట్టి, వాటిని నియమబద్ధంగా అమలు పరచడానికి, నిజాయితీ పరులైన అధికారులను నియమించాడు. సమర్థవంతులైన ఆ అధికారుల కారణంగా ఈ ప్రాంత ప్రజలతోపాటు నా పిల్లలు కూడా ప్రశాంతంగా జీవిస్తున్నారు. సహజమైన ప్రశాంత వాతావరణంలో, ఉత్తములైన గురువుల పర్యవేక్షణలో మహేంద్రుడూ, సంఘమిత్రా విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. అటువంటి పసివారిని కక్షలు, కావేశాలకు నిలయమై, ఇటీవలే రక్తసిక్తమైన రాజధానికి తీసుకురావడం భావ్యమా? అంతేకాదు, పూజ్యగురుదేవులు ఉపగుప్తులు తరచూ ఉజ్జయినికి విజయం చేస్తున్నారు. ఆ మహనీయుణ్ణి దర్శించి, సేవించడానికి మా పిల్లలు ఎంతో ఉత్సాహం కనబరుస్తున్నారు. అటువంటి అరుదైన అవకాశం వాళ్ళకు పాటలీపుత్రంలో లభించదు కదా! అధికారం కోసం, పదవులిచ్చే సుఖంకోసం ప్రాకులాడే రాజ్యాధికారులు తప్ప అక్కడెవరున్నారు?" అని అడిగింది విచారంగా.

TL-F-3

దూత ఇబ్బందిగా నవ్వాడు తప్ప, మరేమీ మాట్లాడలేదు.

"నాయనా! రాజుగారంటే మాకెంతో అభిమానం, ఆరాధనాభావం ఉన్నాయి. అయితే, ఆయన దండయాత్ర పట్ల మాకేమాత్రంఆదరంలేదు. అన్నెంపున్నెం ఎరుగని అమాయక ప్రజలపై దాడి జరిపి క్రూరంగా హతమార్చడం, సంపన్న నగరాలను శ్మశానవాటికలుగా మార్చడం తప్ప ఈదండయాత్ర వల్ల ఒరిగేదేమిటి? ఈ దారుణాలన్నీ మహారాజు అశోకుడి పేరుమీదుగా జరగడం మరీ ఘోరం! యుద్ధాలలో భర్తలను, పుత్రులను, సోదరులను పోగొట్టుకుని హృదయ విదారకంగా విలపించే అసంఖ్యాకులైన అబలలను ఊహించుకుని ఎలా ఆనందించగలం? క్షతగాత్రులైన స్త్రీపురుషులు ప్రాణాలు వదులుతూ పెట్టే శాపనార్థాలు విని భరించగలమా? యుద్ధం అన్ని విధాలా అరిష్టదాయకం కదా? అందువల్ల, దండయాత్ర ఉద్దేశాన్ని విరమించుకున్నట్టయితే, నేను పిల్లలతో రాజధానీ నగరానికి రాగలనని మీ మహారాజుకు నా మాటగా చెప్పు!" అన్నది విదీశాదేవి ఎంతో గంభీరంగా.

"మహారాణీ! కరుణాపూరితమైన మీ సలహాకు ప్రత్యుత్తరమిచ్చే సావకాశం మహారాజుకు ఉంటుందో లేదో తెలియదు. ఎందుకంటే, అప్పుడే దండయాత్రకు రంగం సిద్ధమయింది. జైత్రయాత్రకు బయలుదేరేముందు తమరిని ఒకసారి చూసి వెళ్ళడానికి రాజుగారు ఆశించి ఉండవచ్చు!" అన్నాడు దూత వినయంగా.

"అది సాధ్యం కాగలదని నేను భావించడంలేదు. అయితే, ఇక్కడినుంచే మీ రాజుగారి క్షేమాన్ని కోరుకుంటున్నాను. దాపులనున్న ప్రశాంతమైన గుహలో కూర్చుని ప్రార్థిస్తాను. ఆ ప్రార్థన రాజుగారికి యుద్ధంలో విజయం చేకూరాలని కాదు; ఆయన హృదయంలో వివేకం, విచక్షణాజ్ఞానం వికసించాలని! శాంతభావం ఉదయించాలని! నువ్వింత దూరం శ్రమపడి వచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను!" అన్నది విదీశాదేవి కరుణార్ద్ర నేత్రాలతో విచారంగా నవ్వుతూ.

దూత చేతులెత్తి నమస్కరించి అక్కడినుంచి బయలుదేరాడు.

☆ ☆ ☆ ☆

అశోకుడు సాయంకాలవేళ, పడమటి కొండలలో అస్తమిస్తూన్న సూర్యుణ్ణి చూస్తూ, పాటలీపుత్ర రాజభవనం ఉపరితలంలో పచార్లు చేస్తున్నాడు. కొంతసేపటికి యశుడు అక్కడికి వచ్చి అశోకుడికి నమస్కరించాడు. కాని అశోకుడు ఏమీ మాట్లాడలేదు. యశుడు ఆయన మౌనానికి కారణం అడిగాడు. అశోకుడు గాఢంగా నిట్టూర్చి, "ఈరోజు ఒకదాని వెనక ఒకటిగా రెండు అశుభవార్తలను వినవలసి వచ్చింది!" అన్నాడు.

"ఏమిటవి?" అని అడిగాడు యశుడు.

"కళింగ నుంచి మన గూఢచారులు తెచ్చిన వార్త మొదటిది! కళింగరాజు, వారసులు లేకుండా మరణించిన మాట వాస్తవమే. కాని, కళింగలోని ఇరవై ఒక్క పరగణాలను ఇరవై ఒక్కమంది అధికారులు ఉమ్మడిగా ఒక పాలకుడిలా ఎంతో సమర్థవంతంగా పరిపాలిస్తున్నారు. వాళ్ళ ఐకమత్యం అభేద్యం అంటున్నారు! క్రమశిక్షణకు పేరుగాంచిన వాళ్ళ సైన్యం చాలా శక్తివంతమైనది. ఇక వర్తకవ్యాపారాలంటావా? రాజు మరణానంతరం కూడా ఏమాత్రం మందగించకుండా దినదినాభివృద్ధి చెందుతున్నవి!" అన్నాడు అశోకుడు కోపంగా..

"సరే, రెండవ అశుభవార్త ఏమిటి?" అని అడిగాడు యశుడు.

"మీ గారాల చెల్లెలు విదీశాదేవి,పిల్లలు అక్కడే ఆనందంగా ఉన్నారన్న సాకుతో, పాటలీపుత్రానికి రావడానికి నిరాకరించింది!" అన్నాడు అశోకుడు.

"మహారాజా! దానిని ఒకసాకు అని మీరెందుకు భావిస్తున్నారు? పిల్లలు అక్కడ నిజంగానే ఆనందంగా ఉన్నారు కదా!" అని యశుడు కొంతసేపు ఆగి, ఆ తరవాత, "మహారాజు క్షమించాలి. నేను చెప్పబోయేది మీకు మూడవ దుర్వార్తగా ఉండవచ్చు!" అన్నాడు నెమ్మదిగా.

ఏమిటి అన్నట్టు కోపంగా చూశాడు అశోకుడు.

"మన వ్యాపారనౌకలు రకరకాల వస్తువులతో సువర్ణ ద్వీప సముదాయానికి వెళ్ళిన విషయం తమరెరిగినదే. అయితే, జావా, సుమత్ర, బాలీమొదలైన ద్వీపాలలో మన వర్తకులు ఏ ఒక్క సరుకునూ అమ్మలేకపోయారు! అక్కడి ప్రజలు కళింగ వర్తకుల నుంచి తప్ప, కొత్త వర్త



కులు మరెవ్వరి దగ్గరా సరుకులు కొనడానికి ఆసక్తి కనబరచడం లేదు. కళింగ వర్తకులు ఆ ద్వీపవాసులతో అంతటి సత్సంబంధాలు కలిగి ఉన్నారు!" అన్నాడు యశుడు.

"ఆ సత్సంబంధాలను తెగనరుకుదాం! కళింగను మనం పట్టుకున్న తరవాత, మనం అనుమతిస్తేనే కదా అక్కడ వర్తక వ్యాపారాలు కొనసాగగలవు? ఈ దుర్వార్తలన్నీ దండయాత్రకు బయలుదేరాలన్న నా సంకల్పాన్ని మరింత దృఢతరం చేస్తాయే తప్ప, ఏమాత్రం బలహీన పరచలేవు!" అన్నాడు అశోకుడు పట్టరాని ఆవేశంతో.

అశోకుడు తన బాధను, నిస్పృహను కప్పి పుచ్చుకోవడానికే అలా ఆవేశంతో మాట్లాడుతున్నాడని యశుడు గ్రహించాడు. అయితే ఆ తరవాత అతడేమీ మాట్లాడలేకపోయాడు. మౌనంగా అక్కడినుంచి బయలుదేరాడు.

☆☆☆☆

దయానదీ తీరంలో వెలసిన అందమైన నగరం తోశాలి. నగరానికి ఆనుకునిచిన్న చిన్న కొండలు, చక్కటి ఉద్యాన వనాలు ఉన్నాయి. దయానది సరస్వతీ నదిగా ప్రసిద్ధిగాంచిందని పురాణాలు పేర్కొంటాయి. సరస్వతీ నదీతీరంలో దధీచి అనే మునిపుంగవుడు నివసించేవాడు. ఆ కాలంలోనే వృత్తాసురుడనే రాక్షసుడు విజృంభించి, మానవులనూ, దేవతలనూ నానా విధాలుగా హింసించసాగాడు. వాణ్ణి హతమార్చడానికి ఇంద్రుడికి సాధ్యం కాలేదు. తపోసంపన్నుడైన దధీచి ముని అస్థికలతో తయారైన వజ్రాయుధంతోనే వృత్తాసురుడికి మరణం సాధ్యమని ఇంద్రుడికి ధ్యానంలో తెలియ వచ్చింది. ఆయన ఆ విషయం దధీచికి తెలియజెప్పాడు. పరోపకారమే పరమార్థంగా భావించి దధీచి, లోక కల్యాణం కాంక్షించి ఇంద్రుడి కోరికను మన్నించి, ధ్యానంలో కూర్చుని ప్రాణత్యాగం చేశాడు. ఇంద్రుడు దధీచి వెన్నెముకను తన వజ్రాయుధంగా మలుచుకున్నాడు. ముని అస్థికల తపోబలంతో, వృత్తాసురుడు ఇంద్రుడి వజ్రాయుధానికి హతుడయ్యాడు. మానవుల, దేవతల బాధలు తొలగిపోయాయి.

దధీచి త్యాగనిరతి, ఆయన పవిత్ర స్మృతి తోశాలి ప్రజలను ఆదర్శ మూర్తు

లుగా తీర్చిదిద్దాయి. ఇతరులకు సాయ పడడానికి వాళ్ళెప్పుడూ వెనుకాడే వారు కారు. బ్రాహ్మణులు అధికసంఖ్యలో ఉన్నప్పటికీ, అల్పసంఖ్యాకులుగా వున్న జైనులనూ, బౌద్ధులనూ సమానంగా గౌరవించేవారు. సుప్రసిద్ధ జైనముని ఋషభనాథ్ తీర్థంకరుడు ఆ నగరానికి చెందినవాడే. తోశాలి ప్రజలు నగర మధ్యంలో బ్రహ్మాండమైన ఆయన శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దానిని మూడు మతాలకు చెందిన వారూ పూజించేవారు. మౌర్యవంశానికి ముందు మగధను పాలిం చిన ఒక రాజు ఆ శిలావిగ్రహాన్ని, పాటలీ పుత్రానికి బలవంతంగా తరలించుకుని వెళ్ళాడు. పాటలీపుత్రం మీదికి దండెత్తి వెళ్ళి, తమ శిలావిగ్రహాన్ని వెనక్కు తీసుకు రావాలని కళింగ రాజులు రెండు మూడు సార్లు ప్రయత్నించారు. కాని జైనులు వారిని వారించారు. "సహనంలో, క్షమా గుణంలో మనం ఎదుటి వారికి ఆదర్శ ప్రాయంగా నిలబడాలి. కళింగముని విగ్రహం పాటలీపుత్రాన్ని అలంకరించ డంలో దోషమేమీ లేదు. మనం మరొక విగ్రహాన్ని మన నగరంలో ప్రతిష్ఠించు కోవడమే భావ్యం!" అని రాజులకు నచ్చ జెప్పారు.

కొత్త విగ్రహాన్ని ప్రతిష్ఠించే ప్రయత్నంలో ఉన్నప్పుడే కట్టకడపటి కళింగ రాజుకు మరణం సంభవించింది!

రాజు మరణానంతరం రాజ్యంలో శాంతి భద్రతలను కాపాడడంలోనూ, వర్తక వ్యాపా రాలను పెంచి, కళింగరాజ్య సంపదలను మరింత అభివృద్ధి పరచడంలోనూ పరగ ణాల అధికారులు నిమగ్నులైపోయారు.

ఆసమయంలో హఠాత్తుగా ఒకనాడు కళింగ రాజ్య సరిహద్దు ప్రాంతాలలో



మగధ సైనికులు పెద్ద సంఖ్యలో గుమి గూడుతున్నారని గూఢచారుల ద్వారా తెలిసి నాయకులు అమితాశ్చర్యం చెందారు. మగధ సేనలు మరెక్కడికైనా వెళుతూ, మార్గ మధ్యంలో తమ రాజ్యంకేసి వస్తున్నాయా? లేక వాటి గమ్యస్థానమే తమ రాజ్యమా? అని పాలకులు తీవ్రంగా ఆలోచించసాగారు.

అంతలోనే మగధసేనలు భీకరమైన ఉప్పెనలా కళింగరాజ్యంలోకి విజృంభించాయి. ఎదురైన అమాయక ప్రజలను హతమారుస్తూ, మార్గమధ్యంలోని ఇళ్ళను తగులబెడుతూ రాజధాని తోశాలి కేసి దూసుకు రాసాగాయి.

ఈవార్త అందగానే, "దుర్మార్గమైన ఈ దురాక్రమణను మనం ఎదుర్కోక తప్పదు. మగధసేనలను తిప్పికొట్టాలి!" అన్నాడు వృద్ధుడైన ఒకనాయకుడు.

అందుకు మిగిలిన నాయకులందరూ అంగీకరించారు. హుటాహుటిగా వారివారి పరగణాలకు వెళ్ళి దురాక్రమణను తిప్పికొట్టడానికి సిద్ధంకాసాగారు. కనీసం ఇంటి కొకరు సైన్యంలో చేరి రాజ్యాన్ని దురాక్రమణ నుంచి కాపాడుకోవాలనీ, వాళ్ళందరూ మరునాడే తోశాలి నగరం చేరుకోవాలనీ పట్టణాలలో, పల్లెలలో చాటింపు వేయించారు.

ఆ చాటింపు విన్న ప్రజలు మొదట ఆందోళన చెందారు. ఆ తరవాత తమ ఇళ్ళల్లో ఉన్న రకరకాల ఆయుధాలను చేతబట్టి రాజధాని కేసి బయలుదేరారు. తోశాలి నగరాన్ని వదులుకుంటే కళింగ రాజ్యాన్నే వదులుకోవలసి వస్తుంది. కాబట్టి రాజధానీనగరాన్ని ఎలాగైనా కాపాడుకోవాలన్న పట్టుదలతో పిన్నలూ, పెద్దలూ యువకులూ అనే తారతమ్యం లేకుండా తండోపతండాలుగా రాజధాని కేసి రాసాగారు.

ప్రశాంతంగా వున్న గ్రామాలనుంచి పురుషులందరూ వెళ్ళిపోవడంతో స్త్రీలలో ఏడుపులూ, వేదనలూ, రోదనలూ చెలరేగాయి.

రాజధానిని చేరిన సామాన్య యువకులకు, తోశాలిలోని సైనికులు శత్రువులను ఎదుర్కొనే మెళకువలనునేర్పి, తగినశిక్షణ ఇవ్వడం ప్రారంభించారు.– (ఇంకావుంది)



సామ్రాట్ అశోక

14

[బిందుసారుడి మరణానంతరం యువరాజు అశోకుడు — సుశేముడు మొదలుగాగల అంతశ్శత్రువులను హతమార్చాడు. పెద్దల కోరిక ప్రకారం ద్వితీయ వివాహం చేసుకుని, మగధ రాజ్యాభిషిక్తుడయ్యాడు. మంత్రి సేనాధిపతుల ప్రోద్బలంతో కళింగపై దండయాత్రకు సిద్ధమయ్యాడు. మొదటి భార్య విదిశాదేవిని ఉజ్జయినీ నగరం నుంచి రాజధాని పాటలీపుత్రానికి తీసుకురావాలన్న అశోకుడి ప్రయత్నం ఫలించలేదు. కళింగ మీదికి మగధ సైన్యం రావడం చూసి కళింగ పాలకులు, ప్రజలు శత్రుసేనలను ఎదుర్కోవడానికి సిద్ధమయ్యారు. — తరవాత]

మహారాజు అశోకుడు, సేనాధిపతి ఉన్న గుడారానికి వచ్చిన యశుడు, "మనం మెరుపుదాడి జరిపాం. అయినప్పటికీ కళింగ ప్రజలు దృఢంగా ఎదుర్కొంటున్నారు. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం!" అన్నాడు.

"ఇంతకూ ఈ దేశానికి ఇప్పుడు రాజు కూడా లేడు. సామంతులే రాజ ప్రతినిధులుగా పాలనా వ్యవహారాలు చూస్తున్నారు!" అన్నాడు అశోకుడు.

అంతవరకు సైన్యానికి నాయకత్వం వహించిన సేనాధిపతి ఏమీ మాట్లాడలేదు.

"ఇది మిమ్మల్ని విమర్శించడానికి చెప్పడం కాదు. కళింగ ప్రజల ధైర్య సాహసాలు మాకు అమితాశ్చర్యం కలిగిస్తున్నాయి," అన్నాడు యశుడు సేనాధిపతికేసి తిరిగి.

"నాకూ ఆశ్చర్యంగానే ఉన్నది. ఇప్పటివరకూ మనల్ని ఎదుర్కొంటూన్న



వాళ్ళు గ్రామప్రాంతాలలోని సామాన్య ప్రజలే. వ్యవసాయం చేసుకుని బ్రతికే రైతులు ఆపత్సమయంలో, అత్యవసర పరిస్థితులలో కత్తులు బట్టి శత్రువుల మీదికి దాడి వెడలడం ఆ రాజ్యంలో తరతరాలుగా వస్తూన్న సంప్రదాయం. కళింగ సైన్యం పట్ల వాళ్ళెంతో గౌరవం కనబరుస్తారు!" అన్నాడు సేనాధిపతి.

"ప్రతి ఒక్కరూ తమ రాజ్యం కోసం ప్రాణాలు అర్పించడానికి ఏమాత్రం వెనుకాడడం లేదని నేనూ విన్నాను. అది నిజమేనా?" అని అడిగాడు అశోకుడు.

"నిజమే, ప్రభూ!" అన్నాడు సేనాధిపతి.

"అంటే మహా బలోపేతమైన మగధ సేనలను కళింగలోని సామాన్య ప్రజలూ, రైతులూ తమ ధైర్యసాహసాలతో త్రిప్పిగొట్టగలుగుతున్నారన్న మాట! అంతే కదా? నా ప్రథమ దండయాత్రలోనే, నా పరిస్థితి ఎలా పరిణమించిందో చూశారా? పరాజయం పాలుకాకపోయినప్పటికీ, నేను తీవ్రమైన ఆశాభంగానికి గురికావలసిందేనా?" అన్నాడు అశోకుడు ఆవేదన నిండిన ఆగ్రహంతో.

కొంతసేపు అక్కడ గంభీరమైన నిశ్శబ్దం చోటుచేసుకున్నది. హఠాత్తుగా యశుడు కత్తిదూసి, "నా బొందెలో ప్రాణం వుండగా తమకు అటువంటి పరిస్థితి ఏర్పడదు మహారాజా!" అని సేనాధిపతికేసి తిరిగి, "ఎదురుపడ్డ ప్రతి ఒక్కరినీ వివక్షత చూడకుండా హతమార్చమని మన దళ నాయకులనూ, సైనికులనూ ఆజ్ఞాపించండి. ఎదుటి వాళ్ళు యుద్ధానికి ఆయత్తమయ్యేంతవరకు వేచివుండనవసరం లేదు. సాధ్యమైనంత మందిని సాధ్యమైన పద్ధతిలో హతమార్చండి. వాళ్ళ సంఖ్యాబలం తగ్గితేనే కళింగ ప్రజలను జయించగలం!" అన్నాడు ఆవేశంగా.

రాజు గుడారం ముందు దండోరా శబ్దం వినిపించింది. రాజుకేదో ముఖ్యమైన విషయం తెలియజేయడానికి సైనికులు వచ్చారనడానికి అది సంకేతం.

దూసిన కత్తితోనే గుడారం వెలుపలికి వెళ్ళిన యశుడు, ఒక దళనాయకుణ్ణి వెంటబెట్టుకుని లోపలికి వచ్చాడు.

"తోశాలి కోట పరిసరాలలో యుద్ధం ముమ్మరంగా కొనసాగుతున్నది. ఇప్పటికే మన సైనికులు ఐదువేలమందీ, అంతకు రెండింతలు కళింగులూ హతులయ్యారు. అయితే, ఇక్కడొక ఆశ్చర్యకరమైన

విషయం ఏమంటే ఇప్పటివరకు మన సేనలను ఇంత బలంగా ఎదురొడ్డి యుద్ధం సాగిస్తున్న వాళ్ళు సక్రమంగా శిక్షణ పొందిన సైనికులు కారు. అసలు సైనికులు కోట లోపలే ఉన్నారు!" అన్నాడు దళ నాయకుడు.

"అసలు సైనికులు మన మీదికి ఉరికే లోగా, మన సేనలను సాధ్యమైనంత వరకు బలహీనపరచడమే కళింగుల యుద్ధ వ్యూహం!" అంటూ అశోకుడు తలపంకించి, "ఇక ఆలస్యం చేయడం అనర్థ దాయకం. యశా! మనమే మగధ సేనకు నాయకత్వం వహిద్దాం, పద!" అని ఆజ్ఞాపించాడు.

అందరూ గుడారం నుంచి వెలుపలికి వచ్చారు.

★ ★ ★

యుద్ధభూమికి సమీపంలోని ఒక గ్రామంలో వేలాది మంది కళింగ స్త్రీలు చేరి, పగటిపూట వంటలు వండి, పొద్దు గూకగానే సైనికులకు ఆహారం అంద జేస్తున్నారనీ, క్షతగాత్రులకు చికిత్సలు చేస్తు న్నారనీ చారుల ద్వారా తెలియవచ్చింది. వెంటనే సేనాధిపతి సైనిక దళాలను వెంటబెట్టుకుని స్త్రీలు వంట చేస్తున్న గ్రామాన్ని చేరుకున్నాడు. సైనికులు గ్రామా న్నంతటినీ అగ్నికి ఆహుతి చేశారు.

అయినా స్త్రీలు ఏమాత్రం భయపడ కుండా మండుతూన్న ఇళ్ళనుంచి కట్టెలను లాక్కుని, శాపనార్థాలు పెడుతూ వాటితో సైనికులను ఎదుర్కొన్నారు. కాని కొంత సేపటికి వాళ్ళందరూ సైనికుల చేతుల్లో దారుణంగా ప్రాణాలు కోల్పోయారు.

ఆ రోజంతా కోట సమీపంలో ఘోర మైన యుద్ధం జరిగింది. ఉభయపక్షాల లోనూ వేలాదిమంది మరణించారు. మరునాడు యశుడు అశోకుడి దగ్గరికి వెళ్ళి నమస్కరించి, "ఒక శుభవార్త మహారాజా! కోటకు ఒక వైపున వున్న బలమైన గోడ కొంచెం కూలిపోయింది. నిపుణులైన సైనికులను ఆ బిలంగుండా పంపించి, లోపలనున్న పాలకులను హతమార్చమని ఆజ్ఞాపించాను. పాలకులు హతులయ్యారంటే కోట పతనం తప్పదు. అంతటితో మన దండయాత్ర విజయవంతంగా పరిసమాప్తమవుతుంది!" అన్నాడు.

"చాలా సంతోషకరమైన వార్త తెచ్చావు, మిత్రమా!" అంటూ అశోకుడు యశుణ్ణి

కౌగిలించుకుని, "తోశాలి కోట ఉపరి తలంలో నిలబడి—మగధ సామ్రాజ్యంలో అంతర్భాగమైన ఈ కళింగ రాజ్యానికి నా మిత్రుడు యశుణ్ణి మగధ రాజ ప్రతినిధిగా నియమిస్తున్నానని ప్రకటించే క్షణం కోసం నేను ఎంత ఆతృతగా ఎదురు చూస్తున్నానో తెలుసా?" అన్నాడు పట్టరాని ఆనందంతో.

యశుడు సంతోషంగా నవ్వాడు.

యశుడి ఆజ్ఞ ప్రకారమే మగధ సేనాధిపతి తోశాలికోట లోపల వున్న సామంతులైన రాజప్రతినిధుల భవనాన్ని సైన్యంతో చుట్టుముట్టాడు. వారు మొత్తం ఇరవైఒక్క మంది ఉన్నారు. వారిలో పలువురు వృద్ధులు. అయినప్పటికీ శత్రువులతో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందారు.

ఆ తరవాత అశోకుడూ, యశుడూ కోట లోపలికి అడుగుపెట్టారు. అశోకుణ్ణి చూడగానే నెత్తుటి మడుగులో చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఒక వృద్ధుడు, "మీరు మమ్మల్ని హతమార్చిన మాట నిజం. కాని, మా ఆత్మలనూ, ఆవేశాన్నీ హతమార్చలేరు. ఆ ఆవేశం, ఆగ్రహం తరతరాల వరకు చల్లారదు. మిమ్మల్నీ, నిరాయుధులైన మీ స్త్రీలనూ సర్వనాశనం చేసేంతవరకూ మా ఆవేదన చల్లారదు!" అన్నాడు బాధగా.

"నిరాయుధులైన మీ స్త్రీలను చంపిన వారెవరు?" అని అడిగాడు అశోకుడు తల వెనక్కు తిప్పి. కాని ఆ ప్రశ్నకు సమాధానం చెప్పేలోగానే ఆ వృద్ధుడు శాశ్వతంగా కన్నుమూశాడు.

"ఆఖరికి జగత్ప్రసిద్ధమైన తోశాలి కోట మన వశమయింది!" అన్నాడు యశుడు.

"కోట వశమయిందేమో నిజం. కాని కోట లోపల మనుషులెక్కడ?" అని అడిగాడు అశోకుడు ఆశ్చర్యంగా.

"రాజ ప్రతినిధులలో ఏ ఒక్కడు ప్రాణాలతో వున్నా మనం ఈ కోట లోపలికి అడుగు పెట్టడం సాధ్యం కాదు. కోటలోని ప్రజలలో పలువురు హతులయ్యారు. కొందరు గాయపడ్డారు. కొందరు బందీలుగా పట్టుబడ్డారు. అలాంటి వారిని సమీపంలోని దయానదీ తీరానికి తరలించాము," అన్నాడు యశుడు.

"అంటే మనం ఇప్పుడు పట్టుకున్నది నిర్మానుష్యమైన కోటనన్నమాట!" అన్నాడు అశోకుడు.



"నిర్మానుష్యమైనదేకాని, ఈ కోటలో కళింగ వ్యాపారులు తరతరాలుగా దూరతీరాలతో వర్తక వాణిజ్యాలు జరిపి కూడబెట్టిన ధనరాసులు, నిధులు చాలా ఉన్నాయి. ఇకపై కళింగ నౌకలు సముద్రం మీద సాగలేవు కదా!" అన్నాడు యశుడు.

"కళింగ వ్యాపారులు వర్తకవాణిజ్యాలను ఆపివేయడంవల్ల మనకు కలిగే ప్రయోజనం ఏమిటి? వాళ్ళు మన రాజ్యంలో భాగంగా వుంటూ ఎప్పటిలాగే దూరతీరాలలో వర్తకవ్యాపారాలు కొనసాగించవచ్చు కదా?" అని అడిగాడు అశోకుడు.

"అందుకు వాళ్ళు అంగీకరించవచ్చు. అయితే, తమకు బానిసలుగా కాదు; స్వతంత్రరాజ్య పౌరులుగా!" అన్న మాటలు వినిపించాయి.

ఆ మాటలు వినిపించిన వైపుకు తిరిగి చూశాడు అశోకుడు. క్షతగాత్రుడై కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మరొక సామంతు కనిపించాడు.

"నువ్వు ఇంకా ప్రాణంతో ఉన్నావా?" అంటూ అశోకుడి వెనక నడుస్తూన్న దళనాయకుడు—ఆ మాటలన్న సామంతును కత్తితో పొడిచాడు. దాంతో అతడు శాశ్వతంగా కన్నుమూశాడు!

"అనవసరంగా తొందరపడి అతన్నెందుకు చంపావు?" అన్నాడు అశోకుడు కాస్త కోపంగా.

"ప్రభూ! తమరు ఇక్కడ ఉన్నప్పుడు ఎటువంటి అజాగ్రత్తా పనికిరాదు. ఆ సామంతు అలా ధైర్యంగా మాట్లాడుతున్నాడంటే—తన వద్ద ఆయుధం దాచి వుంచడనే నమ్మకమేమిటి? దానిని అతడు తమపైకి విసిరే అపాయం వుంది కదా?" అంటూ దళనాయకుడి చర్యను సమర్థించాడు సేనాధిపతి.

"అయినా, మహారాజు సమక్షంలో, ఆయన అనుమతి లేకుండా ఏ పనీ చేయరాదని తమకు తెలియనిది కాదు కదా?" అన్నాడు యశుడు.

"క్షమించండి, ప్రభూ! ప్రభువుల క్షేమం పట్ల కాంక్షే నన్నాపనికి పురికొల్పింది!" అన్నాడు దళనాయకుడు.

అశోకుడు, యశుడితో, "ఇటువంటి దారుణ పరిస్థితులు మనల్ని దుర్మార్గులుగా మార్చివేయగలవేమో అని అనుమానం కలుగుతున్నది!" అన్నాడు బాధగా. ఆ తరవాత ఆయన సేనాధిపతికేసి తిరిగి,

"నిరాయుధపాణులైన స్త్రీలను మన సైనికులు ఊచకోత కోశారన్నమాట వాస్తవమేనా?" అని అడిగాడు.

సేనాధిపతి తలవంచి కిందిచూపులు చూడసాగాడు.

"మాట్లాడవేం? నిజం చెప్పు!" అని గద్దించాడు అశోకుడు మళ్ళీ.

"వాళ్ళు నిరాయుధపాణులైన మాట నిజమే. కాని మన శత్రు సేనలకు ఆహార పానీయాలందిస్తూ పరిచర్యలు చేశారు. మన సైనికులకన్నా వాళ్ళెంతో సుశిక్షితులు; శ్రమజీవులు. కళింగ సేనలలోని ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీయడానికి వాళ్ళను నాశనం చేయక తప్పలేదు!" అన్నాడు సేనాధిపతి.

"వాళ్ళెక్కడ ఉండేవారు?" అని అడిగాడు అశోకుడు.

"రాజ్యం నలుమూలల నుంచీ వచ్చారు. ఇక్కడికి సమీపంలోని గ్రామంలో బస చేశారు!" అన్నాడు సేనాధిపతి.

"నువ్వు నన్ను అక్కడికి తీసుకుపోవాలి!" అంటూ అశోకుడు వెనుదిరిగాడు.

యశుడూ, సేనాధిపతీ ఆయన్ను అనుసరించారు.

కోటకు వెలుపల నిలబడిన ఉపసేనాధిపతి రాజుకు నమస్కరించి, "ప్రభూ! లక్షకు పైగా కళింగ ప్రజలు హతులయ్యారు. అంతకన్నా ఎక్కువమంది బందీలుగా పట్టుబడ్డారు. యుద్ధం దాదాపు ముగిసినట్టే!" అన్నాడు.

అశోకుడు మౌనంగా తలపంకించి గుర్రం అధిరోహించాడు. యశుడు, సేనాధిపతి కూడా ఆయన్ను అనుసరించారు.

అంగరక్షకులు వెంటరాగా, అశోకుడు నగరం శివారులోని ఆ గ్రామాన్ని సమీపించాడు. గ్రామం చుట్టూ నక్కలూ, రాబందులూ శవాలను పీక్కుతింటున్నాయి. అక్కడి శోకమయమైన దృశ్యాలూ, అంతకు మించి నిశ్శబ్దమూ ఆయన హృదయ భారాన్ని పెంచాయి.

"యశా! ఇప్పుడు కళింగను జయించాము. ఇకపై నువ్వే ఈ రాజ్యానికి పాలకుడివి! నేను...." అశోకుడు మాటను పూర్తి చేసే లోగా పకపకమంటూ ఒక స్త్రీ నవ్వడం వినిపించింది. మరుక్షణమే యశుడు గుండెలు పట్టుకుని గుర్రంపై నుంచి నేలకు ఒరిగి పోయాడు. అతని గుండెలోకి బాణం చొచ్చుకుపోయింది!

అశోకుడూ, సేనాధిపతీ గుర్రంపై నుంచి కిందికి దిగారు. ఆ బాణం వేసిన వ్యక్తిని



పట్టుకోమని సేనాధిపతి సైనికులను ఆజ్ఞాపించాడు.

"నాకోసం వెతకనవసరంలేదు. నేను ఇక్కడే ఉన్నాను!" అంటూ ఒక అందమైన స్త్రీ చేతిలో బాణంతో అక్కడికి వచ్చింది. దళనాయకుడు ఆమెను పట్టుకున్నాడు.

నేలకు ఒరిగిన మిత్రుడి దగ్గరికి వెళ్ళాడు అశోకుడు. యశుడు మాట్లాడడానికి ప్రయత్నించాడుగాని, సాధ్య పడలేదు. ఒక్క క్షణం దిగ్భ్రాంతికి లోనైన అశోకుడు, ఆ తరవాత స్థిమితపడి లేచి నిలబడి, పట్టుబడిన యువతికేసి చూస్తూ, "ఎంత ఘోరం తలపెట్టావు?" అన్నాడు.

"కళింగను ఎవరూ జయించలేరని రుజువు చేశాను. అంతేకాదు; తమరు మాపై మరొక పాలకుణ్ణి నియమించలేరని కూడా ప్రత్యక్షంగా నిరూపించాను. అధికారం కోసమని ఈ భూమిపై ఎవరు కాలుమోపినా ఇదే గతి పడుతుంది!" అన్నదా యువతి దృఢమైన కంఠస్వరంతో.

"ప్రభూ, ఈ ధిక్కారం సహించరానిది. ఈ పాతకురాలిని చంపడానికి నన్ను అనుమతించండి!" అన్నాడు దళనాయకుడు.

"వద్దు, దళపతీ వద్దు! ఆమె కావాలనుకుని వుంటే మరింత హాని తలపెట్టి వుండవచ్చు. నాపై గురిపెట్టిన బాణం, మహారాజు మీదికి గురిపెట్టి వున్నట్టయితే— మన దండయాత్రనే నిష్ప్రయోజనంగా, అర్థరహితంగా మార్చివుండేది! మనకు తీరని పరాభవం ప్రాప్తించి ఉండేది. ఆమెను బ్రతకనివ్వండి..." అన్న యశుడు ఆపైన మాట్లాడలేకపోయాడు.

అంతలో ఒక సైనికుడు తెచ్చిన నీళ్ళను అశోకుడు యశుడికి త్రాగించడానికి ప్రయత్నించాడు. కాని యశుడు అంతలోనే ప్రాణం వదిలాడు.

అంతటా శ్మశాన ప్రశాంతత ఆవరించింది. మిత్రుడి ఆఖరి మాటలను గుర్తు చేసుకుంటూ అశోకుడు అతడి భౌతిక కాయం వద్ద చతికిలబడ్డాడు: ఆ యువతి కొద్దిగా భిన్నంగా బాణం గురిపెట్టి ఉన్నట్టయితే దండయాత్ర, విజయం నిష్ప్రయోజనం అయి ఉండేవి! అవును... ఈ దండయాత్రవల్లా, చేపట్టిన విజయంవల్లా, ఇప్పుడు మాత్రం సాధించిందేమిటి? అని తీవ్రంగా ఆలోచించసాగాడు. —(ముగింపు వచ్చే సంచికలో)



సామ్రాట్ అశోక

15

[కళింగ యుద్ధం ముగిసింది. విజయోత్సాహంతో అశోకుడు, తన మిత్రుడైన యశుణ్ణి కళింగ ప్రాంతానికి రాజప్రతినిధిగా నియమించాలనుకున్నాడు. కాని, యశుడు అంతలోనే చాటు నుంచి ఒక యువతి వేసిన బాణానికి హతుడయ్యాడు. యశుడు ప్రాణం వదులుతూ తనపై బాణం వేసిన యువతిని శిక్షించవద్దని చెప్పాడు. మిత్రుడి మరణం అశోకుణ్ణి తీవ్రమైన మనోవ్యధకు గురి చేసింది. ఆప్తమిత్రుడి మరణం గురించీ, అమాయకుల ప్రాణాలను బలిగొన్న కళింగ యుద్ధం గురించీ అశోకుడు విచారగ్రస్తమైన హృదయంతో తీవ్రంగా ఆలోచించసాగాడు. — తరవాత]

తోశాలీ నగర రాజభవనంలోని శవాలన్నిటినీ తొలగించారు. గడ్డ కట్టుకుపోయిన నెత్తురు మరకలతో నిండిన నేల — బలమైన వానజల్లు పడడంతో పరిశుభ్రమయింది. కాని రాజభవనంలోని ఒక విశాల మంటపంలో కూర్చున్న అశోకుడి మనసు మాత్రం రకరకాల ఆలోచనలతో సుడులు తిరగసాగింది. యశుడికి తగిలిన బాణం తనకు తగిలి వుంటే పరిస్థితులు ఎలా వుండేవని అశోకుడు తీవ్రంగా ఆలోచించసాగాడు. బాణం దెబ్బకు మరణించకుండా తప్పించుకున్నప్పటికీ, ఆయన మనసు మాత్రం ప్రాణం కోల్పోతున్నట్టు విలవిలలాడసాగింది. తనజీవితంలోని కీలకమైన వివిధ ఘట్టాలలో, ఆపద సమయాలలో తనకు అండగా నిలిచిన ఆప్తమిత్రుడు యశుడు — జీవితంలో విడదీయలేని భాగంగా

ఉండేవాడు. అటువంటి స్నేహితుడే లేడన్నప్పుడు తను సాధించిన విజయం ఎందుకు? జీవితంలో విజయానికున్న స్థానం ఎంత? విజయం అంటే ఏమిటి? ఎప్పుడో ఒకప్పుడు హఠాత్తుగా సర్వం శూన్యంగా మారిపోయే మానవ జీవితానికి అసలు ఒక అర్థం అంటూ వుందా? యశుడు తన ప్రతినిధిగా కళింగను పరిపాలించగలడని తాను కలలు గన్నాడు. కాని ఒకవైపున రాజ్యంలో తన సైనికులు రగిల్చిన మంటలు ఆరకముందే, అతడి భౌతికకాయం దయానదీ తీరంలో మంటలకు ఆహుతై, పిడికెడు బూడిదగా మారిపోయింది!

సేనాధిపతి అక్కడికి రాగానే ఆలోచనల నుంచి బయటపడిన అశోకుడు, "ఉజ్జయినికి దూతలను పంపావా?" అని అడిగాడు.

"పంపాను ప్రభూ! తమరు సాధించిన కళింగ విజయాన్నీ; యుద్ధానంతరం యశుడు మరణించిన విషాద ఉదంతాన్నీ మహారాణిగారికి తెలియజేయమని దూతలను పంపాను!" అన్నాడు సేనాధిపతి.

"మనం సాధించిన విజయం ఆమెకు ఎలాంటి సంతోషాన్నీ కలిగించదు. కాని యశుడి మరణవార్త మాత్రం ఆమెకు పిడుగుపాటులా దిగ్భ్రాంతిని కలిగించక మానదు. అతడు ఆమెకు నిజమైన సోదరుడుగా, రక్షకుడుగా ఉండేవాడు!" అన్నాడు అశోకుడు విచారంగా.

"శాంతిని కాంక్షించే రాజ్యం మీదికి నిష్కారణంగా నువ్వు జరిపిన దండయాత్ర కారణంగా ఎందరెందరో స్త్రీ పురుషులు తమ సోదరులనూ, పిల్లలనూ, రక్షకులనూ, భర్తలనూ పోగొట్టుకున్నారు కదా? వాళ్ళను గురించి కూడా కొంచెం ఆలోచించు, మహారాజా!" అంటూ వెలుపలి నుంచి ఒక స్త్రీ కంఠస్వరం వినిపించింది.

సేనాధిపతి వెనక్కు తిరిగి చూస్తూ, "నోర్ముయ్, పిచ్చిదానా!" అని గట్టిగా హెచ్చరించాడు.

తన బాణం దెబ్బతో యశుణ్ణి హతమార్చిన ఆ యువతి చేతులకు సంకెళ్ళతో అశోకుడి ఎదుటికి వచ్చి నిలబడింది.

"తమరే శిక్ష విధిస్తారో తెలుసుకోవాలని, ఆ దుర్మార్గురాలిని మీ సమక్షానికి లాక్కు వచ్చాను," అన్నాడు సేనాధిపతి.

అశోకుడు అమితాశ్చర్యంతో ఆ యువతికేసి కన్నార్పకుండా చూడసాగాడు.

"నేను మూయకపోయినా, మీరు శాశ్వతంగా నా నోరు మూయిస్తారు. మీ ఇష్టానుసారమే కానివ్వండి. కాని ఆ పని చేసే ముందు నా మాటలు కూడా విని కాస్త నెమ్మదిగా ఆలోచించండి. పిచ్చి ఎవరికి? అధికార దాహంతో వేలాది గృహాలను నాశనం చేసి లక్షలాది అమాయక ప్రజలను హతమార్చిన వాళ్ళకా? లేక తమ ప్రజలకు జరిగిన దురన్యాయానికి ఆగ్రహించి ప్రతీకార చర్యకు ప్రయత్నించిన వారికా? ఎవరికి ఉన్మాదం? ఆలోచించండి! నేనొక సామంతుని కుమార్తెను. మీ కారణంగా జరిగిన యుద్ధంలో నా తండ్రీ, సోదరులూ, మా అక్క భర్తా ప్రాణాలు కోల్పోయారు. ఆ దుఃఖాన్ని భరించలేక మా తల్లీ, అక్కా ఆత్మహత్య చేసుకున్నారు. ఇది కేవలం నా వ్యక్తిగతమైన విషాదం! నువ్వు ప్రశాంతమైన మా రాజ్యానికి తలపెట్టిన హాని గురించి ఆలోచించావా? దృఢకాయులందరూ మరణించారు. లేదా బందీలుగా పట్టుబడ్డారు. దాని ఫలితంగా తరతరాలుగా దూరతీరాలతో నిరంతరాయంగా సాగిన మా నౌకా వర్తక వ్యాపారాలు అంతరించిపోయాయి. శ్యామల వర్ణంతో ఆకాశాన్ని చూసి నవ్వే వరిపొలాలు ఇకపై వాటిని చూసే దిక్కులేక మలమల మాడిపోక తప్పదు. రాజ్యంలో కరువు తాండవిస్తుంది. చావగా మిగిలిన స్త్రీలు, పిల్లలు, వృద్ధులు ఆకలి చావులకు గురికాక తప్పదు.



వీటంతటికీ కారణం ఏమిటి? నీ రాజ్యకాంక్ష! విజేతగా నీకు నీవాళ్ళు జేజేలు పలకాలి! మిగిలిన రాజులు నిన్ను చూసి భయంతో గడగడలాడాలి! నీచమైన ఈ పేరాశతో నువ్వు యుద్ధానికి పాల్పడడమే ఈ అనర్థాలన్నిటికీ మూలం!" అంటూ ఇంకా ఏదో చెప్ప సాగిందా యువతి.

"చాలు, ఆపు!" అని గట్టిగా అరుస్తూ సేనాధిపతి తన కత్తి మీద చేయివేశాడు.

"ఆగు, సేనాధిపతీ! ఆమెను మాట్లాడనివ్వు!" అన్నాడు అశోకుడు.

సేనాధిపతి నివ్వెరపోయి మౌనం వహించాడు.

ఆ యువతి మళ్ళీ, "నీ సైనికుల చేత హతులైన నా ప్రజలు వెళ్ళిన చోటికి ఈ



రోజు కాకపోయినా ఎప్పుడో ఒకప్పుడు నువ్వు వెళ్ళక తప్పదు కదా! నాకు పరలోకం గురించి తెలియదు. ఒకవేళ వాళ్ళందరూ నీకోసం ఎదురు చూస్తున్నారనే అనుకుందాం. అప్పుడు నీ గతి ఏమవుతుందో ఆలోచించావా? వాళ్ళందరూ ఒక్కసారిగా నీ మీదికి ఉరికితే ఏం చెయ్యగలవు? ఇక్కడి సేనాధిపతినీ, అంగరక్షకులనూ వెంటబెట్టుకుని వెళ్ళలేవు కదా? ఆయుధాలు పదును పెడుతూన్న నా తండ్రినీ, సోదరులనూ నీ సైనికులు దొంగచాటుగా వచ్చి హతమార్చేశారు. వాళ్ళే నీకక్కడ మొట్టమొదట స్వాగతం పలకాలని ఆశిస్తున్నాను!" అంటూ భవనం ప్రతిధ్వనించేలాగా బిగ్గరగా పకపకా నవ్వసాగింది.

"ప్రభూ! ఆ పిచ్చిదాని వాగుడు అంతం చేయడానికి నన్ను అనుమతించండి!" అన్నాడు సేనాధిపతి.

అశోకుడు తల అడ్డంగా ఊపి, లేచి మౌనంగా ఆ యువతిని సమీపించి, "నీ పేరేమిటి?" అని అడిగాడు.

"కారువాకి!" అన్నదా యువతి.

"కారువాకీ! నువ్వే నా స్థానంలో వుంటే ఏం చేసేదానివి?" అని అడిగాడు అశోకుడు.

"నిష్ప్రయోజనమైన కీర్తికాంక్షనూ, మృగప్రాయమైన రక్తదాహాన్నీ ఈ క్షణమే వదిలిపెట్టేదాన్ని. చేసిన దుష్కార్యాలకు పశ్చాత్తాపం చెందేదాన్ని. ఆయుధాలను పరిత్యజించి, హింసను మానవులు నిర్జించవలసిన పరమహీన గుణంగా ప్రకటించేదాన్ని!" అన్నది కారువాకి ఏమాత్రం తొణకని దృఢమైన కంఠస్వరంతో.

అంతలో అశోకుడి ప్రధాన అంగరక్షకుడు అక్కడికి వచ్చి, "ప్రభూ! ఉజ్జయిని నుంచి దూత వచ్చాడు!" అని చెప్పాడు.

"లోపలికి తీసుకురా!" అన్నాడు అశోకుడు.

వెలుపలికి వెళ్ళిన అంగరక్షకుడు దూతను వెంటబెట్టుకుని మరుక్షణమే లోపలికి వచ్చాడు.

"శ్రీకరా! సరైన సమయానికి వచ్చావు. ఉజ్జయినిలో రాణీ, పిల్లలూ క్షేమంగా ఉన్నారు కదా?" అని అడిగాడు అశోకుడు దూతను.

"ప్రభువులు క్షమించాలి! ఇటువంటి ఘోరమైన వార్తతో తమరిని చూడవలసి వస్తుందని నేనెప్పుడూ ఊహించలేదు!" అన్నాడు శ్రీకరుడు తలవంచుకుని.





ఫరవాలేదు చెప్పు అన్నట్టు తల పంకించాడు అశోకుడు.

"మహారాణి విదీశాదేవి మరణించారు ప్రభూ!" అన్నాడు శ్రీకరుడు గద్గద స్వరంతో.

"హతవిధీ! ఏమిటి నువ్వనేది?" అన్నాడు అశోకుడు దిగ్భ్రాంతితో.

"ప్రభూ! వ్యాపార నిమిత్తం ఉజ్జయిని నుంచి ఇక్కడికి వచ్చిన వర్తకులు కొందరు మొదటిరోజు జరిగిన యుద్ధాన్ని కళ్ళారా చూసి హడలిపోయి ఉజ్జయినికి పారిపోయారు. ఇక్కడి భయానక సంఘటనలనూ, ప్రజలు అనుభవిస్తూన్న బాధలనూ అక్కడి వారికి తెలియజేశారు. ఆ సంగతి మహారాణికి తెలియవచ్చింది. ఆమె ఆ వర్తకులను పిలిపించి విషయం అడిగారు. వాళ్ళు జరిగినది జరిగినట్టు చెప్పేశారు. తన భర్త చేసిన దుష్కృత్యానికి తాను ప్రాయోపవేశం చేస్తానని చెప్పి, ఒక ఆలయంలోకి ప్రవేశించి నిశ్చల ధ్యానంలో కూర్చున్నారు. మూడు రోజులు నిద్రాహారాలు లేకుండా అలాగే కూర్చుని నాలుగవ రోజు స్పృహ తప్పి పడిపోయి ప్రాణాలు వదిలారు!" అన్నాడు శ్రీకరుడు.

అక్కడ కొంతసేపు నిశ్శబ్దం చోటు చేసుకున్నది. ఉన్నట్టుండి కారువాకి పకపకమంటూ నవ్వసాగింది. ఆ నవ్వు రాజభవనంలో ప్రతిధ్వనించింది.

"నవ్వడానికి ఇదా సమయం! నీకు సిగ్గులేదా?" అని గద్దించాడు సేనాధిపతి.

"సేనాధిపతీ! నా జీవితంలో నవ్వుకూ, ఏడ్పుకూ తేడా ఎప్పుడో నశించింది. అసలు వాటికి అర్థం లేదు. ఎప్పుడైనా నవ్వగలను, ఏడ్వగలను!" అంటూ కారువాకి మళ్ళీ నవ్వసాగింది.

"ప్రభూ! ఈ పాతకురాలిని లాక్కుపోయి బంధిస్తాను," అన్నాడు సేనాధిపతి.

"వద్దు. మొదట ఆమె చేతి సంకెళ్ళను తొలగించి, వదిలిపెట్టు!" అని ఆజ్ఞాపించాడు అశోకుడు.

"యశుణ్ణి చంపిన ఈ ఘాతకురాలిని విడిచిపెట్టడమా ప్రభూ!" అన్నాడు సేనాధిపతి ఆశ్చర్యంగా.

"అవును. యశుడే ఆమెను క్షమించాడు. ఆమె బాణాన్ని నా మీదికి గురిపెట్టకుండా తన పైకి వదిలినందుకు కృతజ్ఞతగా అతడా పని చేయమన్నాడు. యశుడి చివరి కోరికను మనం గౌరవించాలి!" అన్నాడు అశోకుడు గంభీరంగా.

సేనాధిపతి సంకెళ్ళు తొలగించగానే కారువాకి, "ప్రభూ! యశుడు చాలా ఉత్తముడనడానికి ఆయన చివరి మాటలే నిదర్శనం! నా కుటుంబాన్నీ, బంధు మిత్రులనూ, అమాయకులైన నా రాజ్య ప్రజలనూ హతమార్చిన మీపై పగ సాధించడానికి — మిమ్మల్నిగాని, యశుణ్ణి గాని చంపాలన్న నిశ్చయంతో విల్లును ఎక్కుపెట్టాను. బాణం వదలడానికి ముందు, మిమ్మల్ని వదిలిపెట్టాలన్న ఆలోచన నాలో ఎందుకో ఆ క్షణంలో కలిగింది. బహుశా మీవల్ల ఈ ప్రపంచానికి ఏదో గొప్ప మేలు జరగాలన్నది విధి నిర్ణయం కాబోలు!" అన్నది.

"అతి భయంకరుడుగా 'చండాశోకుడని' కళింగ ప్రజలచే ద్వేషించబడే నేను ఈ ప్రపంచానికి మేలు చేయగలనా?" అని అడిగాడు అశోకుడు విచారంగా.

"రాజా! ప్రతి మనిషిలోనూ మంచీ, చెడూ రెండూ ఉంటాయి. యశుడు దారుణమైన మరణాలకెన్నిటికో కారకుడు కాడా? అయినా తనకు మరణం సమీపించినప్పుడు ఆయనలోని, ఉన్నత మైన మానవ స్వభావం బయటపడింది కదా? అలాగే ఇప్పుడు చండాశోకుడుగా ప్రజల ద్వేషానికి గురవుతూన్న మీరు, మునుముందు ధర్మమూర్తిగా, ధర్మాశోకుడుగా ప్రజల ఆదరాభిమానాలకు పాత్రులు కావచ్చు. శాంతంగా ఆలోచించండి!" అని చెప్పి కారువాకి అశోకుడికి నమస్కరించి, భవనం నుంచి వెలుపలికి నడిచింది.

* * *

యుద్ధసమయంలో బందీలైన వారంద రినీ విడుదల చేసి, తోశాలి నగరంలో సేనాధిపతిని వుంచి, అశోకుడు ఉజ్జయినికి బయలుదేరాడు. అక్కడ బూడిదగా మిగిలిన విదిశాదేవి ఆరిన చితిని చూసి సజల నయనాలతో మౌనంగా అంజలి ఘటించాడు. కుమారుడు మహేంద్రుడూ, కుమార్తె సంఘమిత్రా ఆయనకు ఇరువైపులా నిలబడ్డారు.

"మీ తల్లి నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేశాను," అన్నాడు అశోకుడు పిల్లలతో ఎంతో బాధగా.

"మీరు దానికి తగిన ప్రాయశ్చిత్తం చేసుకోవచ్చు. ప్రతి దుష్కృత్యానికీ ఒక నిష్కృతి వుంటుంది. తథాగతుడైన బుద్ధుడి దయ మీపై ఎల్లప్పుడూ వుంటుంది!"

అంటూ గురుదేవుడు ఉపగుప్తుడు అక్కడికి వచ్చాడు.

ఆ క్షణం నుంచి అశోకుడి జీవితంలో నూతన అధ్యాయం ఆరంభమయింది. గురుదేవుల బోధకు ముగ్ధుడై, ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించాడు. యుద్ధంపట్ల విముఖత పెంచుకున్నాడు. అహింసను పరమధర్మంగా పాటిస్తూ, రాజ్యంలో హింసను నిషేధించాడు. రాజ్యమంతటా శాంతి, అహింసలు నెలకొనేలాగా అక్కడక్కడ ధర్మరక్షకులను నియమించాడు.

తన రాజ్యకాంక్ష కారణంగా శిథిలమైన తోశాలి కోటకు అభిముఖంగా ధౌలీ కొండపై తన దుష్కృత్యానికి విచారం వ్యక్తం చేస్తూ శిలాశాసనం వేయించాడు. కేవలం మృగబలంతో, కత్తిమొనతో ఎటువంటి విజయాన్నీ సాధించలేము; మంచి పనులతో ప్రజాహృదయాలను ఆకట్టుకోవడం ద్వారానే శాశ్వతమైన విజయం సాధ్యం — అని తాను గ్రహించిన సత్యాన్ని ఆ శిలాఫలకం మీద చెక్కించాడు. తన శాంతి సందేశాన్ని అందులో తెలియజేశాడు.

అటువంటి సందేశాలనే రాజ్యంలో శిలాఫలాకాల మీద చెక్కించాడు. ఇరుగుపొరుగు రాజ్యాలకూ; సిరియా, ఈజిప్టు వంటి దూరదేశాలకూ పండితులైన బౌద్ధమత ప్రచారకులను పంపాడు. ఆయన కుమారుడు, కుమార్తె — మహేంద్రుడు, సంఘమిత్ర శ్రీలంకకు వెళ్ళి అక్కడి రాజునూ, ప్రజలనూ బౌద్ధమతం స్వీకరించేలా చేశారు!

అశోకుడు గొప్ప సమ్రాట్టుగా ప్రపంచ ప్రసిద్ధి గాంచాడు. ఆయన సాధించిన విజయాలూ, అధికారం మాత్రమే దానికి కారణాలు కావు. ఆయన మానవ జాతిపై చూపిన అపారకరుణ, అచంచలమైన విశ్వాసమే అందుకు కారణం. ప్రపంచ చరిత్రలో ఎందరో రాజులు ఎంతో గొప్ప రాజ్యాలు స్థాపించారు. కాని, యావత్ మానవజాతి జ్ఞానం పొంది, మానవులందరూ వివేకవంతంగా మనుగడ సాగించాలని కాంక్షించి — ఆ మహోన్నత లక్ష్య సాధన కోసం తన జీవిత కాలాన్నీ, రాజ్య సంపదలనూ అర్పించిన మొట్టమొదటి గొప్పరాజు అశోకుడు! —(అయిపోయింది)